# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:2 168 ఫిబ్రవరి 2025 హైదరాబాద్

- 'నాక్'గా ఆలోచించాలి
- కార్యాచరణకు తొలి బీజం-"తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024"
- తెలుగు సాహిత్య మహాసభ-2024 దశ-దిశ
- ఆర్ట్స్ కాలేజీ ఆకాశంమీద... కవిత్వం వెన్నెల కురిసింది
- నల్లదీగ శ్రీనివాసాచార్యుల కట్టబ్రహ్మణ చరిత్ర-కావ్యానుశీలన
- సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం:ప్రయోజనాలు

UGC CARE LISTED JOURNAL



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

ఫిబ్రవరి 2025
సంచిక : 2
సంపుటి : 15

UGC APPROVED JOURNAL

UGC CARE LISTED JOURNAL



గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి
**అల్లం నారాయణ**
చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి
ప్రొఫెసర్ గణేష్
ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు
**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల
**క్రాంతి**, జర్నలిస్టు
**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**డా॥ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు పంపాల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
మెయిల్:nadusthunnatelangana@gmail.com
**ఫోన్ నెం.: 9290745490**


# సంపాదకుని ఉత్తరం

*నిజమే,*
*కాని కాలంలో జీవిస్తున్నాం...!*
*అసమ్మతి*
*రాజ్యానికి నేరమనుకున్నాను*
*రాజ్యమంటే మనిషే కదా*
*ఘనీభవించిన ప్రతి మనిషికి*
*ప్రవాహగానం నచ్చదు*
*హితుడు సఖుడు సహచరుడు*
*రాజ్యమైన చోట*
*గంభీరంగా వీచే*
*ఝంఝు మారుతం కంటే*
*మంద్రంగా పలికే పిల్ల గాలే*
*సూర్యోదయాన్ని వాగ్దానం చేస్తుంది*

**28 ఫిబ్రవరి, 2025**

*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

'నాక్'గా ఆలోచించాలి | **డా. చంద్రయ్య శివన్న** | 5

**TLC-2024**

కార్యాచరణకు తొలిబీజం 'తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024 | **ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు** | 7

ఈ దశాబ్దపు ఉత్తమ సాహిత్య సమాలోచన 'తెలుగు సాహిత్య మహాసభ-2024' | **ఆచార్య వెంకటరామయ్య గంపా** | 11

'తెలుగు సాహిత్య మహాసభ-2024' దశ-దిశ | **డా. వెల్దండి శ్రీధర్** | 18

ఆర్ట్స్ కాలేజీ ఆకాశం మీద కవిత్వం వెన్నెల కురిసింది | **అన్నవరం దేవేందర్** | 26

వేయి ఉద్యమాల వేకువపూవు 'ఉస్మానియా తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024' | **సిరికి స్వామినాయుడు** | 28

చారిత్రక సందర్భంలో జరిగిన తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024 | **మెర్సీ మార్గరేట్** | 31

**పరిశోధన**

సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం: ప్రయోజనాలు | **ఆచార్య పమ్మి పవన్‌కుమార్, బొమ్మగాని నవీన్‌కుమార్** | 33

తెలంగాణ కథాసాహిత్యంలో పాలమూరు జిల్లా కథ-ప్రత్యేకత | **బి.వెంకటేశ్** | 37

**పుస్తక సమీక్ష**

బంజారా కథాసంపుటి 'ఝోళి' కథలు- విశ్లేషణ | **డా. ఆజ్మీరా సిల్మానాయక్** | 40

**పల్లెసుద్దులు**

'మల్లేషం పెండ్లి సూపులు' | **రవి కుర్మకోరె** | 47

**పరిశోధన పరిచయం**

నల్లదీగ శ్రీనివాసాచార్యుల కట్టబ్రహ్మన చరిత్ర-కావ్యానుశీలన | **డా. శోభన్‌బాబు** | 48

సంపాదకీయం

# 'నాక్'గా ఆలోచించాలి

డా. చంద్రయ్య శివన్న

*NAAC-(నాక్ -నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) జాతీయ మదింపు, ప్రమాణీకరణ మండలి. 1994లో ప్రారంభమైంది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగి, యు.జి.సి పరిధిలో పనిచేసే సంస్థ. దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలు అనుసరిస్తోన్న విద్యాప్రమాణాలను మదింపు చేస్తుంది. ప్రమాణాలను నిర్ధారిస్తుంది. ముఖ్యంగా ఇది, విద్యార్థుల, కళాశాలల వసతులు (infrastructure), బోధన ప్రమాణాలు, పరిశోధనల ఫలితాలు, పాలన (governance), ఇతర అనేక విషయాలను పరీక్షిస్తుంది. మదింపుచేసి, విద్యాలయాలకు గ్రేడ్స్ మంజూరు చేస్తుంది. ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి మదింపుచేస్తూ, విద్యావ్యవస్థ నిరంతరం పరిపూర్ణత్వంవైపు నడవడానికి దోహదపడుతుంది.*

*'నాక్' గుర్తింపు ఉన్న విద్యాసంస్థ ప్రతిష్ఠాత్మకమైందిగా, పేరుప్రఖ్యాతులు కలిగినదిగా విద్యార్థులను, పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ముఖ్యంగా, విదేశీ విద్యార్థులు, నాక్ గుర్తింపు ఉన్న విద్యాసంస్థల్ని ఎంపిక చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు. ఈ విద్యాసంస్థలో జాతీయ, అంతర్జాతీయ భాగస్వామ్యం పెరుగుతుంది. తద్వారా ఉన్నత ప్రమాణాలు నెలకొల్పబడతాయి. నాక్ గుర్తింపు ఉన్న విద్యాసంస్థలకు స్వయంప్రతిపత్తి ఉండటంతోపాటూ, ప్రభుత్వంనుంచి వచ్చే అనేక ఆర్థిక సహాయాలు సులభతరమవుతాయి. స్వయంప్రతిపత్తివల్ల 'మార్కెట్'కు అనుకూలమైన కొత్త కోర్సుల రూపకల్పన, సిలబస్‌లో మార్పులు చేసుకోవచ్చు. విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధనలు కొనసాగించటానికి నిధులు సమకూరుతాయి. అంతర్జాతీయ విద్యాసంస్థలతో ఒప్పందాల (MOU)కు అవకాశాలు సుగమమవుతాయి. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల్ని ఇవ్వడానికి (campus placements) జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగ సంస్థలు ఆసక్తి చూపుతాయి. అర్హత కలిగిన అధ్యాపకులు, పరిశోధకులు విద్యాసంస్థలో పనిచేయడానికి ప్రాధాన్యతనిస్తారు. గ్రంథాలయాలు, ల్యాబ్స్, పరిశోధన కేంద్రాల ఏర్పాటు సులభమౌతుంది. విద్యార్థులు, అధ్యాపకులు దేశీయ, విదేశీయ స్కాలర్‌షిప్స్ పొందడానికి మెరుగైన అవకాశాలు ఏర్పడుతాయి. కాబట్టి, ఉన్నత విద్యాసంస్థలన్నీ నాక్ గుర్తింపుకోసం ప్రయత్నిస్తుంటాయి. ఈ క్రమంలో కొన్ని కార్పోరేట్ విద్యాసంస్థలు నాక్ బృందాన్ని ప్రలోభాలకు గురిచేయడం ఇటీవలికాలంలో మనం చూసాం. "నాక్ ప్రమాణాలు పాటిస్తున్నారు' అనే ఉద్దేశంతో కార్పోరేట్ విద్యాసంస్థలకు అనేక ప్రయోజనాల్ని చేకూర్చే 'గుర్తింపు'ను నాక్ బృందం ఇస్తోంది. మంచిదే. కానీ, ప్రభుత్వ సహాయ, సహకారాలతోపాటూ అన్ని రకాల లబ్ధులు కార్పోరేట్ విద్యాసంస్థలకే దక్కేట్టుచేయడం కూడా సరికాదు. వాటికుండే ఆర్థిక ప్రణాళికవల్ల అవి ఎలాగూ సుస్థిరంగా కొనసాగుతాయి. ఎటొచ్చీ సమస్యలన్నీ ప్రభుత్వం ఉన్నత విద్యాసంస్థలకే.*

*నాక్ బృందాలు ప్రభుత్వ, ప్రైవేట్/కార్పోరేట్ విద్యాసంస్థలను సమాన ప్రమాణాలతో మదింపుచేయడం సరైంది కాదు. ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలు, అనేక రకాల సమస్యలతో ముఖ్యంగా, నిధులలేమితో సతమతమవుతున్నాయి. కేంద్రప్రభుత్వం, 2025-2026 ఆర్థిక సంవత్సరంలో 5065348 కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే, అందులో విద్యారంగానికి 128650 కోట్లు అంటే కేవలం-2.5 శాతం మాత్రమే కేటాయించింది. భారతదేశంలాంటి పెద్దదేశాల్లో ఇది కనీసం 5 శాతమైనా ఉండాలని విద్యావేత్తల అభిప్రాయం. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 291159 కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే, అందులో విద్యారంగానికి 21801 కోట్లు అంటే, కేవలం-7.5 శాతం మాత్రమే కేటాయించింది. రాష్ట్రాల్లో ఇది కనీసం 10 శాతమైనా ఉండాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. పెరుగుతోన్న విద్యావసరాలకు ఈ మొత్తం ఏమాత్రం సరిపోవడంలేదు. నిధులలేమి ప్రభుత్వ ఉన్నత విద్యాభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారింది. కనీసం, అధ్యాపకుల, అధ్యాపకేతర ఉద్యోగుల జీతాలు చెల్లించటానికే ఈ బడ్జెట్ సరిపోవడంలేదు. ఇక నాక్ ప్రధానంగా పరిగణించే మౌలిక వసతుల (infrastructure) కల్పన ఎలా సాధ్యమవుతుంది? అత్యాధునిక ల్యాబుల ఏర్పాటు, శాస్త్ర పరికరాలు, కంప్యూటర్ ల కొనుగోళ్ళు మాట అలా ఉంచితే, కనీసం ఉన్నవాటి మెయింటెనెన్స్ కు కూడా డబ్బులు ఉండడంలేదు. గ్రేడింగ్ ఇచ్చే సమయంలో నాక్ బృందం వీటిని పరిగణించపోతే ప్రభుత్వ ఉన్నత విద్యారంగానికి తీవ్రమైన నష్టం వాటిలే అవకాశం లేదా?*

*ఇక, పర్మినెంట్ అధ్యాపకుల నియామకం ఊహకందని మాటే. ఒక్క తెలంగాణలోనే కాదు దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత*

*విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్య ఇది. తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకం చేపట్టక, దాదాపు 15 ఏళ్లు అవుతోంది. తాత్కాలిక, పార్ట్ టైం అధ్యాపకులతోనే విశ్వవిద్యాలయాలు పదేళ్లుగా విద్యనందిస్తున్నాయి. ప్రభుత్వ దృష్టిలో వీరు ఇతర పర్మినెంట్ అధ్యాపకులతో సమానం కాదు. వారికి అందే అన్ని రకాల ప్రోత్సాహకాలు ఈ తాత్కాలిక, పార్ట్ టైం అధ్యాపకులకు అందవు. ఇక రీసెర్చ్ ఎలా సాధ్యం? రీసెర్చ్ పేటెంట్లు అనే మాటను ఇక పక్కకు పెట్టాల్సిందే. అన్ని విద్యార్హతలున్నా యుజిసి ప్రాజెక్టులవంటి అనేకమైనవాటికి వీరు అనర్హులు. దీనివల్ల విశ్వవిద్యాలయాల్లో బోధన, పరిశోధన దాదాపుగా పడకేసాయి. అంపశయ్యమీద ఉన్నాయి. పర్మినెంట్ అధ్యాపకుల నియామకాలలేమి నాక్ ప్రమాణాల దృష్టిలో ప్రధానలోపం. ఇది బోధనపైన, పరిశోధనపైన తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని వారి అభిప్రాయం. పైగా నాణ్యతను దెబ్బతీస్తుంది. హైదరాబాదులో వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఒక ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలో పనిచేస్తున్న 264 మంది అధ్యాపకుల్లో కేవలం 14 మంది మాత్రమే పర్మినెంట్ వారు ఉన్నారంటే, ఇక జిల్లాల్లో ఉన్నత విద్యాసంస్థల్లో పరిస్థితిని అంచనావేయడం అంతకష్టమేమీకాదు. నాక్ బృందం వీటిని పట్టించుకోకపోతే ఎలా?*

*దేశంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లోకి పదేళ్లక్రితంనుండే పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు అడుగుపెడుతున్నారు. వారంతా చదువుల్లోకి వస్తోన్న మొదటితరం విద్యార్థులు. ప్రైవేట్/కార్పోరేట్ విద్యాసంస్థల్లో చదువుకోవడానికి వాళ్ల ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించదు. అటువంటివారికి చదువుకునే అవకాశం వచ్చేసరికి ప్రభుత్వ విద్యాసంస్థలు దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తోన్న ఉన్నత విద్యాసంస్థల్లో దాదాపు తొంబై శాతం విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలనుంచే వస్తుంటారు. వారంతా ఎన్నో కలలతో కళాశాలల్లోకి చదువుకోడానికి వస్తారు. మౌలిక వసతుల లేమి, అధ్యాపకుల కొరతను సాకుగా చూపి నాక్ బృందం గుర్తింపును నిరాకరిస్తే, వీళ్ల పరిస్థితి మరింత దిగజారిపోతుంది. వీళ్లకు అందాల్సిన కనీస నాణ్యమైన విద్య కూడా అందదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి వచ్చే అన్నిరకాల ఆర్థిక ఫలితాలు వీళ్ల దరిచేరవు. ఇది ఇలాగే కొనసాగితే, అర్హులైన అధ్యాపకులు ఆసక్తి చూపక, వారి స్థానంలో అనర్హులు చేరిపోయి విద్యావ్యవస్థలు సమూలంగా నాశనమైపోతాయి. నైపుణ్యాల కొరతవల్ల విద్యార్థులకు ఉద్యోగాల కల్పన* (campus placements) *లేక నిరుద్యోగులుగా మారే అవకాశాలే ఎక్కువ. పేదవర్గాలకు చెందిన వీరంతా మరింత పేదరికంలో కునారిల్లిపోవడం రాష్ట్ర, దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం. నాక్ బృందం కెటాయించబోయే 'గ్రేడ్' లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఇకముందు రాబోయే ఎన్నో లక్షల మంది పేద విద్యార్థులు, కనీసం నాణ్యమైన విద్యను పొందాలో లేదో నిర్ణయిస్తుంది. ప్రభుత్వం విద్యావ్యవస్థలమీద ప్రజలకు విశ్వాసం ఉండాలా, వద్దా అనే అంశాన్ని ప్రభావితంచేస్తుంది.*

*దేశంలో ప్రైవేట్/కార్పోరేట్ విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడానికి నాక్ బృందం అనుసరిస్తోన్న ఈ పద్ధతి ఒక ప్రధాన కారణం. ప్రైవేట్/కార్పోరేట్ విశ్వవిద్యాలయాల్లో చదువుకునే స్థోమత లేక, ఈ రకమైన ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటే, ఉద్యోగాలు రాక పేద, మధ్యతరగతి విద్యార్థులు క్రమంగా నిరాశానిస్పృహల్లో మగ్గిపోతున్నారు. శాస్త్ర, సాంకేతికరంగంలో కృషిచేసి, దేశసంపదను పెంచే పనిలో నిమగ్నంకావాల్సిన 60-70 శాతం విద్యార్థులు సాదాసీదా జీవితాల్ని వెల్లదీస్తున్నారు. పి హెచ్.డీలు చేసిన విద్యార్థులు ప్రభుత్వ ప్యూన్ ఉద్యోగానికి దరఖాస్తు చేస్తున్నారంటే మన విద్యావ్యవస్థ నైపుణ్యాలలేమికి అద్దం పడుతోంది. ఇవన్నీ గాడినపడాలంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థకు సరిపడేంత నిధుల్ని కేటాయించటం ఎంత అవసరమో, స్వయంప్రతిపత్తి సంస్థ అయిన నాక్ ఇచ్చే గుర్తింపూ అంతే అవసరం. కాబట్టి నాక్ బృందం, గుర్తింపు ఇచ్చేటప్పుడు ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలకు ఉండే ఈ అనేక రకాల పరిమితులను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రభుత్వ ఉన్నత విద్యావ్యవస్థలను, కార్పోరేట్ విద్యావ్యవస్థలను సమానమైన ప్రమాణాలతో చూడకూడదు. ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలకు మినహాయింపులు ఇచ్చే విషయంలో 'నాక్'గా ఆలోచించాలని విజ్ఞప్తి.*

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**

**వెబ్ పేజీ:** https://nadustunnatelangana.com

# కార్యాచరణకు తొలిబీజం "తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024

—ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు, ఆ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 15,16 &17 ఫిబ్రవరి, 2024 తేదీల్లో TELUGU LITERARY CONGRESS (TLC) 2024ను ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. ఆ సమావేశాలకు తెలుగుశాఖ నాటి అధ్యక్షులు, ఆర్ట్స్ కళాశాల నేటి ప్రిన్సిపాల్ ఆచార్య చింతకింది కాశీం కన్వీనర్ గాను, నాటి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, తెలుగు శాఖ నేటి అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ కో కన్వీనర్ గాను వ్యవహరించారు. ఈ మహాసభలు నిర్వహించడానికి తమకున్న సంకల్పాన్ని, లక్ష్యాలను, ఆశయాలను స్పష్టంగా తమ కరపత్రంలో వివరించారు.

"గొప్ప సృజనశక్తితో, పరిశోధన పటిమతో, వ్యాఖ్యాన బలంతో తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ యవనిక మీద నిలబెడుతోన్న తెలుగు సాహితీవేత్తలు ఎంతోమంది ఉన్నారు. వారందరినీ ఒకే వేదిక మీదనుంచి మాట్లాడించాలనే సంకల్పంతో మూడు రోజుల తెలుగు సాహిత్య మహాసభకు రూపకల్పన జరిగింది. ఈ మహాసభలో దేశం నలుమూలల నుంచి లబ్ధప్రతిష్ఠులైన 150మంది సాహితీవేత్తలు పాల్గొంటారు."

"వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం విభిన్నమైన ప్రక్రియలతో, వైవిధ్యమైన తాత్వికతతో ఎంతో సంపద్వంతంగా ఉంది. దీన్నంతటినీ మదింపు చేసుకోడానికి నిపుణులైన సాహితీవేత్తల్ని ఆహ్వానించటం ఈ మహాసభ కీలకోద్దేశం."

"చరిత్రకు ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, సైన్స్ కు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ లు ఉన్నాయి. అటువంటి విశాల ప్రాతిపదికను, దార్శనిక భావనను తెలుగు సాహిత్య ప్రపంచంలో నెలకొల్పాలనే ప్రధాన లక్ష్యంతో తెలుగు సాహిత్య మహాసభ Telugu Literary Congress (TLC)-2024 జరుగుతోంది."

"దీనిద్వారా మేధామథనం, సృజన రంగాల మూల్యాంకనం చేసి తెలుగు సాహిత్యానికి దిశా నిర్దేశాన్నివ్వడం దీని ముఖ్య లక్ష్యం."

"ఈ మహాసభలో పాల్గొనే సాహితీవేత్తలు, సాహిత్య విద్యార్థులు, అధ్యాపకులు, సాహిత్య పిపాసకులు తెలుగు భాష, సాహిత్యాలపట్ల, సంస్కృతిపట్ల గాఢానుభూతిని, ఎరుకను పొందుతారు."

తెలుగు సాహిత్యంలో అభ్యుదయ, విప్లవ రచయితల మహాసభలు జరిగినప్పుడు తమ లక్ష్యాలను స్పష్టంగా ప్రకటించారు. అంతటి చారిత్రక ప్రాధాన్యాన్ని ఈ సమావేశాలు కూడా అనుసరించాయి. ఆ విధంగా తెలుగు సాహిత్య చరిత్రలో ఇవి శాశ్వతంగా నిలిచిపోయే మహాసభలని పై లక్ష్యాలు తెలియజేస్తున్నాయి.

ఈ లిటరరీ కాంగ్రెస్ జరపాలనే ఆలోచన బహుశా ఆచార్య కాశీంగారి మెదడులోనే రూపుదిద్దుకుందని అనుకుంటున్నాను. ఆయన ఏ కార్యక్రమాన్ని నిర్వహించినా, ప్రణాళికాబద్ధంగా, శ్రద్ధాసక్తులతో, పటిష్టమైన ప్రణాళికతో నిర్వహిస్తారు. గతంలో ఆయన తెలుగు అధ్యాపకులుకోసం నిర్వహించిన రిఫ్రెషర్ కోర్సు చూసాను. ఉభయ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో ఆ కోర్సులో పాల్గొన్నారు. నన్ను కూడా ఒక రిసోర్స్ పర్సన్ గా దానిలో భాగస్వామ్యం చేయడం వలన వారి అధ్యాపకుల ఫీడ్ బ్యాక్ ని గమనించగలిగాను. అలాగే, తెలుగు భాషాసాహిత్యాలలో పరిశోధన చేస్తున్న కొంతమంది పరిశోధకులు నిర్లక్ష్యం చేస్తున్న పరిశోధన విధానం గురించి ఆయనకు ప్రత్యేక శ్రద్ధ ఉంది. అందువల్ల ఆయన తెలుగు శాఖ అధ్యక్షులుగా ఉన్నప్పుడు దేశవ్యాప్తంగా పరిశోధన విధానంలో అనుభవం ఉన్న ప్రొఫెసర్స్ చేత ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. అవి కూడా ఎంతో




విజయవంతమై మంచి ఫలితాలను ఇచ్చాయి. వాటిలో కూడా ప్రత్యక్షంగా పాల్గొని గమనించి చెబుతున్న మాట ఇది. అటువంటి మంచి ఆలోచనలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాట వేయాలనే దృష్టిగల, సామాజిక నిర్మాణంలో ప్రగతిశీల భావాలు కలిగిన ఆచార్య సి. కాశీం ఈ తెలుగు లిటరరీ మహా సభలు నిర్వహించడంలో ప్రముఖ పాత్ర వహించారని తెలుస్తుంది. ఈ మహాసభలలో పాల్గొనే ప్రతి ఒక్కరితో ఆయన మాట్లాడారు. కొంతమందితో ఎలాంటి అంశాలు చర్చనీయాలో లోతుగా చర్చించారు కూడా! ప్రొఫెసర్ కాశీంకు, పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ థింకర్స్ చెప్పే POSDCORB (Planning, Organizing, Directing, Coordinating, Reporting and Budgeting) గురించి స్వీయ అనుభవం ఉంది. లేకపోతే ఒక్క చేతి మీద ఈ తెలుగు లిటరరీ మహాసభను ఇంత విజయవంతంగా నిర్వహించడం కష్టం.

ఈ మహాసభలో నేను కూడా ఒక విషయ నిపుణుడు (Resource person)గా పాల్గొనడానికి అవకాశం కలిగినందుకు ఎంతో సంతోషిస్తున్నాను. మూడు రోజులపాటు జరిగిన ఈ లిటరరీ కాంగ్రెస్ లో ఆయారంగాలకు చెందిన వాళ్లంతా భాగస్వాములయ్యే విధంగా వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

17 ఫిబ్రవరి, 2024రోజు మధ్యాహ్నం 2:00 నుంచి 4:00వరకు "తెలుగు శాఖాధ్యక్షుల చర్చాగోష్ఠి"ని ఏర్పాటుచేశారు. ఈ గోష్ఠిలో దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో ఉన్న తెలుగు శాఖాధ్యక్షులందరినీ ఒకే వేదికమీదకి పిలిపించి, "తెలుగు భాషాసాహిత్యాల గమనం, గమ్యం" అనే అంశంపై కీలకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలోనే నేను పాల్గొన్నాను. ఈ సమావేశానికి నాటి తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సి. కాశీం అధ్యక్షత వహించారు. పూర్వ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆచార్యులు గుండెడప్పు కనకయ్య, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు శాఖ అధ్యక్షులు, డీన్స్, కళాశాల ప్రిన్సిపల్స్, కొంతమంది ఆచార్యులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాసాహిత్యాల సమస్యలు వాటి పరిష్కార మార్గాలు, దానికోసం చేపట్టవలసిన కార్యాచరణను ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అంతేకాకుండా వాటిని అమలుచేయడానికి ఒక కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. ఈ సాహిత్య మహాసభ చర్చించినవీ, ఆలోచించవలసిన వాటిలో కింద పేర్కొన్న అంశాలు ముఖ్యమైనవి.

సమకాలీన సమాజానికి అనుగుణంగా తెలుగు భాషాసాహిత్యాల అధ్యయనం కొనసాగుతుందా? దీనికి గల

కొన్ని కారణాలు అన్వేషించే ప్రయత్నం చేశారు.

నేటికీ పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలలో కులమతాలకు అతీతంగా పాఠ్యాంశాల ఎంపిక జరగకపోవడం తెలుగు భాషాసాహిత్యాల అధ్యయనంలో ఒక లోపంగా చాలామంది భావించారు.

ఇతర శాస్త్రాలవలే తెలుగు చదువుకున్నవాళ్ళు కూడా జ్ఞానాన్ని ఆర్జిస్తున్నామనే స్పృహ కలిగించడంలో సిలబస్ రూపకల్పనలో స్వేచ్ఛ ఉండాలనే అభిప్రాయం వ్యక్తమైంది.

సమకాలీన సామాజిక, ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా తెలుగు భాషతోపాటు, ఆంగ్ల భాషలో కూడా శక్తివంతంగా కమ్యూనికేట్ చేయగలిగిన సామర్థ్యాన్ని అలవర్చుకునే ప్రణాళికలు రూపొందించుకోవలసిన అవసరం ఉంది.

తెలుగు చదువుకునేవారికి ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయనేది వాస్తవం. ఆర్థిక సరళీకృత విధానాలు, ప్రపంచీకరణ తెచ్చిన పరిస్థితులు దీనికి మూల కారణం. దీనిపై ప్రభుత్వం, బుద్ధిజీవులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి.

చైనా, జపాన్, కొరియా మరికొన్ని దేశాలలోను, మన పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలోను మాతృభాషలో ఆలోచించడం, అధ్యయనం చేయడం, దాన్ని నిత్యజీవితంలో భాగంగా ఉపయోగించుకోవడంలో అను సరిస్తున్న వ్యూహాలను తెలుగు భాష మాతృభాషగా కలిగినవాళ్లు అధ్యయనం చేయాలి.

శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులను తెలుగువాళ్లు కూడా సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశాలను అన్వేషించాలి.

ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు (జి.వో.లు), కోర్టుతీర్పులు మాతృభాషలో వచ్చేందుకు కృషిచేయాలి. ఒకవేళ ఒకటి రెండు ఇటువంటి ప్రయత్నాలు జరిగినా, కృత్రిమమైన అనువాదాలను లేదా భాషను ఉప యోగిస్తున్నారు. ఇప్పటికే ప్రజలలో కలిసిపోయిన అన్యదేశ్య భాషాపదాలను వాడుకోవడంద్వారా, మణిప్రవాళశైలి ద్వారానైనా తొలి దశలో తెలుగుని మరింత ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేయొచ్చు.

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ, సంస్థల్లోను తెలుగు భాషలో కచ్చితంగా నామసూచికలు ఉపయోగించేందుకు చర్యలు తీసుకోవడానికి ఒత్తిడి తీసుకురావడం అవసరం.

కృత్రిమ మేధను (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) తెలుగు భాష సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ఆయా డేటా బేస్ లలో తెలుగు భాషలో ఉన్న సాహిత్యాన్ని వాడుకోవడానికి అనుమతించే అవకాశాలు కూడా ఆలోచించాలి.

సాహిత్య చరిత్రల పునర్నిర్మాణం జరగాలి. అన్ని ప్రాంతాలకు అన్ని ప్రక్రియలకు సాహిత్య చరిత్రలో సముచిత ప్రాధాన్యాన్ని కలిగించాలి.

తెలుగు భాషలో వైవిధ్యం ఎంతగానో కనిపిస్తుంది. దీన్ని భాషాశాస్త్రవేత్తలు శిష్టభాషలు, శిష్టేతర భాషలనీ, మాండలికాలనీ రకరకాల పేర్లతో అధ్యయనం చేశారు. మా భాష మాండలికం కాదనీ, ప్రత్యేకమైన భాష అనీ వాదిస్తున్నవాళ్లు కూడా ఉన్నారు. అలా సహజమైన భాషలో ఎంతో సృజనాత్మక సాహిత్యం వెలువడుతుంది. వీటిని అన్ని ప్రాంతాలవా ళ్లు అర్థంచేసుకోవడానికి వీలుగా పదప్రయోగ సూచికలు, పదకోశాలు, నిఘంటువులు తయారు కావాలి. వీటిపై విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న తెలుగు అకాడమీ వంటి సంస్థలు దృష్టి కేంద్రీకరించాలి.

జానపద సాహిత్యంలో తెలుగువారి జీవనవిధానానికి సంబంధించిన అనేక అంశాలను గుర్తించి తెలుగు భాషను, సాహిత్యాన్ని సుసంపన్నం చేసుకోవడానికి సమర్థవంతంగా వినియోగించుకోవాలి. ఇప్పటికే జానపద విజ్ఞానంలోని అనేక విషయాలను కార్పోరేట్ కంపెనీలు సమర్థవంతంగా వినియోగించుకుంటూ వ్యాపారాలు చేస్తున్నాయి. వంశపారంపర్యంగా వస్తున్న అనుభవపూర్వక విజ్ఞానాన్ని, దానిలోని శాస్త్రీయతను గుర్తించే ప్రయత్నం చేయాలి.

జానపదుల కళలు, గేయాలను పరిరక్షించుకునే క్రమంలో తెలుగు భాషద్వారా చేయదగిన కృషిని పత్రికలు టీవీలు ప్రచార, ప్రసార మాధ్యమాలద్వారా ప్రాచుర్యంలోకి

తీసుకొస్తూనే, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే జానపద విజ్ఞానంలోని అనేక అంశాలను సినిమాలు, కార్పొరేట్ రంగం శక్తివంతంగా ఉపయోగించు కుంటుంది. కానీ, దాని మౌలికతను వక్రీకరిస్తూ ప్రయోగంగా ప్రాచుర్యంలోకి తీసుకురావడాన్ని గమనించాలి.

తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి చరిత్రలను దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలు సంస్థలలో భాగం చేయగలగాలి. దేశ సమైక్యతలో అంతర్భాగమే భాషాసమైక్యత. అందువల్ల దేశ సమైక్యతకు ప్రాంతీయ భాషల అధ్యయనం అన్ని విశ్వవిద్యాలయాలలోనూ కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి లిటరరీ కాంగ్రెస్ ప్రయత్నం చేయాలి.

లిటరరీ కాంగ్రెస్ ఏడాదికి ఒకసారి లేదా రెండుసార్లు నిర్వహించుకోవాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లోను, దేశంలోని ఇతర ప్రాంతాలలోనూ ఈ సభలు నిర్వహించుకుంటే బాగుంటుంది.

జాతీయస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ కార్యవర్గాన్ని ఎంపిక చేసుకుంటేనే ఈ లిటరరీ కాంగ్రెస్ శక్తివంతంగా నిర్వహించుకోవచ్చు.

లిటరరీ కాంగ్రెస్‌ని ప్రభుత్వం గుర్తించేలా చేసి, ఆర్థిక సహకారం అందేలా ప్రయత్నించడంద్వారా ఈ మహాసభలు చేసే తీర్మానాలను ప్రభుత్వం అమలు చేయడానికి తగిన కృషి చేయవచ్చు.

ఇలా అనేక చర్చోపచర్చలు చేసిన చారిత్రాత్మకమైన ఈ లిటరరీ కాంగ్రెస్ జరగడానికి డాక్టర్ ఎస్. చంద్రయ్య, డాక్టర్ ఇమ్మడి మహేందర్ తదితరుల సహకారం సమన్వయం ఎంతగానో కనిపించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే బహుశా నాకు తెలిసినంతవరకు భాషాసాహిత్య సమావేశాలు 'కాంగ్రెస్' పేరుతో జరిగిన మొట్టమొదటి సమావేశాలు ఇవే. ఈ సమావేశాల్లో పాల్గొనడం నిజంగా ఒక చారిత్రక సందర్భం అని అనిపించింది. దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు శాఖ అధ్యక్షులు, అధ్యాపకులు, ఉభయ రాష్ట్రాల్లోనూ తెలుగు బోధించే కళాశాల అధ్యాపకులు, తెలుగు పండితులు, భాషాభిమానులు, ప్రముఖ రచయితలు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం తీసుకున్న విజేతలు, పత్రికా సంపాదకులు, ప్రముఖ సాహితీవేత్తలు, విమర్శకులు ఇలా అనేకమంది పాల్గొని ఒక పండగ వాతావరణాన్ని తలపింప చేశారు.

ఈ సమావేశాలు జరిగి అప్పుడే ఒక ఏడాది అయిపోయిందా అనిపిస్తుంది. ఇది ఎంతో వ్యయప్రయాసల కోర్చి నిర్వహించిన మహాసభ. అయినప్పటికీ దానిలో పాల్గొన్నవాళ్లందరికీ భోజనాలు, రిసోర్స్ పర్సన్స్ కి మరలా హానరోరియం, దారి ఖర్చులు ఎలా ఇచ్చారో అర్థం కాని విషయం. ఈ లిటరరీ కాంగ్రెస్ సందర్భంగా ముద్రించిన, అబ్‌స్ట్రాక్ట్, కరపత్రాలు, పోస్టర్లు, అనేకమంది విడుదల చేసిన వీడియో ప్రోమోలు, తెలుగు భాషపట్లా, సాహిత్యంపట్లా తెలుగువారికున్న అభిమానాన్ని తెలియజేశాయి. లిటరరీ కాంగ్రెస్ నిర్వహించవలసిన ఆవశ్యకతను తెలియజేస్తూ ఆచార్య కాశింతోపాటు అనేకమంది పత్రికల్లో వ్యాసాలు కూడా రాశారు. ముఖ్యంగా ఆ సందర్భంలో ఆచార్య సి. కాశీం ఇచ్చిన ఒక వీడియో ఇంటర్వ్యూ చరిత్రాత్మకమైనది.

ఈ సమావేశాలకు నాటి పత్రికలు, టీవీలు కూడా సాధ్యమైనంతవరకూ మంచి ప్రాధాన్యాన్ని ఇచ్చాయి. అది వారికి ఉన్న భాషాభిమానాన్ని, చైతన్యాన్ని తెలియజేస్తున్నాయి. ఇటువంటి సమావేశాలు ఉభయరాష్ట్రాల్లో తరచుగా జరగాలి. దానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కూడా ప్రచురితం కావాలి. ఆ సమావేశాలకు ప్రభుత్వం, సాంస్కృతిక శాఖలు, సంబంధిత ఇతర శాఖలు, స్వచ్ఛంద సంస్థలు తమ ఆర్థిక సహకారాన్ని కూడా అందించాలి. ఒక జాతి చరిత్ర వారి సాహిత్యం, సంస్కృతులను కాపాడుకోవడంపైనే ఆధారపడి ఉంటుంది. తెలుగు మాతృభాషగా మరింత పటిష్టం కావాలంటే ఇటువంటి సమావేశాలు విస్తృతంగా జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇంత గొప్ప కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు తెలుగు వాళ్లు రుణపడి ఉండడమే కాదు కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది.

★ **రచయిత: పూర్వ అధ్యక్షులు, తెలుగుశాఖ,**
**మానవీయ శాస్త్రాల విభాగం, హెచ్.సి.యు**

# ఈ దశాబ్దపు ఉత్తమ 'సాహిత్య సమాలోచన' "తెలుగు సాహిత్య మహాసభ-2024

ఆచార్య వెంకటరామయ్య గంపా

ఫేస్‌బుక్ గత సంవత్సరంలో జరిగిన ఒక సాహితీ సదస్సును జ్ఞాపకంగా చూపించింది. సామాజిక మాధ్యమాలలోని కొన్ని జ్ఞాపకాలను నెమరువేసుకోవడం చాలా ఆనందాన్నిస్తుంది. కొన్ని విషయాలను సృజనాత్మక చెప్పే తెలివితేటలు నాకు లేవు. ఉన్న విషయాలను, తెలిసిన విషయాలను వ్యాసరూపంలో చెప్పాల్సిన కనీసం అవసరం ఉందని ఒక సాహితీమిత్రుడు చెప్పారు. అది చాలా అవసరమనిపించింది. అటువంటి ఒక విషయాన్ని ఇక్కడ ప్రస్తావించదల్చుకున్నాను. ఆనాటి సదస్సుకు సంబంధించిన సమాచారాన్ని, నిర్వాహకుల కృషిని తెలియజేయడం అవసరమని భావించాను. ఇది అకడమిక్ పద్ధతిలో కాకుండా వ్యక్తిగత అనుభూతిని, అభిప్రాయాన్ని తెలియజేసే వ్యాసంగా రాస్తే బాగుంటుందని భావించాను.

వృత్తిలో భాగంగా చాలా సాహితీ సదస్సుల్లో పాల్గొనడం అవసరం. అట్లాంటివాటిలో 15, 16 & 17 ఫిబ్రవరి, 2024లో 'తెలుగు సాహిత్య మహాసభ-2024' పేరుతో తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన సాహితీ సదస్సు ఒక ప్రత్యేక జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఈ విషయాన్ని గత సంవత్సరం సాహితీ సదస్సు పూర్తయిన వెంటనే వ్యాసంగా రాయాలని ఆలోచించి, కొన్ని అనివార్య కారణాలవలన రాయలేకపోయాను. కొన్ని సందర్భాలలో ఉన్న స్థానం, కొన్ని పద్ధతులకు కట్టుబడి ఉండటం, పరిస్థితులు అనుకూలంగా ఉండకపోవడం... ఇలా ఏదో ఒక కారణంవలన ఇతరులతో మనకు ఉన్న అనుబంధాన్ని, అనుభూతులను వ్యక్తపరచలేం. బహుశా ఇటువంటి కారణాల వలన ఒక వ్యక్తిలో, లేదా సమూహంలో ఉపయోగపడే విషయాల కంటే, ఉపయోగంలేని విషయాలని ఎక్కువగా మాట్లాడుకోవడం జరుగుతుంది. తెలుగు సాహిత్య మహాసభ-2024 గురించి చెబుతున్న విషయాలు ఉపయోగపడతాయని భావిస్తున్నాను. అకడమిక్ చట్రంలో ఇమిడిపోవడంవలన కొన్ని విషయాలు మాట్లాడితే ఏదో ప్రయోజనం ఆశించి 'ఇతను భజన చేయడం మొదలుపెట్టాడు' అనీ, లేకపోతే 'ఇతనికి వారంటే గిట్టదు. ఇతరులను విమర్శిస్తూనే ఉంటాడు' అని.. ఇలా ఏదో ఒక అభిప్రాయం బయటకు వస్తూనే ఉంటుంది. ఈ సందర్భంలో కొందరు వ్యక్తులతో, సంస్థలతో ఉన్న అనుబంధాన్ని లేదా వ్యక్తిగత పరిచయాలను తెలియజేస్తేకానీ ఈ సాహిత్య మహాసభ ఇంత నిర్మాణాత్మకంగా జరగడానికి కారణాలు తెలిసోస్తాయనిపిస్తుంది.

2004వ సంవత్సరంలో ఎం.ఫిల్. పరిశోధన అంశంకోసం వెతుకుతున్నప్పుడు చాలా పుస్తకాలు పరిశీలించాను. కొంతమంది సీనియర్స్ తో చాలా చర్చించాను. అటువంటి సందర్భంలో నన్ను ఆకర్షించిన సిద్ధాంత వ్యాసం 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం'. ఈ అంశంపై ఎం.ఫిల్. పరిశోధన చేసినవారు %వీతీ%. కాశీం. ఈ సిద్ధాంత వ్యాసాన్ని రెండు, మూడుసార్లు చదివిన తర్వాత నా ఎం.ఫిల్.కు కొంత పనికొస్తుందని పరిశోధకుడితో మాట్లాడాలని ప్రయత్నం చేశాను. కానీ, ఆ సమయంలో కుదరలేదు. చాలా రోజుల తర్వాత వారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం వచ్చింది. (చెప్పడం మర్చిపోయాను. నా ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం వారి సిద్ధాంత వ్యాసానికి కొనసాగింపుగా ఉంటుంది.) కొన్ని సంవత్సరాల తరువాత %వీతీ%. కాశీం పేరు డాక్టర్ కాశీంగా మారింది. అనంతరకాలంలో డాక్టర్ కాశీం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా, శాఖ అధ్యక్షులుగా, ప్రస్తుతం అదే విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్నారు. ఈ విషయాలు అందరికీ తెలిసినప్పటికీ నేను చెప్పడానికి గల కారణం నాకు వారితో ఉన్న పరిచయం, వారిలో నేను గమనించిన విషయాలను చెప్పడం కోసం. డాక్టర్ సి. కాశీం కన్వీనర్ గా వ్యవహరించిన ఈ సాహిత్య మహాసభ గురించి ఆలోచిస్తున్నప్పుడు ఈ జ్ఞాపకాలన్నీ తెరలు తెరలుగా కళ్లముందుకు రావడం అసహజమైన విషయమేమి కాదు.

డాక్టర్ కాశీంతో పరిచయం దాదాపు రెండు దశాబ్దాలు. నేనూ అధ్యాపకవృత్తిలో ఉండడంవలన ఏదో ఒక సందర్భంలో



వారితో మాట్లాడటం, అకడమిక్ పరిచయాన్ని కొనసాగించడం నేటికీ ఉంది. ఈ 20 సంవత్సరాల కాలంలో, వారి వయసులో, శరీరంలో, వృత్తిపరమైన పదవుల్లో మార్పులు చాలా కనిపించాయి. కానీ వారి మనసులో, స్నేహంలో, పలకరింపులో ఎటువంటి మార్పు లేకపోవడం నాకు ఇప్పటికీ కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ సాహిత్య మహాసభకు రిసోర్స్ పర్సన్ గా తాను పనిచేస్తున్న తెలుగుశాఖకు ఆహ్వానించడం చాలా ఆనందాన్ని కలిగించింది. వ్యాపారయుగంలో పలకరింపులు పెదవులకే పరిమితమైన కాలంలో, మాట్లాడే మాట మనసులో నుంచి వచ్చిన సందర్భాలు చాలా తక్కువ. 'నోటితో మాట్లాడి నుదిటితో వెక్కిరించే మనుషులు' తెలుగు శాఖలలో ఎక్కువ. కానీ డాక్టర్ కాశీం ఇందుకు భిన్నం. వారితో మాట్లాడితే, ఉన్న విషయాన్ని స్పష్టంగా చెప్పడంతోపాటు అవసరమైన మేరకు సూచనలు, సలహాలు చెప్పడమే కాదు, ఇతరులలో ఉన్న మంచి లక్షణాన్ని గుర్తించడం, పదిమందిలో ఆ విషయాన్ని గొప్పగా చెప్పడం వారికి ఉన్న ఉత్తమ లక్షణం. బహుశా ఈ లక్షణాలే ఆ సాహిత్య మహాసభ అంతలా విజయవంతంకావడానికి దోహదపడ్డాయని నాకనిపిస్తోంది.

వృత్తిపరంగా కొన్ని విషయాలు గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఉన్నప్పటికీ కొన్ని విషయాలు open secret. అందరికీ తెలిసే ఉంటాయి. Ph.D. సిద్ధాంత గ్రంథాలను మూల్యాంకనంకోసం మరొక విశ్వవిద్యాలయానికి పంపించడం నియమం. వృత్తిలో భాగంగా వారి దగ్గరనుంచి కొన్ని సిద్ధాంత గ్రంథాలు గతంలో నా దగ్గరకు వచ్చాయి. సిద్ధాంత గ్రంథానికి సంబంధించిన రిపోర్ట్ పంపించినప్పుడు, 'నువ్వు చెబుతున్న సూచనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని' అభినందించడంతోపాటు, విశ్వవిద్యాలయానికి వస్తే ప్రత్యేక ఉపన్యాసం ఏర్పాటు చేస్తానని ప్రోత్సహించిన వ్యక్తి ఆచార్య సి.కాశీం. ఈ సుగుణమే, అకడమిక్ పరిశోధనపట్ల ఆయనకున్న ఈ నిబద్ధత, పట్టింపు ఆనాటి సాహిత్య మహాసభలో 'పరిశోధనా విపంచి' అనే శీర్షికతో ఒక ప్రత్యేక సెషన్ ఏర్పాటుచేయడానికి కారణమైంది. గత రెండు దశాబ్దాలుగా నేను గమనించిన విషయం ఏమిటంటే 'ఆచార్య సి. కాశీం భావజాలానికి భిన్నమైన అభిప్రాయాలు కలిగినవారు సైతం వారిని వ్యక్తిగతంగా ఇష్టపడతారు. రెండు దశాబ్దాల నుంచి గమనిస్తోన్నవాడిగా, మరీ ముఖ్యంగా, మహాసభ జరిగిన మూడు రోజులు ఈ విషయాన్ని ప్రత్యక్షంగా అనుభూతి చెందాను. ఆ మహాసభకు ఆహ్వానించిన రిసోర్స్ పర్సన్స్ ను గమనిస్తే, భిన్న భావజాలాలు కలిగినవారిని కూడా సమానంగా గౌరవించే ఆయన వ్యక్తిత్వం మరింత స్పష్టమవుతుంది.

ఎంతోమంది విద్యార్థులు ఆయన అనుచరులుగా ఉండడం వారి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. నాకు తెలిసిన మేరకు గత 20 సంవత్సరాలుగా సౌకర్యవంతమైన ఉద్యోగంలో ఉన్నారు. ఏ రకమైన ఇబ్బంది లేకుండా, ఏది పట్టించుకోకుండా, ఎవరి గురించి ఆలోచించకుండా, తన పని తాను చేసుకుంటూ ప్రశాంతంగా గడపవచ్చు. కానీ అలా బ్రతకడం వారికి చేతకాదని అనిపించింది. మౌనంగా కూర్చోవడం తెలియని వ్యక్తి. ఉత్తమ సమాజ నిర్మాణంకోసం తన వంతు బాధ్యతను నెరవేర్చాలనే తపన ఉన్న మనిషి. అటువంటి వ్యక్తి ఫోన్ చేసి 'తెలుగు లిటరరీ కాంగ్రెస్'ను మొదటిసారిగా నిర్వహించబోతున్నాం నువ్వు రావాలి' అని చెప్పినప్పుడు చాలా సంతోషం వేసింది.

2014 తర్వాత తెలుగు ప్రాంతాలలోని సాహితీవేత్తలకు సాహిత్యంపైన కంటే ప్రాంతాలపై మమ'కారం'ఎక్కువై, సాహిత్య రుచి సమపాళ్లలో కనిపించడం కరువైపోయింది. సాహితీవేత్తలకు ఎక్కడో, ఎప్పుడో కనిపించని మనోభావాలు అగ్నిపర్వతంలా బద్దలయ్యాయి. ఇటువంటి సమయంలో రచయితలను, విమర్శకులను, అకడమిక్ పరిశోధకులను, సాహిత్య అభిమానులను ఒక చోటకు చేర్చి 2024, ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు 'తెలుగు సాహిత్య మహాసభ 2024' పేరుతో అసలైన సాహిత్య సంబరాన్ని ఏర్పాటు చేసింది–ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ. ఆనాటి తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కాశీం సారథ్యంలో ప్రథమ 'తెలుగు సాహిత్య మహాసభ' ప్రారంభం కావడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదిక కావడం చారిత్రక ఘట్టం. ఆ 'తెలుగు సాహిత్య మహాసభ', ఆలోచనలు రేకెత్తించేలా, భవిష్యత్ తరాలకు దిశానిర్దేశం చేసేలా రూపొందించడం కన్వీనర్ ఆచార్య కాశీం చేసిన ఉత్తమమైన ఆలోచన. బహుశా ఈ దశాబ్దంలో జరిగిన ఉత్తమ చర్చనీయమైన 'సాహిత్య సమాలోచన' అని చెప్పడం అతిశయోక్తి కాదు.

సాహిత్య పాఠకుడిగా అర్హత ఉన్న వందల మంది కళాశాల అధ్యాపకులను, భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలలోని తెలుగు శాఖలలో పనిచేస్తున్న తెలుగు ఆచార్యులను, తెలుగులో ఉన్న ప్రముఖ కవులను, రచయితలను, పరిశోధకులను, ఆసక్తి ఉన్న తెలుగు సాహిత్య అభిమానులను ఒక వేదిక పైకి తీసుకురావడం అనేది చాలా అరుదైన విషయం. గతంలో అంతర్జాతీయ సదస్సులు చాలా జరిగాయి. కానీ, వాటికి భిన్నంగా నిర్వహించిన సాహిత్య సదస్సు 'తెలుగు సాహిత్య మహాసభ 2024'.

సాహిత్య అభిమానులు, రచయితలు, విమర్శకులు, పండితులు ఒకచోట చేరి తమ అభిప్రాయాలను పంచుకోవడం, చర్చలు, గోష్ఠుల ద్వారా వివిధ దృక్పథాలను, అభిప్రాయాలను వెల్లడించడానికి 'తెలుగు సాహిత్య మహాసభ' ఒక వేదిక కావడం సాహిత్య చరిత్రలో నిలిచిపోయే విషయం. ఒకరి అభిప్రాయాలను మరొకరు అర్థం చేసుకోవడానికి, చర్చల ద్వారా సాహిత్యంలోని అనేక విషయాల పరిష్కారానికి అవకాశం ఏర్పడింది. బహుశా ఇప్పటివరకు తెలుగు సాహిత్య చరిత్రలో భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న తెలుగు శాఖ ఆచార్యులకు, అధ్యక్షులందరికీ ఒకేసారి ఆహ్వానం పంపిన ఘనత తెలుగు సాహిత్య మహాసభ –2024 తెలుగు శాఖకు, కన్వీనర్ గా వ్యవహించిన ఆచార్య సి. కాశీంకు దక్కుతుంది. తెలుగు శాఖ ఆహ్వానం మేరకు దాదాపు అన్ని ప్రాంతాలలోని తెలుగు ఆచార్యులు కార్యక్రమానికి రావడం అనేది మరొక పేర్కొనదగిన అంశం. ఇలా ఒకచోట కలుసుకోవడం చాలా అరుదైన విషయమే కాదు అపూర్వం కూడా.

విశ్వవిద్యాలయం అధ్యాపకులకు ఆహ్వానం పంపినంతమాత్రాన కార్యక్రమం చాలా బాగా జరిగినట్లు, లేకపోతే బాగా జరగనట్టా అనే ఒక ప్రశ్న ఇక్కడ ఉదయిస్తుంది. ఒక కార్యక్రమం విజయవంతం అయిందా? లేదా? అనేది కార్యక్రమంలో వచ్చే ఫలితాల ఆధారంగా నిర్ణయించడం ఉచితంగా ఉంటుంది. ఆ విధంగా చూసినప్పుడు వివిధ తెలుగు శాఖల అధ్యక్షుల అభిప్రాయాలను గమనించినప్పుడు, కార్యక్రమంలో వచ్చిన ఫలితాలను ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ఇతర అంశాలు చర్చించడానికి ముందు, నేను పాల్గొన్న కార్యక్రమంలోని అంశాన్ని వివరించడం కొంచెం సముచితంగా ఉంటుందేమో. కార్యక్రమంలో నిర్వాహకులు 'వర్తమాన తెలుగు భాషాసాహిత్యాల గమనం, గమ్యం' అనే అంశంపై తెలుగు శాఖ అధ్యక్షుల చర్చాగోష్టిని నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, జరిగిన చర్చను ఇక్కడ పేర్కొనే ప్రయత్నం చేస్తాను.

తెలుగుకు సంబంధించిన బోధన, పరిశోధన అంశాలను చర్చించేవి విశ్వవిద్యాలయాలు. తెలుగు బోధన, పరిశోధన భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్నప్పటికీ వివిధ విశ్వవిద్యాలయాలలోని పాఠ్యప్రణాళిక రూపకల్పనలోనూ, బోధనలోను ఏకరూపత లేదు. వివిధ కారణాలతో ఒక్కొక్క విశ్వవిద్యాలయంలో ఒక్కొక్క రకమైన పాఠ్య ప్రణాళిక రూపొందించుకొని, బోధన కొనసాగిస్తున్నారు. అయితే విశ్వవిద్యాలయాలలో పాతిక సంవత్సరాల క్రితం ఉన్న బోధన, పరిశోధనా పద్ధతులు ఇప్పటికీ అలానే కొనసాగుతున్నాయి. కాలానికి అనుకూలంగా, సమాజంలో వస్తున్న మార్పులను గమనించకుండా కొనసాగుతున్న బోధన, పరిశోధన వలన విద్యార్థులకు ఎం. ఏ. తెలుగు చదవడం వారి ఉద్యోగాలకు ఉపయోగపడని విధంగా తయారయ్యే అవకాశం ఉంది. ఇటువంటి సందర్భంలో అన్ని ప్రాంతాలలో పనిచేస్తున్న తెలుగు ఆచార్యులు, బోధన, పరిశోధనకు సంబంధించి వివిధ అంశాలపైన చర్చించి, ప్రణాళికలు రూపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అటువంటి పనికి నాంది పలికినటువంటిది తెలుగు సాహిత్య మహాసభ 2024.

విశ్వవిద్యాలయాలలో సాహితీ సదస్సులు జరగడం అనేది ఒక సాధారణమైన అంశం. నిర్వాహకులు ఏదో ఒక ఒక అంశాన్ని ఎంచుకోవడం, ఆ అంశంపైన వక్తలు ప్రసంగించడం అనేది సాధారణంగా జరిగే ప్రక్రియ. కానీ తెలుగు శాఖ అధ్యక్షుల చర్చాకార్యక్రమంలో గతంలో జరిగిన తెలుగు బోధన, పరిశోధనలతోపాటు వర్తమానంలో ఉన్న పరిస్థితులు, భవిష్యత్తులో విద్యార్థులకు ఏ రకమైనటువంటి పాఠ్యాంశాలు, పరిశోధన ఉపయోగపడుతుందో వివరించారు.

“నూతన జాతీయ విద్యా విధానం-2020” తర్వాత విద్యావ్యవస్థలో నూతన మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా భాషాసాహిత్యాలకు సంబంధించిన నూతన అంశాలు కనిపిస్తాయి. నూతన జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం బోధనా పద్ధతిలో మార్పులు చేయవలసిన అవసరం ఏర్పడింది. అందుకు అనుకూలంగా బోధనను, పరిశోధనలను వివిధ అంశాలను మార్పులు, చేర్పులు చేయవలసిన అవసరం కనిపిస్తూ ఉంది. బహుశాస్త్రమిశ్రిత (multidisciplinary) దృక్పథంతో పరిశోధన ఉండేలా నూతన జాతీయ విద్యావిధానాన్ని రూపొందించారు. వీటితోపాటు ముద్రణ, ప్రచురణకు సంబంధించిన అంశాలను వివరణాత్మకంగా బోధించాలి. అందుకు అవసరమైనటువంటి ప్రాథమిక సాంకేతిక పరిచయాన్ని విద్యార్థులకు బోధించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా కంప్యూటర్ కు సంబంధించిన ప్రాథమిక జ్ఞానం, కంప్యూటర్లో తెలుగు ఏ రకంగా ఉపయోగించాలి? తెలుగు సంబంధించిన వివిధ ముఖ్యమైనటువంటి ఫాంట్లు, సాఫ్ట్వేర్లు, బ్లాగులు మొదలైన అంశాలను విద్యార్థులకు ఏ విధంగా వివరించాలి? బహుళజాతి సంస్థలలో తెలుగుకున్నటువంటి అవకాశాలు ఏమిటి? అందులో ఉద్యోగ అవకాశాలు ఏ విధంగా ఉన్నాయి? అందుకు విద్యార్థులు ఏ రకమైనటువంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి? మొదలైన అంశాలను విద్యార్థులకు ఏ విధంగా బోధించాలి? వీటితోపాటు ప్రాథమికమైన పరిశోధనా పద్ధతులను ఏ విధంగా బోధించాలి?” మొదలైన అంశాలను కొంతమంది ఆచార్యులు తమ ప్రసంగాలలో తెలియజేశారు. కానీ, “తెలుగు భాష-సాంకేతికత’ (Telugu Language-Technology) అనే పేపర్ ను ఆప్షనల్‌గా ప్రొఫెసర్ సి. కాశీం రెండేళ్ల క్రితం ఎం.ఏ. తెలుగు సిలబస్‌లో తాను శాఖాధ్యక్షులుగా ఉన్నప్పుడే ప్రవేపెట్టారు. ఇది ఆయన ముందుచూపునకు నిదర్శనం. ఈ సెషన్ లో, బహుళజాతి సంస్థలు తెలుగును తమకు అనుకూలంగా మలుచుకుని ఏ విధంగా ఆర్థికపరమైన లబ్ధిపొందుతున్నాయో వివరించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా, ఇటీవలకాలంలో అంతర్జాలంలో వెలువడుతున్న సమాచారాన్ని ఎలా ఉపయోగించుకోవాలి? విద్యార్థులు ఉద్యోగ అవకాశాలకోసం తెలుగుతోపాటు నేర్చుకోవలసిన ఇతర అంశాలపై చర్చ జరిగింది.

సాహిత్య సదస్సులు కేవలం కళాశాలలో లేదా విశ్వవిద్యాలయాలలో పనిచేసే అధ్యాపకులు మాత్రమే పాల్గొని తమ పత్ర సమర్పణ చేయడమనేది సాధారణంగా కనిపించే అంశం. ఎక్కడో కొన్ని చోట్ల మాత్రమే వక్త మాట్లాడిన తర్వాత ఒకటి రెండు ప్రశ్నలు ఉంటాయి. కానీ, అందుకు భిన్నంగా తెలుగు మహాసభలో ఒకే వేదికపై అధ్యాపకవృత్తిలో ఉన్న ఆచార్యులతోపాటు, సీనియర్ రచయితలను, విమర్శకులను కూర్చోబెట్టి వారి సాహిత్య అనుభవాలను, రచనలలో వచ్చినటువంటి మంచి చెడులను, పాఠకులు ఆదరించిన పద్ధతిని చర్చించడం వినూత్నమైన అంశం. రచయితలు

విమర్శకులు వెలిబుచ్చిన అభిప్రాయాలపై సభలో ఉన్న ఇతర సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, కొంతమంది పాఠకులు తెలియజేసిన అభిప్రాయాలు చాలా ఆసక్తికరమైనవి.

**సిద్ధాంత గ్రంథ శీర్షికలకు కేంద్రంగా నిలిచిన మహాసభ సమావేశం:**

వాస్తవంగా ఒక సదస్సు ముఖ్య లక్ష్యం- గతం, వర్తమానంతోపాటు భవిష్యత్తులో జరగవలసిన పరిశోధనకు సంబంధించిన అంశాలను చర్చించడం. ఒక సాహితీ సదస్సునుంచి కొన్ని కొత్త శీర్షికలు భవిష్యత్తు పరిశోధకులకు సూచించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కానీ చాలా సందర్భాలలో అటువంటి ప్రయత్నాలు ఏమీ జరగడం లేదు. మహాసభ సమావేశాలలో కొంతమంది పరిశోధకులు వెలిబుచ్చిన అభిప్రాయాలతో కొత్త సిద్ధాంత గ్రంథాలను రూపొందించవచ్చు. ఆంగ్లంలో లభిస్తున్న నూతన సాహిత్య అధ్యయన పరికరాలను ఎలా గమనించాలి? జానపద సాహిత్యంలో కొత్తగా చేయాల్సినటువంటి పరిశోధనలు ఏమున్నాయి? ప్రాచీన ఆధునిక సాహిత్యాలను కొత్తగా ఎలా చూడాలి? మొదలైన అంశాలను ప్రముఖ విమర్శకులు, పరిశోధకులు తెలియజేశారు. పరిశోధనపైన ఆసక్తి ఉన్నవారు కొత్తగా పరిశోధనపైన ఆసక్తి ఉన్నవారు పరిశోధన అంశాలను ఎంపిక చేసుకునే సందర్భంలో ఏయే అంశాలపై దృష్టి పెట్టాలో వివరించే ప్రయత్నం చేశారు పరిశోధకులు.

ఇవన్నీ ఒకెత్తు అయితే, ఆర్ట్స్ కళాశాల ముందు ఉన్న బహిరంగ ప్రదేశంలో జరిగిన కవి, గాయక సమ్మేళనాలు మరో ఎత్తు. 'కవితా వసంతం' శీర్షికతో కవులను, పాటకవులను ఆహ్వానించడం, వారితో ప్రత్యేకంగా ఒక కార్యక్రమం రూపొందించడం నిర్వాహకులు చేసిన మంచి ఆలోచన. మొదటి నుంచి విశ్వవిద్యాలయాలలో జరిగే సాహితీ సదస్సులు అకడమిక్స్ లో ఉన్నవారికే పెద్దపీట వేయడం జరుగుతూ వుంది. కవులు/ రచయితలకు సంబంధించిన రచనలపై సాహితీ సదస్సులు నిర్వహించినప్పటికీ సృజనాత్మక సాహితీవేత్తలకు విశ్వవిద్యాలయాలలో తగిన స్థానం లభించలేదనే ఒక అభిప్రాయం ఉంది. ఇటీవలకాలంలో సాహితీ సదస్సులలో ప్రముఖమైన కొద్దిమంది అధ్యాపకులు, పరిశోధకులు మాత్రమే పాల్గొనడం, రికార్డులలో చూపించడంకోసం సదస్సులు నిర్వహించడం ఒక మూస పద్ధతిగా మారింది. ముఖ్యంగా విశ్వవిద్యాలయాలలో, కళాశాలలో వివిధ నియమాలు ఏర్పడిన తర్వాత సాహిత్య సదస్సులు అనేవి కేవలం ఒక నామమాత్రపు ఆచారంలా జరుగుతూ ఉంది. సృజనాత్మక రచయితలకు విశ్వవిద్యాలయంలో జరిగే సాహితీ సదస్సులకు ఆహ్వానాలు అందిన సందర్భాలు చాలా తక్కువ. ఇటువంటి సమయంలో ఎంతోమంది కవులను ఒకచోట చేర్చి వారందరికీ విశ్వవిద్యాలయంలో భారీవేదికను ఏర్పాటు చేసి, అకడమిక్స్ లో ఉన్న అధ్యాపకులను, కవులను, ప్రముఖ విమర్శకులను ఒకే వేదికపై కూర్చోబెట్టి పెద్ద కార్యక్రమం నిర్వహించడం, అది విజయవంతం కావడం అనేది పేర్కొనదగిన విషయం.

ఈ మహాసభలో పాల్గొన్న ప్రముఖ విమర్శకులు, రచయితలు తెలుగు సాహిత్యంలోని వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను, విశ్లేషణలను అందించారు. కవిత్వం, కథ, నవల ప్రక్రియలను విశ్లేషిస్తూ ఆయారంగాలలో నిష్ణాతులను, పరిశోధకులను, అధ్యాపకులను ఆహ్వానించడం ప్రత్యేకమైన విషయం. చాలామంది అనుభవజ్ఞులైన విమర్శకులు పరిశోధకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎంతో విలువైనవి. మహాసభలో కొంతమంది వక్తలు సాహిత్యానికి సంబంధించిన సృజనాత్మక, విమర్శనాత్మక అంశాలు రెండింటిపై ప్రసంగించారు. దీని ద్వారా సాహిత్యంలోని వివిధ అంశాలపై సృజనాత్మక రచయితలతోపాటు విమర్శకులకు ఉపయోగకరంగా అనిపించింది. ఒక రచనను చేయడం ఎంత ముఖ్యమో, ఆ రచనను అర్థంచేసుకోవడం అంతే ముఖ్యం అనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ అభిప్రాయం వలన కొత్త రచయితలు, విమర్శకులు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నవారు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, ఒక సమతుల్యమైన సాహిత్య దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవడానికి మంచి వేదికగా మహాసభ విజయవంతమైంది.

**తెలుగు సాహిత్య మహాసభ 2024 లేవనెత్తిన అంశాలు:**

తెలుగు సాహిత్య మహాసభ–2024 ఘనంగా ప్రారంభమై విజయవంతంగా ముగిసింది. వందల సంఖ్యలో పాల్గొన్న ప్రతినిధులు ఏకాభిప్రాయంతో చెప్పిన మాట–'సభ చాలా గొప్పగా జరిగింది' అని. కానీ సంవత్సరం తర్వాత ఈ ఫిబ్రవరి మాసం 2025లో జరగవలసి ఉండిన "తెలుగు

సాహిత్య మహాసభ-2025" పరిస్థితి ఏమిటి? 2024 మహాసభలో పలు తీర్మానాలు చేశారు. తెలుగు సాహిత్య మహాసభ, అధ్యక్ష, కార్యదర్శులను, సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. భవిష్యత్తులో తెలుగు సాహిత్యానికి, పరిశోధనల ప్రగతికి తీసుకోవలసిన విషయాలను నాటి నిర్వాహక అధ్యక్షులు ఆచార్య సి. కాశీం సమావేశంలో తెలియజేశారు. తర్వాతకాలంలో తెలుగు మహాసభకు సంబంధించిన సభ్యులు ఎవరు సమావేశమైనట్లు కనిపించలేదు. మరి తర్వాత తెలుగు సాహిత్య మహాసభ సమావేశం ఎప్పుడు అనే ప్రశ్న నాలాంటివారికి కలగడం సహజం.

**వేదిక, ఆర్థిక వనరుల సమకూర్పు:**

తెలుగు సాహిత్య మహాసభ-2024 వేదికగా ఉస్మానియా విశ్వవిద్యాలయం నిలిచింది. ఒకే విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం తెలుగు సాహిత్య మహాసభలను నిర్వహించడం కష్టంతో కూడుకున్న విషయం. ఆర్థికపరంగా ఎంతో చాకచక్యంగా తెలుగు సాహిత్య మహాసభ-2024ను నిర్వహించారు. ఎన్నో ఆర్థికపరమైన విషయాలను దాటుకొని సభను జయప్రదం చేశారు. తర్వాత తెలుగు సాహిత్య మహాసభ నిర్వహించాలంటే వేదిక, ఆర్థిక వనరులు పెద్ద సమస్యలుగా మారాయి. ఆర్థికపరమైన సమస్యలవలన విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపకులు ఎవరూ మహాసభలు నిర్వహించడానికి ముందుకు రావడంలేదు. తక్కిన సంస్థలతో పోల్చుకుంటే తెలుగు సాహిత్య సమావేశాలకు అందే ఆర్థిక వనరులు చాలా తక్కువ. వివిధ సంస్థలు ఆర్థికంగా సహాయం చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ ఎవరూ పెద్దగా విశ్వవిద్యాలయాలలో జరిగే తెలుగు సాహిత్య సదస్సులకు విరాళాలు ఇవ్వడానికి ముందుకు రారు.

**ఐక్యత, సహకారం:**

తెలుగు సాహిత్య మహాసభ-2024 నిర్వహణ ప్రొఫెసర్ కాశీంకు వివిధ వ్యక్తులతో, సంస్థలతో ఉన్న వ్యక్తిగత సంబంధాల వలన విజయవంతం అయిందనేది అంగీకరించవలసిన విషయం. ముఖ్యంగా నిర్వాహకులు విశ్వవిద్యాలయ ఆచార్యులుగా పనిచేస్తున్నప్పటికీ కవులతో, రచయితలతో, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులతో ఉన్న సత్సంబంధాల వలన



కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగారు. ఆయన నిత్యం ఏదో ఒక రూపంలో సమాజంలో భాగంగా ఉన్నారు. సభ విజయవంతం కావడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఒకటి రెండు విశ్వవిద్యాలయాల తప్ప, తెలుగు ప్రాంతాలలోని చాలా విశ్వవిద్యాలయాలలోని తెలుగు శాఖలలో ఆచార్యుల కొరత ఎక్కువగా ఉంది. దీనికి తోడు తెలుగు శాఖలకు ఆర్థికపరమైన వనరులు తక్కువగా ఉన్నాయి. కేవలం యూజీసీ లేదా విశ్వవిద్యాలయంవారికి నెలవారి లేదా

సంవత్సరంవారి రిపోర్టులు చూపించడంకోసం చేసుకునే సదస్సులు మాత్రమే ఎక్కువ కనిపిస్తున్నాయి. ఇటువంటి సందర్భంలో ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడానికి ముందుకు వచ్చేవారు ఎవరు? అనేది ఒక పెద్ద ప్రశ్న.

**అవగాహన, సహనం**

భిన్నమైన అభిప్రాయాలను గౌరవించడం, వాటిని అర్థంచేసుకోవడం చాలా ముఖ్యం. తెలుగు సాహిత్య మహాసభ-2024 నిర్వాహకులు చాలా సహనంతో ఎన్నో అంశాలపై అవగాహనతో కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు అందరినీ సమానస్థాయిలో గౌరవించి, ఒక ఆరోగ్యకరమైన అకడమిక్ వాతావరణాన్ని కల్పించే ప్రయత్నం చేశారు. అటువంటి సహృదయత, సహనం కలిగినవారు ముందుకు వచ్చి తరువాత మహాసభను నిర్వహించాలి. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు కనిపిస్తున్నాయా? అనేది చాలా పెద్ద ప్రశ్న.

**నిష్ణాతులైన రచయితల భాగస్వామ్యం:**

తెలుగు సాహిత్య మహాసభలో నిష్ణాతులైన కవులు, రచయితలు, విమర్శకులు, పండితులు పాల్గొన్నారు. వారు తమ అభిప్రాయాలను, సూచనలను అందించడం ద్వారా సాహిత్యానికి ఒక కొత్త దిశను నిర్దేశించే ప్రయత్నం చేశారు. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో అకడమిక్ బయట ఉన్న కవులు, రచయితలు, విమర్శకులను తెలుగు శాఖలకు ఆహ్వానించి వారిని కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, గౌరవించే స్థితిలో విశ్వవిద్యాలయాలలోని ఆచార్యులు సిద్ధంగా ఉన్నారా?

**సాంస్కృతిక కార్యక్రమాలు:**

తెలుగు సాహిత్య మహాసభ-2024 లో పాట కవులకు సంబంధించిన కార్యక్రమం సాంస్కృతిక కార్యక్రమంగానే పరిగణించాలి. అది ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అటువంటి కార్యక్రమం నిర్వహించాలంటే కవులతోపాటు అందుకు సంబంధించిన సాంస్కృతిక వ్యవస్థ అవసరం. తర్వాత తెలుగు సాహిత్య మహాసభ నిర్వహించే వారికి అటువంటి అభిలాష ఉంటుందా?

**అంతర్జాతీయ భాగస్వామ్యం:**

ఇతర దేశాల్లో ఉన్న తెలుగు సాహిత్యవేత్తలు, విమర్శకులను కూడా మహాసభకు ఆహ్వానించాలి. వారి ప్రాంతాల్లో వెలువడుతున్న సాహిత్యంతో మన సాహిత్యాన్ని అనుసంధానించటంద్వారా తెలుగు సాహిత్యం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతుంది. ఆర్థికపరమైన సమస్యలు ఉంటే అంతర్జాలంద్వారా అయినా, వారితో చర్చించే ప్రయత్నం చేయడం అవసరం. దీని ద్వారా వివిధ ప్రాంతాలలోని సంస్కృతుల మధ్య అవగాహనను పెంచడానికి ఉపయోగపడుతుంది. ప్రవాస సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

మహాసభలో వక్తలు మాట్లాడిన అంశాలను, చర్చల సారాంశాన్ని పుస్తక రూపంలో ప్రచురించాలి. ఇది భవిష్యత్తులో పరిశోధనలకు, అధ్యయనానికి ఉపయోగపడుతుంది. మహాసభలో పాల్గొన్న ప్రముఖుల ప్రసంగాలను రికార్డ్ చేసి అంతర్జాలంలో ఉంచడం వలన భవిష్యత్తులో పరిశోధకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, ప్రొఫెసర్ సి. కాశీం ఈ సభలకు సంబందించిన అంశాలపై సంక్షిప్తులను (Abstracts) సేకరించి, ముద్రించారు. దీనివల్ల ఏ సెషన్ లో ఎవరుప, ఏయే విషయాల్ని ప్రస్తావిన్చాబోతున్నారు మొదలైన విషయాలను శ్రోతలు తెలుసుకునే అవకాశం కలిగింది. ఈ పద్ధతి సాధారణంగా అంతర్జాతీయ ప్రమాణాలు పాటించే సదస్సుల్లో మనం చూస్తుంటాం.

తెలుగు మహాసభ అనేది ఒక నిరంతర ప్రక్రియ. దాన్ని కొనసాగించే అవకాశం ఎంతవరకు ఉందనేది ఆలోచించాల్సిన అవసరం. సభ్యులు కనీసం అంతర్జాలంద్వారా తరచూ కార్యక్రమాల గురించి చర్చించడంవల్ల భవిష్యత్తులో సాహిత్యంలోనూ అకడమిక్స్ లో రావలసిన మార్పులను చర్చించే అవకాశం ఉంది. మహాసభ ముగిసిన తర్వాత దానిని సమీక్షించి మూల్యాంకనం చేయాలి. భవిష్యత్తులో మరింత మెరుగైన కార్యక్రమాలు నిర్వహించడానికి ఇది ఉపయోగపడుతుంది. పాల్గొన్నవారి అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇటువంటి ప్రయత్నం జరుగుతుందని ఆశిస్తూ...

**రచయిత: ఆచార్యులు**

**(ఎం.ఐ.ఎల్), ఢిల్లీ విశ్వవిద్యాలయం**

# తెలుగు సాహిత్య మహాసభ-2024 దశ-దిశ

డా॥ వెల్దండి శ్రీధర్

నూరు వసంతాలు దాటిన ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ 2024 ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో మూడు రోజులపాటు ఒక బృహత్తరమైన కార్యక్రమానికి తెరలేపింది. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం తొక్కిన కొత్త తొవ్వల్ని, తొడిగిన కొత్త మొగ్గల్ని మదింపు చేసుకోవడానికి ఒక సరికొత్త వేదికకు రూపకల్పన చేసింది. అదే తెలుగు సాహిత్య మహాసభ-2024 (Telugu Literary Congress-TLC-2024). చరిత్ర అధ్యయనపరులకు ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ఉన్నట్లుగా, సైన్స్ స్కాలర్లకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఉన్నట్లుగా తెలుగు సాహిత్య కళాజీవులకోసం తెలుగు లిటరరీ కాంగ్రెస్ ఎందుకు ఉండకూడదనే ఆలోచన నుంచి పురుడుపోసుకున్నదే ఈ తెలుగు సాహిత్య మహాసభ. తెలుగు సాహిత్యకారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, తెలుగు సాహిత్యా భిమానులు తమను తాము అప్‌డేట్ చేసుకోవడానికి, తెలుగు సాహిత్యం గమనం, గమ్యం గురించి చర్చించు కోవడానికి ఈ సాహిత్య మహాసభ ఇతోధికంగా తోడ్పడింది.

15 ఫిబ్రవరి ఉదయం జరిగిన ప్రారంభ సమావేశంలో ఆనాటి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆచార్య ఆర్. లింబాద్రి, అప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య డి. రవీందర్, ఆనాడు పదవిలో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు, ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆనాటి సంపాదకులు డా. కె. శ్రీనివాస్ పాల్గొని సరికొత్త ఆలోచనలు రేకెత్తించే విధంగా మాట్లాడారు. సభాధ్యక్షులుగా ఆనాటి తెలుగుశాఖ అధ్యక్షులు, ఈనాటి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. కాశీం అధ్యక్షత వహించారు. తమ అధ్యక్షోపన్యాసంలో 90వ దశకంలో ప్రవేశించిన నూతన ఆర్థిక విధానాల ఫలితంగా విద్యారంగం అప్రధాన రంగంగా మారిపోయిన విషయాన్ని చెప్తూనే, తెలుగు భాషాసాహిత్యాలపట్ల ప్రభుత్వాలు చూపుతున్న ఉదాసీన వైఖరిని ఎండగట్టారు. సారవంతమైన తెలుగు సాహిత్య ప్రయాణాన్ని తడిమి చూపారు. ప్రపంచీకరణ మన జీవితాల మీద ఉక్కుపాదం మోపిన తరువాత తెలుగు భాష, ఆంగ్ల ప్రభావానికి ఎలా గురైందో వివరించారు. మారిన పరిస్థితుల్లో ఆంగ్ల భాష వచ్చి ఉండడం తప్పనిసరి అయినా, తల్లి భాషను విస్మరించకూడదని హితవు పలికారు. ఇంటర్, డిగ్రీలలో సంస్కృత భాష ప్రాభవం పెరిగిపోయి తెలుగు భాషను నమ్ముకున్నవారికి ఉపాధి అవకాశాలు ఎలా మృగ్యమవుతున్నాయో వివరించారు. తెలుగు భాష పరిరక్షణకు ఒక ఉమ్మడి వేదిక కావాలని ఆ లోటును ఈ తెలుగు సాహిత్య మహాసభ ఏ కొంత తీర్చినా మేలేనని అభిప్రాయపడ్డారు.

ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్. గోపి హాజరై చేసిన ప్రసంగం ఎంతో మంది సాహిత్యాభిమానుల మనసులను చూరగొన్నది. ప్రసంగం చివరలో 'ఉస్మానియా లైబ్రరీ' శీర్షికన వారు చదివిన కవితతో సభంతా ఎన్నో జ్ఞాపకాల్లో తేలిపోయింది.

"ఏకాంతమంటే
అర్థం తెలిసింది ఇక్కన్నే
ఏకాగ్రత
బోల్టులుగా బిగించినట్టుందది
నిశ్శబ్దం
బంగారంగా మారేది కూడా ఇక్కన్నే

......................................

కాళిదాసును చదివి
బయటికి రాగానే
లాండ్‌స్కేప్ గార్డెన్‌లో
శకుంతల కనిపించేది
మేఘాలు ప్రణయ భాషను మాట్లాడేవి"

మొదటి సమావేశానికి ఆచార్య సాగి కమలాకర శర్మ అధ్యక్షత వహించగా, సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డా॥ నందిని సిధారెడ్డి 'కవిత్వంతో నా ప్రయాణం'పై మాట్లాడుతూ, "కవిత్వం వేదుక

కాదు గాయాల గొంతుక. గాయపడనివాడు కవి కాలేడు. నాట్లేస్తూ పొలం నడిబొడ్డున శోకం పెట్టుకొని ఏడ్చిన స్త్రీలను చూసి గాయపడి ఉన్నాను. క్రమంగా మా ఇంటి గాయాలు, మా ఊరి గాయాలు, మనుషుల దుఃఖాలు మనసు తొలిచినపుడు తెలియకుండా కవిత్వంతో ప్రయాణించానేమో! కవిత్వమే నా ఆహారం. పానీయం అన్నీ. కవిత్వమే నా ఆదర్శం. ఆరాటం, ప్రయాణం. భంగపడినపుడు అండగా నిలిచింది కవిత్వమే. అవమానాలను విజయాలుగా మలిచే అద్భుత కళ కవిత్వం. ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్ ఒక కవిత్వ ప్రాంగణం. ద్వారం, ధైర్యం. కవిత్వం ఎక్కుపెడుతూ కన్నీటి కాలువల నడుమ ప్రయాణించాను. బందారం నుంచి అమెరికా దాకా కవిత్వంతోనే ప్రయాణించాను." అని తన కవిత్వ తత్వాన్ని పంచుకున్నారు.

'కవిత్వం ఎలా రాయవచ్చు'? అని గుంటూరు లక్ష్మీనర్సయ్య కవిత్వ నిర్మాణ పద్ధతులను వివరించారు. "కవిత్వంలో వస్తువూ, ఇతివృత్తం కవిత్వంగా మారిన తీరును అధ్యయనం చేయటం ఎన్నటికీ తరగని పని. కవిత్వం రాయటానికి జీవితంలో మామూలుగా వాడని మాటల కోసం, అపురూప ఆడంబర పదబంధాలకోసం కష్టపడాల్సిన పనిలేదు. నిత్యం మనమూ, మన చుట్టూ ఉన్న జనమూ మాట్లాడే మాటల్ని మర్మమెరిగి వాడగలిగితే చాలు. మర్మమెరగటంలోనే కవిత్వ కళ ఉంది" అని కొన్ని ఉదాహరణలతో కవులు చేసిన పలు తమాషా పదాల కలయికను విడమర్చి చెప్పారు.

'పద్యకవిత్వం – సౌందర్యాత్మకత' గురించి డా॥ గంధ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ, "కవిత్వం ఒక కళారూపం. పద్యమైనా, గేయమైనా, వచనమైనా ఆకర్షణ ప్రధానాంశం. ఆకర్షణ కవితా శిల్పం చేత సాధ్యమవుతుంది. శిల్పంలో ఒక భాగం లయాత్మకత. పద్యానికి ఛందో నియమం తప్పనిసరి. ఛందోబద్ధమైన రచన భావస్ఫోరకతతోపాటు నాద సౌందర్యాన్ని కూడా కలిగి ఉంటుంది. ఆయా పదాల పక్కన చేరే పదం అంతకు ముందటి పదాన్ని ఎంత ఒద్దికగా చేర్చుకుంటుంది. లేదా తిరస్కరిస్తుంది. అనే దాన్నిబట్టి కూడా పద్యానికి అందం చేకూరుతుంది. పదం పక్కన పదం ఒదగడంతోపాటు మొదటి పదం కూడా సహించాలి. అంతేకాదు సహకరించాలి. అప్పుడు ఆ చరణం గణాలతోపాటు గుణాత్మకంగా కూడా సాగుతుంది. దీన్నే ఆలంకారికులు 'శయ్యా' అన్నారు. పదం పక్కప పదం అర్థం సరిపోయినప్పటికీ అది సహించే లక్షణం లేకపోతే దాని గతి మారిపోతుంది. పద్య కవిత్వం గణాలు, యతిప్రాసాది నియమాలవల్ల రీతులు, శయ్యలు, పాకములు, అలంకారములు చేరి సౌందర్యాత్మకతను సంతరించుకుంటాయి" అని పోతన, దాశరథి పద్యాలను ఉదాహరణగా తీసుకొని వివరించడంవల్ల వచన ప్రేమికుల మెప్పును కూడా పొందింది.

'పాట కవిత్వం' గురించి ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ "పామర జనులు అల్లుకున్న మౌఖిక పాటకు ప్రాధాన్యత లేనట్లే, పాట కవులకు కూడా సాహిత్య గౌరవం లభించలేదు. పద్య, ద్విపద, పద, గేయ, వచన కవులకు వచ్చినంత పేరు, సాహిత్యంలో వారికి దొరికినంత చోటు పాట కవులకు లేదు. దీనికి రెండు కారణాలున్నాయి. 1. సాహిత్య పరిశోధకులు, విమర్శకులు కూడా అందరికి అందరూ తెలంగాణేతరులు కావటం వలన ఇక్కడి పాట కవులను గుర్తించటంలో అనాసక్తిని చూపారు. 2. పాట కవులందరూ సామాజిక నిర్మాణ క్రమంలో దళితులే. ఒకరిద్దరు బిసీ కులాల నుంచి ఉన్నప్పటికీ మెజారిటీ పాట కవులు దళితులే" అని గద్దర్‌కు లాగా తెలంగాణకు చెందిన పాట కవులందరికీ అంతర్జాతీయ గుర్తింపు రావాలని ఆకాంక్షించారు. అంతేకాదు "పాట నిర్మాణంలో కవి పాటించిన నైపుణ్యాన్ని, ఎత్తుగడను, ఆ పాటలో వ్యక్తమైన భిన్న రసాలు, శ్రోతల మీద పాట వేసే ప్రభావం, ఉత్తేజ, విషాదాలను కలిగించే స్థాయిని విమర్శకులు పట్టించుకొని విశ్లేషించవచ్చు. ఫలితంగా పాట కవులకు సాహిత్య గౌరవం లభిస్తుంది" అని సూచించారు.

'దశాబ్ది తెలంగాణ కవిత్వం – సమీక్షణం' పై డా. చంద్రయ్య మాట్లాడుతూ, "పోరాట ఫలితంగా వచ్చిన తెలంగాణను పునఃనిర్మించుకోవాలనే భావన మొదటి దశ కవిత్వంలో బలంగా కనబడుతుంది. తరువాత బహుజన/ఉత్పత్తి కులాల వృత్తి చిత్రణ కవిత్వంలో బాగా పెరిగింది" అని అభిప్రాయపడ్డారు. "ఢిల్లీలో రైతు ఉద్యమానికి మద్దతుగా వెలువడిన కవిత్వం, కరోనా కవిత్వం, ఎన్.ఆర్.సి వ్యతిరేక కవిత్వం, ఆర్.టి.సి. ఉద్యమ కవిత్వం, బహుజన రాజ్యాధికార నేపథ్య కవిత్వం, భాషలో వచ్చిన మార్పులు – శైలీ వైభిన్యత ఇలా ఎన్నో సామాజిక, రాజకీయ విషయాలు తెలంగాణకు కవితా వస్తువును అందించాయి. యువకవుల శైలీ విన్యాసం,



కవిత్వ సౌందర్యంకోసం వారు వాడిన పరికరాల''ను సోదాహరణంగా వివరించారు.

రెండవ సమావేశం 'కథా సందర్భం' మీద జరిగింది. దీనికి అధ్యక్షులుగా ఆచార్య సూర్యాధనంజయ్ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా పాల్గొన్నారు.

'కథతో నా ప్రయాణం' పై అట్టాడ అప్పల్నాయుడు మాట్లాడుతూ "ఏ కథకుడి ప్రయాణమైనా ఆ కథకుడు జీవించిన సమాజంతో ప్రయాణిస్తుంది. ఉద్యమాల్లోని ఘటనల కోసం రచనలు ఆరంభించిన నేను తర్వాత ఉద్యమాన్ని వర్తమాన సామాజిక స్థితిగతులతో సమీక్షించుకొని, నా అవగాహన మేరకు రచనలు చేయడంలోకి మళ్లినాను. ఈ మలుపు చాలా విస్తరించింది" అని అన్నారు.

'ఏది కథ అవుతుంది'పై మహమ్మద్ ఖదీర్‌బాబు మాట్లాడుతూ "అన్నిటినీ కథగా రాయొచ్చు. కాని అన్నీ కథలు అనిపించుకోవు. కథ ఒక అనుభూతి, స్పర్శ, రసాస్వాదన కలిగించాలి. అలా కలిగించినదే కథ. సమాచారం కానిది కథ. భౌతిక, మానసిక, ఆలోచనల, జ్ఞాపకాల, స్థల కాలాల సమష్టి కలయిక నుంచి పాత్రలు, పాఠకులు ఉమ్మడి పొందే పరిష్కారం, విముక్తి, బాధ, సంతోషం, సేద, విరామమే కథ" అని నిర్వచించారు.

ఆర్ట్స్ కళాశాల ముందు జరిగిన 'కవితా వసంతం' కు సభాధ్యక్షులుగా ఆచార్య సి. కాశీం వ్యవహరించగా, ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి కె. శివారెడ్డి, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పాల్గొన్నారు. పాటకవులు అందెశ్రీ, జయరాజు, విమలక్క, యోచన, నలిగంటి శరత్, మాట్ల తిరుపతి, చింతల యాదగిరి, కంకిపాటి రాజా పాడిన పాటలు శ్రోతల హృదయాలనే కాదు ఆర్ట్స్ కాలేజీ గుండెల్ని కూడా ప్రకంపింపజేశాయి. కొండేపూడి నిర్మల చదివిన 'బొట్టు' కవిత హిందుత్వ శక్తులు వ్యతిరేకించడంతో వివాదాస్పదమయింది. దర్భశయనం శ్రీనివాసాచార్య చదివిన 'కుప్పకొట్టిన పొలాన్నే అంగడి చేస్తా', 'కల నిజమవుతున్న వేళ', 'అభివృద్ధి' కవితలు ఈ దేశ రైతుల పక్షాన వినిపించినవి. అన్నవరం దేవేందర్ చెలిమె, వాకిలి గీతం, నేలపాట, పోయిరావలె అనే నాలుగు కవితల్ని చదివారు. కేంద్రసాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ చదివిన 'జాజుపూతల తలుపు రెక్కలు', 'అడివిలో పొద్దూకినట్లు' కవితలు ఎంతో ఆర్ద్రంగా సాగి కాసింత తడిని హృదయంలో నింపాయి.

"ఈ మల్లెచెట్టు తావునే
చిన్న కంకర రాళ్ల కుప్ప ఉండేది
అలిసిపోయి దాని మీదనే
బొంతేసుకొని ఒరిగేది నాయిన
సారసుక్క తాగి పాటందుకుంటే
చందమామ కదలక మెదలక
నిలబడేది
................................
కొత్తింట్లకు పోతే
అందరూ పాలను పొంగిస్తరు కదా
మేము కన్నీళ్లను పొంగించినం
...................................
ఈ జాజుపూతల తలుపు రెక్కల్ని
ఒక సారి పట్టుకొని చూడు
నాయిన సచ్చిపోయినంక
గవర్నమెంటు పైసలొస్తే
గుర్తుగా ఈ తలుపులు చేపిచ్చినము
.......................................
తలుపు రెక్కలను చూసినప్పుడల్లా
తుమ్మచెట్టులాగా మారిన
మా నాయిన
ఇంటికి దాపైనట్టు
కండ్లల్ల మెదులుతుంటడు"

డా॥ సిద్దెంకి యాదగిరి బరి, మండవ, సమ్మతం కవితలు చదివారు. పల్లిపట్టు నాగరాజు 'నీలికళ్ల కోడికూత', 'సముద్ర వర్ణపు కురుల పిల్లకు' అనే రెండు కవితలు చదివారు.

ఫిబ్రవరి 16న మూడవ సమావేశం 'నవలా సమయం' పైన జరిగింది. దీనికి సభాధ్యక్షులుగా డా॥ ఏలె విజయలక్ష్మీ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా అంపశయ్య నవీన్ పాల్గొన్నారు. 'నవలా రచన – పాత్ర పరికల్పన'పైన ప్రముఖ కథకులు పెద్దింటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ "పాత్రను చెక్కే శిల్పి రచయిత. మంచి రచయిత చేతిలో పడిన పాత్రలు పాఠకులకు సజీవంగా జీవితాంతం గుర్తుండిపోయేలా ఉండిపోతాయి" అని తెలుగులో వెలువడిన పలు ప్రసిద్ధ నవలల్లోని పాత్రలను కొన్నింటిని పరిచయం చేసి ఆయా పాత్రలను ఆయా రచయితలు ఎలా మలిచారో ఎందుకు ఇంకా గుర్తుండిపోయాయో వివరించారు.

'తెలుగు నవల – వస్తు వైవిధ్యం'పైన ప్రముఖ కథకులు అల్లం రాజయ్య మాట్లాడారు. 1. భూస్వామ్య – సంస్కరణ వాదం 2. జాతీయ పోరాట నవలలు 3. భూస్వామ్య సంబంధాల వ్యతిరేక నవలలు 4. వ్యాపార నవలలు 5. తెలంగాణ సాయుధ పోరాటం 6. ప్రత్యేక తెలంగాణ సాధన నవలలు 7. నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ నవలలు 8. కరీంనగర్ – ఆదిలాబాద్ రైతాంగ పోరాట నవలలు 9. ప్రపంచీకరణ నేపథ్య నవలలు 10. దళిత నవలలు 11. బహుజన నవలల 12. మహిళా పోరాట నవలలు అని మొత్తం తెలుగు నవలా సాహిత్యాన్ని 12 రకాలుగా వింగడించి సోదాహరణంగా చర్చించారు.

'వర్తమాన నాటక రంగం'పైన ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ "నాటకం కాలానుగుణంగా ప్రేక్షకులను రంజింపజేస్తూనే ఉంది. వర్తమాన నాటకరంగ స్థితిగతులను పరిశీలిస్తే 2014లో తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయిన దగ్గరి నుంచి మొదలు పెట్టాలి. రాష్ట్ర విభజన అనేక అంశాలపై ప్రభావాన్ని చూపింది. ఆర్థికాంశాలు, సామాజిక స్థితిగతులు, కళలు, సాహిత్యాభివృద్ధి ఇలా" అనేక మార్పులు తెలుగు నాటక రంగాన్ని ప్రభావితం చేశాయని చెప్పారు.

'దశాబ్ది తెలంగాణ నవలలు' పైన సీనియర్ జర్నలిస్టు కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ "రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్ల కాలంలో తెలంగాణలో సంభవించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాలపై నవలలు రాకపోవడం విచిత్రం. తెలంగాణ నుంచి ఇప్పటికీ మధ్యతరగతి జీవితాలు నవలలకు వస్తువు కాకపోవడం కూడా విచిత్రమే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం వల్ల ఎన్నో రాజకీయ పరిణామాలు సంభవించాయి. సామాజిక మార్పులు సంభవించాయి. వాటిని పట్టుకున్న నవలా రచయితలు లేకపోవడం విషాదమే" అన్నారు. కొన్ని తెలంగాణ ఉద్యమ నవలల్ని పేర్కొన్నారు.

నాలుగో సమావేశం 'విమర్శాదర్శనం' పైన జరిగింది. ఈ సమావేశానికి డా॥ ఎస్. రఘు అధ్యక్షత వహించగా ఆచార్య

అనుమాండ్ల భూమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'సాహిత్య విమర్శలో సాహిత్యేతర శాస్త్రాల పాత్ర' పై పి. వరలక్ష్మీ మాట్లాడుతూ "సాహిత్యంలో వస్తుశిల్పాలను వాస్తవికతకు, కాల్పనికతకు మధ్య ఉండే సంబంధాన్ని అట్లాగే జ్ఞానానికి, అనుభవానికి ఉండే సంబంధం దృక్పథానికి, నేపథ్యానికి ఉండే సంబంధం- ఇవన్నీ పరిశీలించడానికి సామాజిక శాస్త్రాలు దోహదం చేస్తాయి" అని సూత్రీకరించారు.

'విమర్శతో నా ప్రయాణం'పై ఆచార్య కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ "విమర్శ అంటే రచనతో సంభాషణ. నిర్దిష్ట రచన అంతరాల్లోకి చొచ్చుకుపోవటం. ఆత్మను పట్టుకొనటం" అని నిర్వచిస్తూ "ఇందుకు కొత్తకొత్త అధ్యయన పరికరాలు సమకూర్చుకుంటూ సాగింది నా సాహిత్య విమర్శా ప్రయాణం. అలా నాకు దొరికిన మొదటి పరికరం మనోవైజ్ఞానిక సిద్ధాంతం'' అని వివరించి తాను 1976లో ఎం.ఏ. చదువుతున్ననాటి నుండే విమర్శపట్ల ఎలా ఆకర్షితురాలినయ్యానో వివరించారు.

'విమర్శ పరికరాలు - పరిమితులు'పై డా॥ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ "దేశానికి రాజ్యాంగం ఎలాంటిదో సాహిత్యానికి విమర్శ కూడా అలాంటిదే. విమర్శ సాహిత్య స్థితిగతులను నిర్ధారిస్తుంది. రచనలోని గుణదోషాలను తేటతెల్లం చేసి, పాఠకుడి ఎరుకను సమగ్రం చేస్తుంది. ప్రాచీన విమర్శ పరిమితులను అధిగమించి కవిత్వ తత్త్వాన్ని వినూత్నంగా వివేచించారు. సమాజ, సాహిత్యాల పరస్పర సంబంధాల్లోంచి విమర్శ రూపుదిద్దుకోవాలని సూచించారు. ఆత్మగౌరవ పోరాటాల స్ఫూర్తితో దళితవాదం సాహిత్య విమర్శకు కొత్త ప్రమాణాలను అందించింది. సాహిత్య సౌందర్యశాస్త్రానికి అంతకుముందున్న పరిభాషను ధ్వంసం చేసింది. దళిత జీవన వాస్తవికత నుండి కొత్త కళాతత్త్వాన్ని నిర్మించుకొంది" అని అలంకార శాస్త్రాల నుండి ఆధునిక విమర్శ పరికరాల పరిమితులను వారు విశ్లేషించారు.

'ఒక దశాబ్ది తెలంగాణ సాహిత్య విమర్శ'పై డా॥ లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ "అస్తిత్వ దృక్పథం పట్ల గాఢమైన అభినివేశం ఉన్నా లేకపోయినా ప్రాంతీయ స్పృహ, స్థానిక జాడలు ఈ దశాబ్దపు సాహిత్య విమర్శలో వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఈ దశాబ్ది విమర్శను 1. సాహిత్య విమర్శ వ్యాస సంపుటాలు 2. సాహితీవేత్తలపై వచ్చిన రచనలు 3. దిన, మాస పత్రికల్లో వచ్చిన వ్యాసాలు 4. ప్రత్యేక సంచికలు 5. కవి, రచయితలపై వెలువడ్డ వ్యాస సంకలనాలు 6. పీఠికలు" అని ఆరు విధాలుగా విభజించుకొని అధ్యయనం చేయాలని చెప్పారు.

'వర్తమాన సాహిత్య విమర్శ - స్థితిగతులు' పై మాట్లాడిన డా॥ ఇమ్మిడి మహేందర్ "వర్తమాన సాహిత్య విమర్శను అధ్యయనం చేస్తున్నప్పుడు నూతనంగా విమర్శలోకి వచ్చిన ఆలోచనలు, కొత్త అధ్యయన మార్గాలు, అవి ప్రతిపాదించిన పరికరాలు, గతంలో నుంచి నిరంతరాయంగా ప్రవహిస్తున్న సాహిత్య విమర్శ రీతుల ప్రస్తుత వ్యవహారాలు, ఆలోచనలు ఇందులో భాగం అవుతాయి" అని వివరించి పలు ఆధునిక విమర్శ రీతులను పరామర్శించారు.

'సాహిత్య శిల్పం' పైన జరిగిన ప్యానల్ డిస్కషన్‌కు అధ్యక్షులుగా డా॥ కె. ఎన్. మల్లీశ్వరి ఉన్నారు. దీనికి ముఖ్య అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ డిస్కషన్‌లో ఆచార్య సి. మృణాళిని, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఖాదర్ మోహియుద్దీన్, కుప్పిలి పద్మ, డా. గోగు శ్యామల సాహిత్య శిల్పం గురించి లోతైన చర్చ చేశారు.

కవితాపొద్దుకు అధ్యక్షులుగా ఆచార్య సి. కాశీం వ్యవహరించగా ముఖ్య అతిథులుగా గోరేటి వెంకన్న, జూకంటి జగన్నాథంలు పాల్గొన్నారు. నాళేశ్వరం శంకరం, ఏనుగు నర్సింహారెడ్డి, స్కైబాబ, బెల్లి యాదయ్య, అరసవిల్లి కృష్ణ, సిరికి స్వామినాయుడు, గుడిపెల్లి నిరంజన్, తైదల అంజయ్య, పసునూరి రవీందర్, పుప్పాల శ్రీరాం, మెర్సీ మార్గరెట్, వనపట్ల సుబ్బయ్య, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొని చదివిన కవితలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. పాటకవులు మాస్టార్జీ, గజల్ శ్రీనివాస్, వరంగల్లు శ్రీను, అంబటి వెంకన్న, మిట్టపల్లి సురేందర్, ఏపూరి సోమన్న, కొమిరె వెంకన్న, పల్లె నర్సింహులు పాల్గొని పాడిన పాటలు ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణాన్ని మార్మోగించాయి.

ఫిబ్రవరి 17న జరిగిన 'పరిశోధన విపంచి' సమావేశానికి సభాధ్యక్షులుగా ఆచార్య పి. వారిజారాణి వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

పాల్గొన్నారు. 'సాహిత్య విమర్శకుడిగా నా ప్రయాణం' పై ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడారు. 'జానపద సాహిత్య పరిశోధన – నేటి అవసరాలు, విధానాలు'పై ఆచార్య పులికొండ సుబ్బాచారి మాట్లాడుతూ "చదువుకు జీవనోపాధికి విడదీయరాని విధంగా ఉన్న లంకె ప్రపంచ వ్యాప్తంగా జానపద పరిశోధనపైన విపరీతమైన ప్రభావాన్ని చూపింది. కొన్ని శాఖలను మూసుకోవలసి వచ్చింది. కొన్ని శాఖలు వాటి అధ్యయనం, స్వభావాన్ని, విధానాలను మార్చుకోవలసి వచ్చింది. సాంకేతిక రంగంలో వచ్చిన అభివృద్ధి, క్షేత్రపరిశోధన పరికరాలలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చాయి" అని అన్నారు. 'భాష భావజాలం'పై ప్రొఫెసర్ ఎం.ఎం. వినోదిని మాట్లాడుతూ "సాహిత్యంలో, సమాజంలో భాష ఎంత కీలక పాత్ర పోషిస్తుందో, భావజాలం అంతకు లక్షరెట్లు ఎక్కువ పాత్ర పోషిస్తుంది" అని అన్నారు.

'భాష పరిశోధన – నా ప్రయాణం' అనే అంశంపై డా॥ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ "భాషా పరిశోధనతో నా ప్రయాణం దాదాపు పాతికేళ్ల నుండి ఈనాటి వరకు కొనసాగుతుంది. పల్లెటూరి ప్రజలు ముఖ్యంగా నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రజలు ఇంకా ప్రధానంగా స్త్రీలు, మాట్లాడే మాటలు, ఆ మాటల్లోని రహస్యాలు కనుగొనడం చాలా సంతృప్తినిచ్చింది" అని అంటూనే వందలాది పదాల వ్యుత్పత్తుల్ని వివరించారు.

'వర్తమాన తెలుగు భాషాసాహిత్యాల గమనం, గమ్యం' పై జరిగిన తెలుగుశాఖాధ్యక్షుల చర్చాగోష్ఠికి అధ్యక్షులుగా ఆచార్య సి. కాశీం వ్యవహరించగా, ముఖ్యతిథిగా ప్రొఫెసర్ గుండెడప్పు కనకయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో దేశ వ్యాప్తంగా ఆయా విశ్వవిద్యాలయాల్లో ఉన్న సుమారు 25 మంది తెలుగుశాఖాధ్యక్షులు పాల్గొన్నారు.

"నాణ్యమైన పరిశోధన, బోధన జరగాలంటే భాషా సాహిత్యాలకు ప్రభుత్వాలు నిధులు కేటాయించాలి. సాహిత్యం చదివిన విద్యార్థులకు సరైన ఉపాధి కల్పించినపుడే ప్రతిభావంతమైన విద్యార్థులు సాహిత్యాన్ని చదవడానికి ఆసక్తిని చూపుతారు. ఆ దిశగా పాలకుల మీద ఒత్తిడి పెంచడానికి ఈ చర్చాగోష్ఠి దారి చూపాలి" కాశీం అన్నారు.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయా విశ్వవిద్యాలయాలకు సిలబస్ రూపకల్పనలో స్వేచ్ఛ ఉండాలని అభిప్రాయపడ్డారు. 'నూతన జాతీయ విద్యావిధానం 2020 నేపథ్యంలో సమకాలీన తెలుగు బోధన, పరిశోధన గమనం, గమ్యం'పై ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన డా॥ గంపా వెంకట్రామయ్య చాలా లోతుగా మాట్లాడి ఎన్నో ఆలోచనలను రేకెత్తించారు. 'సర్వజన హితమే సాహిత్యం' అని ఆలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు డా. పఠాన్ ఖాసీం ఖాన్ అన్నారు. 'సాహిత్యం స్వావలంబన'పై పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు డా. ఎన్. సంధ్యారాణి మాట్లాడారు. 'జాతీ జీవం భాషలోనే ఉంటుంది' అని శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు డా. వై. సుభాషిణి అన్నారు. అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు డా. గరికపాటి గురజాడ 'ప్రయోజనంతో కూడిందే సాహిత్యం' అన్నారు. 'భావ వ్యక్తీకరణకు భాషనే మూలం' అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య ఇరపని మాధవి అన్నారు. ఇది 'బోధన, అభ్యసనాల పునర్మూల్యాంకన సందర్భం' అని తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం అధిపతి ఆచార్య వై. రెడ్డి శ్యామల అన్నారు. 'మాతృభాష పరిరక్షణ నేటి ప్రభుత్వాల బాధ్యత'పైన కాకతీయ విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య బన్న ఐలయ్య మాట్లాడారు. 'వర్తమాన తెలుగు రచయితలు, కవుల బాధ్యతలు'పైన యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య జి. పార్వతి మాట్లాడారు.

'వర్తమాన తెలుగు భాషాసాహిత్యాల అభివృద్ధి – ప్రణాళికలు–విశ్లేషణలు' అంశంపైన తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య కె. లావణ్య విలువైన సూచనలు చేశారు.

'సాహిత్య మూల్యాంకనం' పై జరిగిన ప్యానల్ డిస్కషన్‌కు సభాధ్యక్షులుగా ఆచార్య పిల్లలమర్రి రాములు వ్యవహరించగా, ముఖ్య అతిథిగా ప్రముఖ కవి నిఖిలేశ్వర్ పాల్గొన్నారు. 'సాహిత్య మూల్యాంకనం – భావ, కాల నిబద్ధం' పై తెలకపల్లి రవి

మాట్లాడుతూ "మూల్యాలు, మూలాలూ రెండూ మూల్యాంకనాన్ని ప్రభావితం చేస్తాయి, చేస్తూనే వుంటాయి. ఒక సార్వత్రిక శాశ్వత శిల్పంలా, శిలాశాసనంలా వుండవు మూల్యాంకనాలు. మూల్యాలు మారినప్పుడల్లా మూల్యాంకనాలూ మారుతుంటాయి. ఈసడింపబడినవే మన్నన పొందుతాయి. మన్నించబడినవే మట్టికొట్టు కుపోతాయి. ఇవేవీ యాదృచ్ఛికంగా జరగవు. ఆధిపత్యాలు, ఆధిక్యతలు, ధిక్కారాల దీనస్వరాల మధ్య సాగే తీవ్ర, మౌనసంఘర్షణలోనే విలువలు రూపొందుతాయి" అని అన్నారు. 'సాహిత్య మూల్యాంకనానికి ప్రమాణాలు ఏమిటి?' అని నిఖిలేశ్వర్ ప్రశ్నించారు. "రచనల్లోని భాష, వస్తువు అభివ్యక్తి పరంగా కొన్ని మౌలికాంశాలను పరిగణలోనికి తీసుకున్నప్పుడు సాహిత్య ప్రామాణికతను నిర్ణయించగలమని" అన్నారు.

ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్, డా. అమ్మంగి వేణుగోపాల్, ఆచార్య పి. లక్ష్మీనారాయణ, ఆచార్య చింతా గణేష్ పాల్గొని దేశంలోనే తొలి తెలుగు లిటరరీ కాంగ్రెస్‌ను సమర్థవంతంగా నిర్వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగుశాఖను అభినందించారు. ఈ సంప్రదాయం ప్రతియేటా కొనసాగాలని ఆకాంక్షించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం – ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగిన తొలి తెలుగు సాహిత్య మహాసభలు ఘనంగా జరిగాయనే చెప్పాలి. హిస్టరీ కాంగ్రెస్, సైన్స్ కాంగ్రెస్‌లకు ఏ మాత్రం తగ్గకుండా వివిధ ప్రక్రియల గమనం, గమ్యంపైన ఆరు సదస్సులు, రెండు ప్యానల్ డిస్కషన్స్, రెండు కవి, గాయక సమ్మేళనాలు, దేశవ్యాప్తంగా ఉన్న పలు విశ్వవిద్యాలయాల తెలుగుశాఖల అధ్యక్షులచే ఒక చర్చాగోష్ఠి కూడా జరిగి ఈ తెలుగు సాహిత్య మహాసభ ఎన్నో ఫలితాలను సాధించింది. ముఖ్యంగా పలు ప్రక్రియల్లో ఇప్పటిదాకా జరిగిన అభివృద్ధి, చేరుకోవాల్సిన గమ్యం చర్చకు వచ్చాయి. ఎన్నో ఖాళీలను పూరించిన సమావేశంగా గుర్తుండిపోయింది. ఎన్నో తీర్మానాలు కూడా జరిగాయి. వర్తమాన సమాజాన్ని చిత్రిస్తూ కవి, గాయకులు, పాట కవులు చదివిన, పాడిన కవితలు, పాటలు గుండెలను తడిపేశాయి. ఈ మహాసభల్లో పాల్గొన్న దేశవ్యాప్త ప్రతినిధులంతా తెలుగు సాహిత్యరంగంలోని అప్‌డేట్ సమాచారాన్ని, కవి, గాయకులు పంచిన ఆర్తిని మూటగట్టుకొని పోయారు.

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసంలో దేశ వ్యాప్తంగా ఏదో ఒక వేదికపైన ఈ తెలుగు సాహిత్య మహాసభ Telugu Literary Congress-TLC-2024) జరగాలని తీర్మానించారు. కాని ఆ దిశగా ఈ సంవత్సరం ఏర్పాట్లు జరుగుతున్న దాఖలాలు అయితే కానరావడం లేదు. ఇది ఒకింత విచారకరం. రాబోయే ఒలంపిక్స్ ఏ దేశం నిర్వహించాలో ఈ ఒలంపిక్స్ నాటికే నిర్ణయించుకొని ఒలంపిక్ జ్యోతిని ఆ దేశానికి అందించినట్లుగా తెలుగు సాహిత్య మహాసభలు వచ్చే సంవత్సరం ఎక్కడ జరుగుతాయో నిర్ణయించుకొని వారికి ఆ బాధ్యత అప్పజెప్తే బావుండేది. ఇప్పటికైనా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, మద్రాసు విశ్వవిద్యాయలం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయం... లాంటివి ముందుకు వచ్చి ఈ తెలుగు సాహిత్య మహాసభల నిర్వహణ బాధ్యతను భుజానికెత్తుకుంటే తెలుగు సాహిత్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వాలు కూడా సానుకూలంగా ఆలోచించే ఒక వాతావరణం ఏర్పడినట్లు అవుతుంది.

తెలుగు సాహిత్య మహాసభ – 2024 ఇంతగా ఫలవంతం కావడానికి వెనక చోధకశక్తిగా ఉన్నది ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, ఎం.ఏ విద్యార్థులు ఒకెత్తు అయితే దీని రూపకల్పన దగ్గరి నుంచి, నిధుల సేకరణ, మేధోవంతమైన రూపకల్పన, అమలుకు ఆచరణ సాధ్యమైన చక్కని ప్రణాళిక రచించిన మహత్తరశక్తి, ఈ మహాసభ కన్వీనర్ ఆచార్య సి. కాశీం. మూడు రోజులపాటు జరిగిన ఈ తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు కొన్ని నెలల ముందు నుంచే కార్యాచరణ ప్రారంభించి ఎక్కడా కించిత్ లోపం రాకుండా, అపశ్రుతి దొర్లకుండా నడిపించడం కత్తి మీద సామే. మంచి ప్రణాళికతో దాన్ని చాలా సునాయసంగా దాటిన విధానం భవిష్యత్ మహాసభలకు ఆదర్శణీయం, అనుసరణీయం.

దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల తెలుగుశాఖ అధ్యక్షులను ఒకే వేదిక మీదికి తేవాలనే ఆలోచన చాలా గొప్పది. తద్వారా ఆయా విశ్వవిద్యాలయ శాఖలు తమ కార్యక్రమ

రూపకల్పనకు, పునఃసమీక్షకు ఒక సందర్భాన్ని కల్పించినట్లు అయింది.

తెలుగు సాహిత్యంలోని ప్రధాన ప్రక్రియలైన కవిత్వం, కథ, నవల, విమర్శ, పరిశోధనల మీద లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తలను పిలిపించి ఒక దిశానిర్దేశం చేయడం వల్ల ఇందులో పాల్గొన్న ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సాహితీ మేధకు పదును పెట్టినట్టు అయింది. దీని ద్వారా ఆచార్య కాశీం దూరదృష్టి కొనియాడదగింది. సాహితీ ప్రాంగణంలోకి రావడానికి డిగ్రీ కళాశాలలు ప్రధాన ద్వారంగా పనిచేస్తాయి కాబట్టి అక్కడ గ్రాస్ రూట్స్‌లో తెలుగు బోధించే అధ్యాపకులను సానబెట్టాలనే తలంపు ఇందులో తొంగి చూస్తుంది.

సాహిత్య శిల్పం, సాహిత్య మూల్యాంకనం మీద రెండు ప్యానల్ డిస్కషన్స్ పెట్టడం వెనక కూడా ఎంతో ముందు చూపు కనిపిస్తుంది. సోషల్ మీడియా వేదికల మీద విరివిగా రోజు కొన్ని వేల పుటల సాహిత్యం వెలువడుతోన్న తరుణంలో ఇప్పటి రచయితలకు సాహిత్య శిల్పం గురించిన అవగాహన తప్పనిసరి. అలాగే తాము రాసిన రచనలను మూల్యాంకనం చేసుకోవడం కూడా తప్పనిసరి కాబట్టి ఆ రెండు సెషన్స్ భవిష్యత్తులో ఆరోగ్యకర సాహిత్యం వెలువడడానికి తోడ్పాటునందించాయి.

వాగ్గేయకారులను, పాటకవులను, వర్ధమాన కవులను పిలిపించి సభల్లో పాల్గొన్న వారి గుండె దరువులను మోగించిన తీరు అమోఘం. ఆయా కవులు వినిపించిన కవితా వాక్యాలు మండించిన భాస్వరం కూడా చిన్నదేమీ కాదు. తెలుగు సాహిత్య చరిత్రలో ఒక చారిత్రాత్మకమైన, మహత్తరమైన ఈ కార్యక్రమానికి కర్త, కర్మ, క్రియగా నిలబడ్డ ఆచార్య సి. కాశీం కృషి నూటికి నూరు పాళ్లు ఫలించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

జయహో తెలుగు భాష, సాహిత్యం

★ రచయిత: తెలుగుశాఖ అధ్యక్షులు,
నాగార్జున ప్రభుత్వ కళాశాల(స్వ), నల్లగొండ



# ఆర్ట్స్ కాలేజీ ఆకాశం మీద... కవిత్వం వెన్నెల కురిసింది

అన్నవరం దేవేందర్

కవిత్వానికి ఇంత ఫాలోయింగ్ ఇదివరకు చూడలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కాలేజీ ముందు బహిరంగ వేదిక మీద కవిత్వ గానం చేస్తుంటే, వేలాది మంది ఆ పంక్తులతో ఇన్వాల్వెమెంట్ అయ్యారు. ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో తెలుగు లిటరరీ కాంగ్రెస్ 2024 మహాసభలు మూడు రోజులు చారిత్రకంగా జరిగాయి. ఆచార్య గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ మూడు రోజుల సభల్లో కవిత్వతత్వం, కథా సందర్భం, కవితా వసంతం, నవలా సమయం, విమర్శ దర్శనం, సాహిత్య శిల్పం, కవితా పొద్దు పరిశోధనా విపంచి వర్తమాన తెలుగు భాషాసాహిత్యాల గమనం, గమ్యం అంశాలపై ఆయా రంగాల విషయ నిపుణులలో చర్చలు జరిగాయి. సరిగ్గా సంవత్సరం తర్వాత ఆ విషయాల్ని తలుచుకుంటే మనసు ఉప్పొంగుతోంది.

**అక్కడ కవిత్వం చదువుతుంటే..**

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నిర్వహించిన ఆనాటి సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న 25 విశ్వవిద్యాలయాల తెలుగు ఆచార్యులతోపాటు తెలుగు రాష్ట్రాల్లో, డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు, ఆసక్తిగల సాహిత్యకారులు అనేకమంది పాల్గొన్నారు. ఆచార్య చింతకింది కాశీం కన్వీనర్, ఆచార్య సాగి కమలాకరశర్మ కో కన్వీనర్ అప్పటి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చింతా గణేశ్ పర్యవేక్షణలో బహు గొప్పగా రూపొందించారు. అట్లాంటి సదస్సులు విశ్వవిద్యాలయాల్లో ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. కానీ అక్కడ రెండు పూటలుగా జరిగిన 'కవితా వసంతం', 'కవితా పొద్దు'లలో ఇరవై అయిదు మంది ప్రఖ్యాత కవులు గానం చేసిన కవిత్వం ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల పెద్దర్వాజా ముందు మైదానంలో అగ్గిరవ్వలు కురిపించింది. చల్లని వసంతమై ఆవరించింది. అక్కడి నేల ఆకాశం కవితామయం అయ్యింది. సినారె స్మృతిలో 'కవితా వసంతం' పేర జరిగిన కవి సమ్మేళనంలో కవిత్వానికి,



పాటలకు శ్రోతల్లోంచి కోరస్ లు విపరీతంగా వచ్చాయి. గద్దర్ స్మృతిలో పాటల వేదికలమీద పేరెన్నికగల పాటకవులు అద్భుతంగా పాటలు పాడారు. తెలుగు నేలమీద పాట ఒక ఉప్పెన, ఓ ఉద్యమం. ఏ ఉద్యమాల్లోనైనా పాటదే పై చేయి. పాట తర్వాతనే సాహిత్యంలో కవిత్వం, కథ తదితరాలు వేలాదిమంది ముందు వాగ్గేయకారులు పాటలకు సభ మొత్తం ప్రేక్షకుల నుంచి కోరస్ ఇస్తున్న అపూర్వం.

ఆర్ట్స్ కాలేజీ ఆవరణ పైన చందమామ నక్షత్రాలు చల్లని పిల్లగాలి అద్భుతమైన దద్దరిల్లే డి.జె. మైకులు ఎదురుగా వెయ్యి నుంచి రెండు వేల మంది జనాలు. బహుశా వాళ్లంతా తెలుగు సాహిత్య విద్యార్థులు లేదా పరిశోధకులు సదస్సుకు వచ్చిన అధ్యాపకులు కావచ్చు. ఆర్ట్స్ కళాశాల ప్రేమికులు కావచ్చు. ఆపూట వారంతా కవిత్వ ప్రేమికులైపోయారు. ఉర్దూ కవిత్వం చదువుతుంటే అక్కడి శ్రోతలు కూడా ఇన్వాల్వ్ అయి వహ్వా.. వహ్వా అంటూ ప్రతిధ్వనులు. ఈ నవ్య సంప్రదాయం మళ్లీ ఆర్ట్స్ కాలేజీ ముందు తెలుగు కవిత్వానికి ఆనాడు దక్కింది.


**ఈ తరంలో కూడా...**

అసలు కవి సమ్మేళనాల సభల్లో యాభై నుంచి అరవై మంది కవుల కంటే ఎక్కువ ఉండరు. కానీ, ఆనాటి సభలో వెయ్యి మందికి పైగా కన్పించారు. పన్నెండు మంది కవులు ఒకరోజు మరో రోజు పదముగ్గురు కవులను ఎంపిక చేశారు. ముఖ్య అతిధుల ప్రసంగాలు ఉంటాయి కానీ, అవన్నీ కవితామయమై కవిత్వం సాగుతున్నట్టు ఉంటాయి. ఒక్కో కవి ఒకటీ రెండూ కవితలు వినిపించారు. ఆ వాతావరణంలో ఉత్సాహంగా పరవశించి చదువుతారు. ఎందుకంటే ప్రేక్షకుల నుంచి కరతాళ ధ్వనులు.

సాధారణంగా కవిత్వం మధ్యతరగతి ఎగువ మధ్యతరగతి విద్యావంతులు లోలోన చదివి ఆనందపడేది లేదా ఆలోచనలు చేసేది. పాట అయితే ఎవరినైనా ఉద్రూతలాగిస్తది. దాని పవరే వేరు. బాగా ప్రసిద్ధికెక్కిన కవిత్వం శ్రీశ్రీ, శివసాగర్, అలిశెట్టి సాహిత్యేతరులకు కూడా తెలుసు. కానీ ఈ తరంలో కవిత్వాన్ని అంతలా వినడం ఈనాటికీ ఒక గొప్ప అనుభూతిని మిగిల్చింది.

ఆ సదస్సులో అన్ని వాదాలతోపాటు ప్రకృతి, వ్యవసాయం, పురా జ్ఞాపకాలు, సమకాలీన సమస్యలు, రాజ్య స్వభావం, పల్లెలు ప్రపంచీకరణ, మతోన్మాదం, అణచివేత, పోరాటాల కవిత్వం విన్పించారు. అందుకే ఆ బహిరంగ సభలో జరిగిన సినారె, గద్దర్ స్మృతుల్లో కవితా వసంతం, కవితా పొద్దు కార్యక్రమాలు తెలుగు సాహిత్య చరిత్రలో రికార్డ్ చేయతగ్గవి.

**రచయిత: ప్రముఖ కవి**



# వేయి ఉద్యమాల వేకువ పూవు

# ఉస్మానియా తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024

సిరికి స్వామినాయుడు

అది 2024 ఫిబ్రవరి 15వ తేది. యిప్పటి ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపల్, అప్పటి తెలుగు విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ కాశీం గారు ఏర్పాటుచేసిన తెలుగు లిటరరీ కాంగ్రెస్–2024కు వెళ్లేను. ముఖ్యంగా ఈ సభ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఓ సాహిత్య బంధాన్ని ధృడంగా నిలబెట్టేదిగా భావించవచ్చు!

ఎక్కడో గురజాడ పుట్టిన నేల, మన్యం ముఖద్వారమైన పార్వతీపురం నుండి నా ప్రయాణం ఆ రోజు చాలా ఆహ్లాదకరంగా సాగింది. ఓ సభ ఎలా నిర్వహించాలి? ఎంత నిబద్ధతతో పనిచేయాలి? అనే అంశం ప్రొఫెసర్ కాశీం గారికి బాగా తెలుసు. ఆయన ఈ మహాసభలకు కన్వీనర్. ఆయనకు ఎన్నో చైతన్యవంతమైన మహాసభలు యూనివర్సిటిలో నిర్వహించిన అనుభవముంది. పక్కా ప్రణాళికతో తన శిష్యబృందాలతో కమిటీలు ఏర్పాటుచేసి, ఆ సభకు వచ్చేసిన ఒక్కో అతిథికి ఒక్కో పరిశోధక విద్యార్థికి బాధ్యత నప్పగించేరు. నేను కాచిగూడ రైల్వేస్టేషన్లో దిగేసరికే నాకు కేటాయించిన పరిశోధక విద్యార్థి ఆంజనేయులు స్వాగతం పలికి యూనివర్సిటీ గెస్ట్ రూమ్ లో విడిచిపెట్టేరు. సకల సదుపాయాలు గల ఆ గదిలో కాసేపు సేదదీరాక స్నానపానాదులు ముగించి, ఆర్ట్స్ కళాశాల రూమ్ నంబరు 133లో జరుగుతున్న తెలుగు సాహిత్య మహాసభలో పాల్గొన్నాను. ఆ రోజు కాత్యాయనీ విద్మహే, అల్లం రాజయ్య, బండి నారాయణ స్వామి, పెద్దింటి అశోక్ కుమార్, పి వరలక్ష్మి, కోయి కోటేశ్వరరావు, అట్టాడ అప్పలనాయుడు మొదలైనవారి అమూల్యమైన ప్రసంగాలు వినే అదృష్టం దక్కింది. ప్రొఫెసర్ ఎస్వీ సత్యన్నారాయణ గారి " కవిత్వంలో వస్తు శిల్పాలు" అనే అంశం మీద చర్చ బాగా జరిగింది. ఒక ప్రణాళికాబద్ధంగా సభా నిర్వహణ సాగింది. ఆ రోజు మధ్యాహ్నం జరిగే కమ్మని విందు భోజనాల దగ్గర తెలంగాణ



సాహిత్య మిత్రుల్ని కలుసుకొని ఆత్మీయంగా మాట్లాడుకోవటం అపూర్వ అనుభూతిని ఇచ్చింది.

ఆ సాయంత్రం ఆర్ట్స్ కళాశాల ముందు ఆవరణంలో వేలమంది పిహెచ్.డి విద్యార్థుల మధ్య, ప్రజల మధ్య ఆ రాత్రి విరిసిన వెలుతురుపూవులా తెలంగాణ యుద్ధనౌక గద్దర్ "కవితాపొద్దు" వేదికమీద కవిగాయక సమ్మేళనం అట్టహాసంగా ప్రారంభమైంది. సాయంత్రం 6:30 నుండి 10:00 గంటలవరకు ఒక చైతన్యప్రవాహమేదో ఉవ్వెత్తున ఎగిసినట్టయింది. ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, మాష్టర్జీ, అంబటి వెంకన్న, పసునూరి రవీందర్, అరసవెల్లి కృష్ణ, పుప్పాల శ్రీరామ్, ఏనుగు నరసింహారెడ్డి, స్కైబాబా, వనపట్ల సుబ్బయ్య, తైదల అంజయ్య మొదలైన కవిగాయకులతో వేదిక సుసంపన్నమైంది. ఆరోజు నేను కవిత దళిత నేపథ్యంలోనూ "ఒక స్మశానం కోసమే" అనే కవితనూ, ఉద్దానం మూత్రపిండాల మరణాల నేపథ్యంలోనూ రాసిన "ఉద్దానమా ఊపిరి తీసుకో" అనే కవితనూ చదివేను. అనూహ్యమైన స్పందన వచ్చింది. ప్రొఫెసర్ కాశీం చేసిన సభాసమన్వయంలో అడుగడుగునా విద్యార్థులు కవితల్ని అనుభూతి చెందేరు. ఆస్వాదించేరు. ఇంతటి మహోన్నతమైన కార్యక్రమాన్ని ప్రణాళికా బద్ధంగా పకడ్బందీగా నిర్వహించటం తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ రథసారథిగా కాశీంకి బాగా తెలుసు. ఈ మొత్తం కార్యక్రమాన్ని %టీ%9 మీడియా మిత్రులు కవర్ చేయటం, యూట్యూబ్ లో ప్రసారం చేయటం బావుంది! తెలంగాణ సిద్ధించక మునుపు విభజన సమయంలో నేను రాసుకున్న "యిదీ .. గాయపడ్డ సందర్భం" అనే కవిత ఈ సందర్భంగా గుర్తొస్తుంది...

**యిదీ .. గాయపడ్డ సందర్భం**

ఒరే నాయనా
యిపుడు ప్రతి ప్రాంతమూ ఒక నిప్పులజెండానే ..
పచ్చిగాయాల్ని తడుముకుంటూ
పాడేది కన్నీటిపాటే ..
యింతకీ దుఃఖితుడు కానిదెవ్వరు?
గుండెల్ని మెలిపెట్టే దుఃఖానికి తలుపు తీసిందెవరు?
ఎగిరెగిరిపడుతున్న జెండాలకింద నువ్వేనా
ఓడిపోయింది నేను కూడా ..
మనకున్నా ..
మన పేదరికానికి ప్రాంతంలేదురా నాయనా !

పెట్టుబడి .. ఒక ఎలుగుబంటి
పుట్టల్ని కొట్టినట్టు
అది ప్రతి ప్రాంతాన్నీ కొల్లగొడుతుంది
దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్టు
మనల్ని ప్రాంతాలవారీగా పంచుకొని
ఏలుబడి చేయాలనుకున్నోళ్లు
ఏకత్వాన్ని ఏనాడు ఒప్పుకున్నారు కనుక ?
ప్రతి ప్రాంతమూ ఒక మార్కెట్ గా మారితేనే గదా ..
వాళ్ల వ్యాపారాలు వర్ధిల్లేది!

వాళ్లకొక పాదయాత్ర చాలు
పెనవేసుకున్న బంధాల్ని పుటుక్కున తెంపేయటానికి
వాళ్లకొక దీక్షాశిభిరం చాలు
మన పచ్చనిబతుకుల్లో చిచ్చుపెట్టడానికి
వాళ్లు రగిల్చే అగ్నిగుండంలో ..
కళ్లముందే బిడ్డలు దిష్టిబొమ్మలై తగలబడిపోతుంటే
కపటనాటకం వాళ్లది .. కడుపుకోత మనది !

మూడుకళ్లనూ మునివేళ్లతో జుర్రి
తాటిబురికను చేసి తన్నింది వాళ్లు
నమ్మకాల్ని తెంపేసి .. అపనమ్మకాల తెరల్ని
మన ముఖాలమధ్య వేలాడదీసింది వాళ్లు
మన నవ్వులనెలవంకల్ని మాయంచేసి
బతుకువాకిట చీకటికళ్లాపి చల్లింది వాళ్లు
మన కలలకుటీరాల్ని
శతృశిభిరాలుగా మార్చింది వాళ్లు
యిదీ .. గాయపడ్డ సందర్భం !

మన ఇళ్లచూరుకు వేలాడుతున్న
పేదరికపుగబ్బిలాలు ఎగిరిపోతాయనే కదా..
పిడికెడు ఆత్మగౌరవం కోసమే గదా
పోరునేలమీద బిగిసిన పిడికిలివై

నువ్వు విభజన కోరుకున్నది
కానీ .. ఉద్యమభూమిలోంచి
చివురించే ఆశల కొమ్మలు విరిగిపోయీ
మన నమ్మకాల పిట్టగూళ్లు చెదిరిపోయీ
అదే రాజ్యం .. అదే అటవిక పాలన ..
రైతుల శవాలమీద రాకాసి పాలన
యిదీ .. గాయపడ్డ సందర్భం !

యిపుడు ప్రాంతాలమధ్యే కాదు,
ఆటకి సరిహద్దురేఖ గీసినట్టు
దోపిడీవర్గానికీ దగాపడ్డ జనానికీ మధ్య
విభజన జరగాలి
లేగల్ని కుమ్మేసి
రంకెలేస్తున్న ఆంబోతులకు ముకుతాడు వేసినట్టు
పల్లెల్నీ, పచ్చని పంటపొలాల్నీ ముంచెత్తే
పెట్టుబడుల ప్రవాహాలకు అడ్డుకట్ట వేయాలి
ప్రాంతమేదైనా.. పేదవాడి బతుకుచిత్రం మారాలి !

చాలు .. గాయాలు మోసుకుతిరిగిందిక చాలు
యికనైనా ..ఒకరి గాయాలమీదొకరం
వెన్నముద్దలమవ్వాల్సిందే ..
ప్రాంతాలుగా విడిపోయినా.. పోరుదారుల్లో నడుస్తూ
మన పల్లెల కళ్లలోకి నదుల్ని మళ్లించుకుపోయే వాళ్ల
నెత్తిమీద అగ్గిపోయాల్సిందే ..
తమ వెలుగుల కోసం
మన పూరిగుడిసెల్లో బుడ్డీలార్పేసే వాళ్లమీద
కాండ్రించి ఉమ్మేయాల్సిందే ..
ఆర్థిక అస్థిరత్వంతో .. ప్రతి ప్రాంతాన్నీ
పక్షవాతపురోగిని చేసిన పీఠాలు కూలిపోవాల్సిందే ..
ఎవడు నమ్ముకున్న నేలమీద
వాడు శిరసెత్తి నిలబడాల్సిందే ..!!

వివిధ–ఆంధ్రజ్యోతి, (14/10 /2013)

అనాదిగా ఉస్మానియా నిత్య చైతన్యవంతమైన సాంస్కృతిక రాజకీయ పోరాటాలకు ఆలవాలమయింది. తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణలో ప్రధాన పాత్ర పోషించింది. యిక ప్రజా తెలంగాణ రూపకల్పనలో తన వంతు పాత్ర యింకా పోషించాల్సి ఉంది. మలిదశ పోరాటం చేయాల్సి ఉంది. తెలంగాణ అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాల్సి ఉంది. అందుకు ఇటువంటి మహాసభలు ఎంతైనా ఉద్దీపన కలిగిస్తాయి!

**రచయిత: ప్రముఖ కవి, పార్వతీపురం**

<u>**రచయితలకు సూచనలు:**</u>

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

# చారిత్రక సందర్భంలో జరిగిన తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024

మెర్సీ మార్గరేట్

రాత్రి ఎనిమిదవుతుంది అయినా ఉస్మానియా యూనివర్సిటి, ఆర్ట్స్ కళాశాల ముందు విద్యార్థులు, సాహిత్యాభిమానులు కుర్చీలలోనుంచి లేవటం లేదు. రాత్రి పది అయినా అదే పరిస్థితి. కవి సమ్మేళనం ముగిసేంతవరకు అలాగే కూర్చున్నారు. ఒక వందో, రెండు వందలో కాదు. దాదాపు పదిహేను వందల మందికి పైగా ఉంటారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణమంతా విద్యార్థుల కోలాహలంతో నిండిపోయింది. తెలుగునాట ఇలాంటి కవిసమ్మేళన ఉత్సవం నేను చూళ్లేదు. ఉదయం ఆర్ట్స్ కళాశాల లోపల ఆడిటోరియంలో కూర్చున్నవాళ్లు కూర్చున్నట్టే ఉన్నారు. సభ ముగిసేవరకు క్యాంపస్ కదల్లేదంటే 'తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024' ఎంతటి ప్రభంజనం సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. తెలుగు భాషాప్రేమికుల హృదయాలను రంజింపచేసే కార్యక్రమాలను ఎలా రూపొందించారో ఊహించవచ్చు.

తెలుగు సాహిత్య సమావేశాలకు ఇంతటి ఆదరణను చాలా అరుదుగా చూస్తాం. వక్తలు మాట్లాడుతున్నంతసేపు శ్రద్ధగా వినడం, చప్పట్లు కొట్టడం, నచ్చితే ఈలలు, అరుపులతో సమ్మతి తెలుపటం అన్నీ... ఇప్పటికింకా కళ్ళముందు సజీవంగా కదులుతూనే ఉన్నాయి. ఆ కేకలు, చప్పట్లు ఇంకా చెవుల్లో వినిపిస్తూనే ఉన్నాయి. ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు శాఖ 15,16 & 17 ఫిబ్రవరి, 2024న నిర్వహించిన "తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024" ఒక గొప్ప తెలుగు మహాసభ. తెలుగు శాఖ అప్పటి అధ్యక్షులు, ఆర్ట్స్ కళాశాల నేటి ప్రిన్సిపాల్ ఆచార్య సి. కాశీం కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ మహాసభలు తెలుగు సాహిత్య సమాజంలో గొప్ప ముందడుగు అని చెప్పవచ్చు. కథకులు, వచనకవులు, పద్య కవులు, గాయకులు, జానపదకారులు, వ్యాసకర్తలు, నవలాకారులు ఇలా తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన వాళ్ళందరినీ ఉస్మానియాకు పిలిచి, తెలుగు భాషాపండగ జరిపారు.

గత పదేళ్లలో దేశవ్యాప్తంగా జరిగిన చాలా సాహిత్య పండగలకు నేను హాజరయ్యాను. కానీ మన రాష్ట్రంలో ఒక కార్పొరేట్ జాతీయ సాహిత్య పండగకి తగ్గకుండా చేసిన ఈ సాహిత్య పండగ చరిత్రలో మైలురాయి.

ఇంతకీ సాహిత్య పండగ ఏం చేస్తుంది? సాహిత్య పండుగలు (Literary Festivals) సాహిత్య ప్రపంచానికి గొప్ప అవకాశాలను అందిస్తాయి. ఇవి పాఠకులను, రచయితలను, కవులను, విమర్శకులను, పుస్తక ప్రచురణకారులను ఒకే వేదికపైకి తెస్తాయి. కొత్త రచయితలకూ, కవులకూ పరిచయ వేదికగా మారతాయి. రచయితలకూ, పాఠకుల మధ్య ప్రత్యక్ష సంభాషణ జరిగే వీలు కలుగుతుంది. రచయితలు తమ ఆలోచనలను పంచుకుని, కొత్త భావాలను ఆవిష్కరించగలరు. సాహిత్యంపై ప్రజల్లో ఆసక్తి పెంచేందుకు కొత్త పాఠకులు తయారయ్యేందుకు ఈ సాహిత్య పండుగలు ఉపయోగపడతాయి. అయితే తెలుగునాట, సాహిత్య పండగలు తెలుగుకు, తెలుగు సాహిత్యానికి ప్రాధాన్యం ఇస్తూ, జరిగేవి ఒకటో రెండో! ఇంతటి సాహసానికి పూనుకున్న ఈ మహాసభ కన్వీనర్, ప్రొఫెసర్ సి. కాశీం సర్ కృషిని అభినందించాల్సిందే.

నేను రెండు రోజులు ఈ సభలకు హాజరయ్యాను. గొప్ప సృజన శక్తితో, పరిశోధనాపటిమతో, వ్యాఖ్యాన బలంతో తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ యవనికమీద నిలబెడుతోన్న తెలుగు సాహితీవేత్తలెందరినో ఒకే వేదికమీదకి తీసుకురావటం అంటే మాటలు కాదు. అందునా మూడు రోజుల తెలుగు సాహిత్య మహాసభకు రూపకల్పన కేవలం ఒకట్రెండు రోజుల్లో జరిగేది కాదు. దాని వెనక ఎంతో కృషి, మానసిక శ్రమ ఉంటుంది. ఆర్థిక సమస్యలు ఇక చెప్పనలవి కానివి. దేశం నలుమూలలనుంచి లబ్ధప్రతిష్ఠులైన 150 మంది సాహితీవేత్తలు ఒకేసారి పాల్గొనటం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్స్ కాలేజీ చరిత్రలోనే మొదటిసారి కావచ్చు. ఆ చారిత్రక సందర్భానికి వేదికైంది ఈ సాహిత్య మహాసభ.

ప్రొఫెసర్ సి. కాశీం అధ్యక్షులుగా మొదలైన ప్రారంభ సమావేశంలో, ప్రొఫెసర్ ఎన్. గోపి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, ప్రొఫెసర్ డి. రవీందర్, ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు, డా. కె. శ్రీనివాస్, ప్రొఫెసర్ చింతా గణేష్ గార్ల ప్రసంగాలతో సభను వెలిగించారు.



'కవిత్వ తత్త్వం' శీర్షికన జరిగిన సెషన్లో ముఖ్య అతిథిగా సతీష్ చందర్ అద్భుతంగా మాట్లాడారు. 'కవిత్వంతో నా ప్రయాణం' అంశం మీద డా. నందిని సిధారెడ్డి, 'కవిత్వం ఎలా రాయవచ్చు' అంటూ గుంటూరు లక్ష్మీనర్సయ్య, 'పద్య కవిత్వం– సౌందర్యాత్మకత' గురించి డా. గంఢ్ర లక్ష్మణరావు, చేసిన ప్రసంగాలు కొత్తగా రాయటం వైపు అడుగులు వేస్తున్నవాళ్ళకి ఎంత ఉపయోగకరమో, ఇప్పటికే రాస్తున్నవారికి రిఫ్రెషర్ ట్రైనింగ్ లాంటి సెషన్ అది.

కథా సందర్భం సెషన్ లో ఓల్గా మేడం, అట్టాడ అప్పల నాయుడు, కాలువ మల్లయ్య, మహమ్మద్ ఖదీర్ బాబు, వేణు ఉడుగుల, ప్రొ. బన్న ఐలయ్య గార్లు కూడా అధ్భుతంగా మాట్లాడారు.

ఇక పాట కవులను వచన కవులను కలిపి ఒక సింగిడి చేసి కూర్చోబెట్టి ఆర్ట్స్ కళాశాల ముందు 'కవితా వసంతం' శీర్షికతో కాశీం సర్ నిర్వహించిన కవి సమ్మేళనం మర్చిపోలేనిది. ఒకవైపు పాటలు మరో వైపు వచన కవిత్వం ఆ సాయంత్రం అదో కొత్త ప్రపంచం.

భోజనాల దగ్గర కూడా ఎటువంటి హడావిడి లేదు. మేము స్కాలర్లం, Ph.d పట్టా అందుకున్న అధ్యాపకులం, అసిస్టెంట్ ప్రొఫెసర్లం అన్న కొంచెం గర్వం కూడా లేకుండా వడ్డించే దగ్గరనుంచి నీళ్ళు అందించే వరకూ ప్రొఫెసర్ కాశీం సర్ విద్యార్థుల, పరిశోధకుల నిబద్ధతను అభినందించాల్సిందే. ముఖ్యంగా డా. ఎస్. చంద్రయ్య భోజనాల దగ్గర చేతులు కడుక్కునే చోట బకెట్ తో నీళ్ళు నింపటంలాంటి పని ఎలా చేశాడో అంతే పద్ధతిగా తెలంగాణ ఏర్పాటు తర్వాత వెలువడిన "దశాబ్ది తెలంగాణ కవిత్వం" అనే అంశంపై చేసిన పత్ర సమర్పణ చాలా ఆలోచనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా చేశాడు.

ఇలాంటి "తెలుగు లిటరరీ కాంగ్రెస్"ల అవసరం ప్రస్తుత తెలుగు సమాజానికి ఎంతో అవసరం. ఇతర భాషలతో, భాషాసాహిత్యాలతో పోటీ పడటానియాకితేనేం, మన సాహిత్యాన్ని మూల్యాంకనం చేసుకోడానికి అయితేనేం, మన మూలాల్లోకి తొంగి చూస్తూనే AI ఏలుతున్న ప్రపంచంలో భాషను కాపాడుకుంటూ అభివృద్ధి చేసుకోడానికి ఇలాంటి కార్యక్రమాన్ని రూపొందించిన టీమ్ తెలుగు లిటరరీ కాంగ్రెస్ ను అభినందిస్తున్నాను. ఈ కృషి ఇలా అనేక లిటరరీ కాంగ్రెస్ లు ఆగకుండా జరిగేలా ముందుకువెళతారని ఆశిస్తున్నాను.

**రచయిత: ప్రముఖ తెలుగు కవయిత్రి,**
**కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత**

# సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం: ప్రయోజనాలు

- ఆచార్య పమ్మి పవన్ కుమార్

- బొమ్మగాని నవీన్ కుమార్

ఈ పత్రంలో సామాజిక భాషాశాస్త్రం అన్న పదబంధాన్ని Sociolinguistics అనే ఆంగ్ల పదబంధానికి తుల్యంగా వాడుతున్నాం. తెలుగులో సామాజిక భాషాశాస్త్రానికి తుల్యంగా సాంఘిక భాషాశాస్త్రం అనే పదబంధం కూడ వాడుకలో ఉంది. సామాజిక-సాంఘిక అన్న మాటలు పరిమాణాత్మకమైన భేదంతో వాడుకలో ఉన్నాయి. కాని, ఈ రెండు మాటలకి తుల్యంగా ఆంగ్లంలో Socio-అని వాడటంలో ఇబ్బంది లేదు. కాబట్టి, Sociolinguistics అన్న మాటకు సాంఘిక లేదా సామాజిక భాషాశాస్త్రం అనే అర్థాలను చెప్పుకోవచ్చు. పరిశోధనకు గ్రహించిన భౌగోళిక, సమాచార పరిమాణాలపై ఆధారపడి సాంఘిక లేదా సామాజిక భాషాశాస్త్రం అనే తుల్యరూపాలను వాడవచ్చు.

సమాజంలోని పౌరులందరూ తమకు అలవాటైన భాషలో సంభాషింటుకుంటారు. ఇది ఆ సమాజంలో తరతరాలుగా వాడుకలో ఉన్న భాష అయి ఉంటుంది. సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తికీ తమ భాషకు సంబంధించిన జ్ఞానం ఉంటుంది. ఈ జ్ఞానంలోని హెచ్చుతగ్గులు ఒక సమాజంలోని సభ్యుల భాష వాడుకలో భేదాలకు కారణమవుతాయి. సమాజంలోని ప్రతి వ్యక్తికి తన భాషపట్ల ప్రత్యేకమైన జ్ఞానం ఉంటుంది. కాబట్టి, ఒక భాషాసమాజంలోని ఏ వ్యక్తి ఇతరులతో సంభాషించే సందర్భాలలో అర్థపరమైన సంక్లిష్టతను ఎదుర్కోడు.

సమాజానికి కూడ భాషాపరమైన ప్రత్యేకతలు ఉంటాయి. సాధారణంగా ఈ జ్ఞానం అమూర్త రూపం (abstract form)లో ఉంటుంది. అంటే, ఇదంతా భాషావ్యవహర్తల మెదళ్ళలో ఉంటుంది. ఈ మొత్తాన్ని మనం ఒక క్రమరూపంలో చూడలేం. భాషావ్యవహర్తల వ్యవహారానికి పనికివస్తున్న పదసంపద, నిఘంటువులలోని పదసంపదని పోలి ఉండదు. అంటే- నిఘంటువులలో అకారాది క్రమంలో కూర్చినట్టు అన్నమాట. సందర్భాన్నిబట్టి వ్యవహరించడానికి తగిన పదాలను కూర్చుకుంటూ వ్యవహర్తలు భాషను వాడుతారు. దీనిని అర్థం చేసుకోవాలంటే భాషాశాస్త్ర జ్ఞానం అవసరమవుతుంది. దీనిలోను, ప్రధానంగా సామాజిక భాషాశాస్త్రాన్ని అధ్యయనం చేయటంవల్ల ఇటువంటి అంశాలు సులభంగా బోధపడతాయి.

సామాజిక భాషాశాస్త్ర అధ్యయనంవల్ల సమాజంలోని సాంఘిక భాషావినియోగానికి సంబంధించిన విశేషాలను అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. మానవులు మాట్లాడే సహజ భాషలకు సంబంధించిన జ్ఞానం చాలా సంక్లిష్టమైనది. దానిని వర్ణించడంలో (descriptive), వివరించటంలో(para phrasing)అనేకమైన సవాళ్ళు ఎదురవుతాయి. భాషా వ్యవహర్తలందరూ విభిన్నమైన వృత్తులకు, కులాలకు, ప్రాంతాలకు, సాంఘిక నేపథ్యాలకు సంబంధించినవారై ఉంటారు. వీరందరి భాషావ్యవహారానికి సంబంధించిన విశేషాలను పూర్తిగా వర్ణించటంలో సంక్లిష్టత ఎక్కువ. సామాజిక భాషాశాస్త్ర సహాయంతో ఈ విశేషాలను కొంతకొంతగా అవగాహన చేసుకోవచ్చు. భాషకు సంబంధించిన జన వ్యవహారంలోని చలన సూత్రాలను కొన్నిటిని గ్రహింపునకు తెచ్చుకోవచ్చు.

వేరువేరు సందర్భాలలో మనం భాషను వ్యవహరించే తీరును జాగ్రత్తగా గమనించండి. పిల్లలు తమ స్నేహితులతో, తమ తల్లిదండ్రులతో, తమ ఉపాధ్యాయులతో, అపరిచితులతో - ఇలాగే సమాజంలోని సభ్యులు ఇతరులతో - మాట్లాడే సందర్భాలను గమనించండి. వ్యక్తికీ- వ్యక్తికీ, వ్యక్తికీ-వ్యక్తులకు మధ్య వ్యవహారశైలిలో ఉండే భేదాలు ఎన్నో కనిపిస్తాయి. భాషావ్యవహర్తలందరికీ తమభాషకు సంబంధించి అప్పటికే సిద్ధంగా ఉన్న వ్యాకరణ గ్రంథాలలోని అంశాలకన్న కొంత ఎక్కువే తెలుసు. సాధారణ వ్యాకరణ గ్రంథాలు-భాషను ఎలా ఉపయోగించాలి?' అనేది వివరిస్తాయి(prescriptive). కానీ, వాస్తవానికి తమభాషను ఎలా ఉపయోగించాలన్నదానిపై కొన్ని నియమాలను ఏర్పరచుకొని భాషావ్యవహర్తలు భాషను వ్యవహరించరు. కానీ, భాష వాడుకకు సంబంధించిన చలన సూత్రాలు ప్రతి భాషావ్యవహర్తకు తెలుసు. వాటిని దైనందిన జీవితంలో ఎలా వాడుకోవాలన్నది కూడ వారికి తెలుసు.

వ్యవహర్తల వాడుక నుంచి ఈ చలన సూత్రాలను గ్రహించి ఆ విశేషాలను వర్ణించడం(descriptive) సామాజిక భాషా శాస్త్రవేత్తల (Sociolinguists) పని.

భాష వాడుకకు సంబంధించిన రెండు అంశాలను ప్రధానంగా గుర్తించాలి. మొదటిది, మాట్లాడడానికి వ్యవహర్తకు సహకరిస్తున్న భాషావనరుల సంపన్నత, గాఢత. రెండవది, మనుషుల మధ్య సంబంధాలు ఏర్పడడంలో భాష నిర్వహించే పాత్ర. భాష అనువర్తనకు సంబంధించిన ఈ రెండు అంశాలు భాషకు, భాష ద్వారా సమాజంలోని సభ్యులకు ఉన్న పరస్పర సంబంధాన్ని ప్రతిబింబిస్తాయి.

సాధారణంగా భాషావ్యవహర్తల మాటతీరుద్వారా వారి సామాజిక నేపథ్యం, ప్రాంతీయ నేపథ్యం మొదలైన వివరాలు తెలుస్తాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని తెలుగు వ్యవహారంలో ప్రాంతీయమైన వైవిధ్యాలు ఎక్కువ. ఈ వైవిధ్యాలను తెలంగాణ, రాయలసీమ, కోస్తా, కళింగాంధ్ర మాండలికాలుగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి(2010) మనకు పరిచయం చేశారు. తెలంగాణలోని ప్రజలలో అనేకమైన వ్యవహార భేదాలు కనిపిస్తాయి. ఉదా: అచ్చిండు/ఒచ్చిండు/వచ్చిండు; పొలగా/పిలగా; పొల్ల/పిల్ల; బాపు/అయ్య/నాన్న; అవ్వ/అమ్మ; బాబాయి/కక్కయ్య/ చిన్నాన్న; బువ్వ/అన్నం... మొదలైనవి. ఒకే మాటకు ఒక భాషావ్యవహార ప్రాంతంలోని ప్రాంతీయమైన భేదాలను ఈ మాటలు తెలియజేస్తున్నాయి. వీటిలో ఒక అర్థంలో ఒక మాటను వాడుతున్న వ్యవహర్తకు తక్కిన మాటలు తెలిసే అవకాశం ఉండవచ్చు-ఉండకపోవచ్చు. ఇటువంటి ప్రాంతీయ భేదాలతో ఎంత ఎక్కువ పరిచయం పెంచుకుంటే ఆ భాషావ్యవహారం మనకు అంతగా అవగతమవుతుంది.

సామాజికభాషాశాస్త్రం అనేది భాషాశాస్త్రంలో ఒక అధ్యయన విభాగం. ప్రజల రోజూవారి జీవనంలో, సామాన్య సంభాషణల్లో భాష ఏవిధంగా పనిచేస్తుంది?, భాష సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తుంది?, సమాజం భాషపై ఏవిధంగా ప్రభావం చూపుతుంది?... మొదలైన అంశాలను అధ్యయనం చేయడం సామాజిక భాషాశాస్త్ర అధ్యయన లక్ష్యం. దీనికి సమాజశాస్త్రం (Sociology)తో పాటు, మనోవిజ్ఞానశాస్త్రం (Psychology), నృశాస్త్రం (Anthropology) వంటి శాస్త్రాల జ్ఞానం కూడా అవసరమవుతుంది.

సమాజ సంబంధిత(సమాజంలోని సభ్యుల) భాషావ్యవహారాన్ని అధ్యయనం చేసేది సామాజికభాషాశాస్త్రం (Sociolinguistics). భాష కోణంనుంచి సమాజ నిర్మాణాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు (భాషాసామాజికత)? అనేదాన్ని వివరించేది భాషాసామాజికశాస్త్రం (Sociology of language). వీటి మధ్య భేదాన్ని Hudson(1996: 4) ఈ విధంగా నిర్వచించాడు; "..Sociolinguistics is the study of language in relation to society, whereas the sociology of language is the study of society in relation to language. సామాజికభాషాశాస్త్రాన్ని (Sociolinguistics) భాషాశాస్త్రవేత్తలు, భాషాసామాజిక శాస్త్రాన్ని (Sociology of language) సమాజ శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తుంటారు.

సామాజిక భాషాశాస్త్రం అనేది చాలా విస్తృతమైన అధ్యయన రంగం. భాషకు సమాజంతో ఉన్న సంబంధాన్ని ఈ శాస్త్రం ఆధారంగా వివిధ కోణాలలో అధ్యయనం చేసే వీలుంది. వ్యవహారంలో భాష ఎలా మారుతున్నది?, ఎలా వ్యాప్తి చెందుతున్నది?, వివిధ సామాజిక వర్గాల ప్రజలు ఎలా మాట్లాడుతున్నారు?, వేర్వేరు వ్యవహర్తలు ఒక చోట కలిసినపుడు వారి భాషావ్యవహారంలో మార్పులు ఏవిధంగా ఉంటాయి?, వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, వేర్వేరు అవసరాలకోసం భాషను ఏవిధంగా ఉపయోగిస్తారు? ... వంటి విషయాల ఆధారంగా కొందరు భాషావేత్తలు తమ పరిశోధన సాగిస్తారు. మరికొందరు; భాష వినియోగం ద్వారా ప్రజల మధ్య సంబంధాలు ఎలా ఏర్పడుతున్నాయి-వృద్ధి చెందుతున్నాయి?, భాష ఆధారంగా సామాజిక గుర్తింపు ఏఏ రూపాలలో వ్యక్తీకరించబడుతున్నది?... వంటి అంశాలను పరిశీలిస్తారు.

సమాచార సేకరణలో, సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడంలో సామాజిక భాషాశాస్త్రం, భాషాసామాజిక శాస్త్రాలు అందించే పద్ధతులను సార్థకంగా వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు; వ్యవహర్తల సామాజిక నేపథ్యం, వయస్సు, లింగం, వర్గం, వృత్తి, విద్య... వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని భాషను ఎలా ఉపయోగిస్తున్నారనేది అధ్యయనం చేయవచ్చు. అదేవిధంగా ఒకే భాషకు సంబంధించి వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు మాండలికాలు ఉన్నప్పుడు(సాధారణంగా ఉంటాయి), ఆయా ప్రాంతాల్లో ఉన్న సమరూప పదాలు, వాటి ఉచ్చారణలో భేదం, వ్యాకరణ నిర్మాణం... వంటి అంశాలను అధ్యయనం చేయవచ్చు. క్షేత్రపర్యటనలద్వారా సేకరించిన సమాచారం ఇందుకు ప్రధానమైన ఆకరంగా ఉపయోగపడుతుంది.

## క్షేత్రపర్యటన, జాగ్రత్తలు:

పరిశోధకుడు క్షేత్రపర్యటన చేసేటప్పుడు ఎంచుకున్న ప్రాంతంలోని ప్రజలపై అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రాథమిక సమాచారం లభ్యమయ్యేది వ్యవహర్తలనుంచే కాబట్టి వారిపై అవగాహన కలిగిఉండడం పరిశోధకునికి తప్పనిసరి. క్షేత్రపర్యటనలు పరిశోధకుల సమయాన్ని, శక్తిని అమితంగా గ్రహిస్తాయి. ఓపికను పరీక్షిస్తాయి. ఊహించని ఎన్నో సవాళ్ళను ముందుకు తెస్తాయి. అయినా పరిశోధనకు క్షేత్రపర్యటనే పునాది కాబట్టి, పరిశోధకులు క్షేత్రపర్యటనకు వెళ్ళేముందు సంబంధిత రంగంలోని నిష్ణాతులవద్ద శిక్షణ పొందాలి; కొన్ని అంశాలపై తగినంత అవగాహనను కలిగి ఉండాలి.

మొదట పరిశోధనకు వ్యవహర్తలను ఎంపిక చేయడం పూర్తవ్వాలి. తర్వాత పరిశోధనకు కావలసిన సమాచారాన్ని సేకరించుకోడానికి ఒక సమాచార సేకరణ పథకాన్ని (data collection plan) తయారుచేసుకోవాలి. భిన్న రంగాలకు చెందిన వ్యవహర్తలను కలవడం, మాట్లాడడం, స్నేహం చేయడం ద్వారా, భాషలోని వైవిధ్యంతో పాటు, మానవ జీవితాన్ని విభిన్నమైన కోణాలలోచూసే నేర్పు పరిశోధకుడికి పరిచయమవుతుంది.

వ్యవహర్తల నుంచి సమాచారాన్ని సేకరించే సందర్భంలో వారి ప్రాథమిక వివరాలను తెలుసుకోడానికి కొన్ని ప్రశ్నలను పరిశోధకుడు అడగాల్సి ఉంటుంది. మీ పేరేమిటి? ఏ ఊరు మీది? సొంతూరు ఇదేనా? మీరు ఏ కులానికి చెందినవారు? ఎన్నేండ్లు ఉంటాయి మీకు? ఎంత వరకు చదువుకున్నారు? మీ తల్లిదండ్రులు ఏం పని చేసేవారు? వారు చదువుకున్నారా? మీ భార్య/భర్త ఏ ప్రాంతంవారు? మీ భార్య/భర్త ఎంత వరకు చదువుకున్నారు, ఏం చేస్తున్నారు? మీకు పిల్లలెంత మంది? వారు చదువుకుంటున్నారా/చదువుకున్నారా? మీరేం పని చేస్తుంటారు? ఏం పంటలు పండిస్తారు?... ఇలా వ్యవహర్యలను ప్రశ్నిస్తూ ఉంటే, తెలియని వ్యక్తికి(పరిశోధకునికి) వ్యక్తిగత విషయాలు చెప్పడానికి వారు సంకోచిస్తారు. ఈ విషయాలను తీసుకొని మరుసటి నాడు తమకు లేనిపోని సమస్యలను తెస్తారేమోనని సందేహిస్తారు. ఇటువంటి వారు పరిశోధనలో సమాచార సేకరణకు అంత సులువుగా సహకరించరు. కొన్ని సందర్భాల్లో వారు పరిశోధకుని పనికి ఆటంకం కలిగించే విధంగా ప్రయత్నించే అవకాశంకూడా ఉంది. దానివల్ల ఆ ప్రాంతంలోని మిగిలిన వ్యవహర్తలుకూడా పరిశోధకుడితో మాట్లాడడానికి మొగ్గుచూపరు. కాబట్టి క్షేత్రపర్యటనలలో నేర్పుతో వ్యవహరించాలి.

క్షేత్రపర్యటనలో భిన్న వర్గాలు/సంఘాలు ఎదురవుతాయి. వారితో పరిచయం చేసుకోడానికి పరిశోధకుడు ఇబ్బందులను ఎదుర్కోవలసి రావచ్చు. ముఖ్యంగా ఒక సమాజంలో ఉండే ప్రజల విద్య స్థాయి తక్కువగా ఉండవచ్చు. సాధారణంగా క్షేత్రపర్యటనలలో పరిశోధకుడిని అపరిచితుడిలా చూస్తారు. అందువల్ల పరిశోధకుడు అందరితో కలిసిపోయే గుణం కలిగి ఉండాలి. కొన్ని సందర్భాల్లో పరిశోధకుడు ఆయా సమాజాలలోని పెద్దల సహాయంతో క్షేత్రపర్యటనను సులభం చేసుకోవలసి ఉంటుంది. 'మన సమాజం గురించి, మన భాష గురించి తెలుసుకోడానికి వచ్చాను...' అని వారికి సులభంగా అర్థమయ్యేలా చెప్పవలసి ఉంటుంది.

క్షేత్రపర్యటనలో వ్యవహర్తలతో నిర్వహించే ఇంటర్వ్యూలు సాధారణ సంభాషణలలా ఉండాలి. దానికి తగినట్టు ప్రశ్నావళిని రూపొందించుకోవాలి. వ్యవహర్తల అభిరుచులకు అనుగుణమైన విషయాలపై మొదట సంభాషణ ప్రారంభించాలి. వ్యవహర్త మాటలకు అడ్డుపడకుండా, సమయస్ఫూర్తితో ముందుగా తయారుచేసుకున్న ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టాలి. భాష అధ్యయనం కోసమే పరిశోధన చేస్తున్నామని వ్యవహర్తలకు నమ్మకం కలిగేలా సాధారణ అంశాలపై మాట్లాడించాలి. అప్పుడే వ్యవహర్తలకు మొదట్లో ఉండే భయం పోయి, సహజంగా మాట్లాడగలుగుతారు. "అవును/కాదు" పద్ధతిలో సమాధానాలను కోరే ప్రశ్నావళిని తయారుచేసుకోకూడదు. వ్యవహర్తల భావ స్వేచ్ఛకు అవకాశాన్ని కల్పించే, సహజధోరణిలో మాట్లాడగలిగేలా ప్రశ్నావళిని ఉండాలి. వ్యవహర్తల ప్రాథమిక సమాచారం, వారి వృత్తి, విద్య, సంస్కృతి వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నావళిని తయారుచేసుకోవాలి. కథన పద్ధతిలో సమాచారం రాబట్టే విధంగా ప్రశ్నావళిని తయారుచేసుకొనే నేర్పు పరిశోధకునికి తెలిసిఉండాలి. సాధ్యమైనంత ఎక్కువగా వ్యవహర్తలు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అది ప్రజల రోజూవారీ సంభాషణలను పోలి ఉండాలి. క్షేత్రపర్యటన ద్వారా ఎంత సమాచారాన్ని సేకరించాలి?– అన్న ప్రశ్నకు 'ఎంత ఎక్కువగా సేకరించగలిగితే అంత' అన్నదే సరైన సమాధానం.

క్షేత్రపర్యటన చేసే పరిశోధకుడు ఓపికగా ఉండడం చాలా ప్రధానం. క్షేత్రపర్యటన పరిశోధకుడి ఓపికను పరీక్షిస్తుంది. విసుగు కలిగించే పరిస్థితులు ఎదురవుతాయి. వాటిని అధిగమించడానికి పరిశోధకుడికి దృఢమైన సంకల్పం, చేసే పని మీద స్పష్టత, ఏకాగ్రత ఉండాలి. లేకపోతే, క్షేత్రపర్యటనలు కష్టంగా మారతాయి. పరిశోధనలో పేలవమైన ఫలితాంశాలను పేర్చుకుంటూ పోవలసిన అగత్యం కలుగుతుంది.

సమాజంలో వివిధ రకాల వృత్తులు, ఉద్యోగాలు చేసేవారు ఉంటారు. పరిశోధకుడికి ఆయా విషయాలకు సంబంధించిన వ్యవహారాలు తెలిసుండాలి. అప్పుడే వ్యవహర్తల నుంచి ఎక్కువ సమాచారాన్ని రాబట్టడానికి అవకాశం ఉ ంటుంది. ప్రభుత్వ ఉద్యోగి మనస్తత్వం ఒకలా ఉంటే, ఒక రైతు ఆలోచనలు మరొకలా ఉంటాయి. చదువుకునే విద్యార్థి ప్రవర్తన ఒకలా ఉంటే, చదువు ఆపేసిన లేదా ఏమీ చదువుకోని వ్యక్తి వైఖరి మరొకలా ఉంటుంది. ఇలా భిన్న రకాల మనస్తత్త్వాలు, ఆలోచనలు ఉన్న ప్రజలతో వ్యవహరించే పని కాబట్టి, పరిశోధకుడు సామాజిక అవగాహనను పెంపొందించుకోవాలి. మనస్తత్త్వ శాస్త్రానికి సంబంధించిన ప్రాథమికమైన అంశాలు పరిశోధకులకు తెలిసి ఉండాలి.

పైన చెప్పుకొన్న విషయాలతోపాటు క్షేత్ర పర్యటనలద్వారా విలువైన సమాచారాన్ని సంపాదించుకోడానికి పరిశోధకుడు; 1. ఎవరి నుండి సమాచారం సేకరించాలి? దీనిని నిర్ణయించుకొనే విధానాలు ఏవి?, 2. వ్యవహర్తలను మాట్లాడించడమే కాకుండా ఆ సమాచారాన్ని రికార్డ్ చేసుకోడానికి వారిని ఎలా ఒప్పించాలి? 3. వ్యవహర్తలతో ప్రభావవంతంగా మాట్లాడించడానికి అనుసరించాల్సిన పద్ధతులు ఏమిటి? 4. వ్యవహర్తలు మాట్లాడేదాన్ని ఎందుకు రికార్డ్ చేస్తున్నామనేదానిని వారికి ఎలా వివరించాలి? 5. స్పష్టతతో కూడిన, నాణ్యమైన రికార్డింగ్‌లను ఎలా చేయాలి, ఇందుకు సహకరించే ఉపకరణాలు ఏవి? 6. రికార్డ్ చేసిన సమాచారాన్ని ఎలా, ఎన్నిరూపాలలో భద్రపరచవచ్చు? 7. పరిశోధన క్షేత్రంలోని ప్రజలు ఎక్కువగా ఏ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు? ... వంటి ప్రశ్నలను స్మరణలో ఉంచుకోవాలి.

తెలుగులో సామాజిక భాషాశాస్త్ర సహాయంతో జరిగిన అధ్యయనాలు చాలా తక్కువ. మౌఖిక భాషపై జరిపిన పరిశోధనలు మరీ తక్కువ. మనకు తరతరాల సాహిత్య వారసత్వం ఉంది. ఇదంతా పుస్తకరూపంలో ఉంది. గడిచిపోయిన కాలంలోని ప్రజల మౌఖిక వ్యవహారం ఎలా ఉండేదన్నది రికార్డు చేసుకొనే సదుపాయాలు పూర్వం లేవు. కాబట్టి, పరిశోధనలుకూడా తక్కువగానే జరిగాయి. 'వైవిధ్యం ఎక్కువ, ఏకరూపత తక్కువ....' వంటి కారణాలతో మౌఖిక వ్యవహారాన్ని తక్కువగా భావించకూడదు. ఏ సమాజంలోనైనా భాషకు ప్రాథమికమైన ప్రయోజనం మౌఖిక వ్యవహారమే. కాబట్టి, వనరులు మెండుగా ఉన్న ఈ కాలంలో సామాజిక భాషాశాస్త్ర నేపథ్యంతో తెలుగు ప్రజల మౌఖిక వ్యవహార భాషపై మరిన్ని పరిశోధనలు జరపవలసిన అవసరం ఉంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**


**తెలుగు :**

1. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2000. భాష – సమాజం – సంస్కృతి. హైదరాబాద్: నీల్‌కమల్ పబ్లికేషన్స్.

2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2010. తెలుగు భాషాచరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

3. పాండయ్య, అప్పం. 2007. మహబూబ్‌నగర్ జిల్లా తెలుగు సామాజిక భాషాశాస్త్ర పరిశీలన. హైదరాబాదు: జయమిత్ర సాంస్కృతిక వేదిక.

పరిశోధన గ్రంథాలు:

4. చంద్రయ్య, ఎస్. 2017. తిమ్మాజిపేట మండల మౌఖిక భాష: వర్ణనాత్మక వ్యాకరణం. పిహెచ్. డి. పట్టం కోసం తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం. పర్యవేక్షకులు డా. పమ్మి పవన్ కుమార్.

5. పవన్ కుమార్, పమ్మి. 2012. కట్టా వరదరాజు ద్విపదరామాయణం: భాషాపరిశీలన. (A Linguistic Survey of Katta Varadarajus Dwipada Ramayanam- Ph. D. Dissertation) Language in India, ISSN1930-2940. Vol-12: 01-01-2012.

6. మల్లేష్, మంత్రి. 2019. తెలంగాణ మాండలిక నవలలు: భాషాపరిశీలన. పిహెచ్. డి. పట్టంకోసం తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం. పర్యవేక్షకులు డా. పమ్మి పవన్ కుమార్.

**పరిశోధన పత్రం:**

7. పవన్ కుమార్, పమ్మి. 2024. తెలుగు మౌఖిక వ్యవహార భాష: పరిశోధనావశ్యకత. హైదరాబాద్: మూసీ మాసపత్రిక. సంపుటి–27: సంచిక–5, పుటలు: 11–15.

English:

8. Hudson, R. A. 1996.Sociolinguistics. 2nd edn. Cambridge: Cambridge University Press.

9. Sapir, E. 1921. Language: An Introduction to the Study of Speech. New York: Harcourt, Brace.

10. Trudgill, P. 2000. Sociolinguistics: An Introduction to Language and Society. 4th edn. England: Penguin Books



**రచయితలు: ఆచార్యులు, తెలుగుశాఖ,**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం, తెలంగాణ,**

**పిహెచ్.డి. పరిశోధక విద్యార్థి**

# తెలంగాణ కథా సాహిత్యంలో పాలమూరు జిల్లా కథ-ప్రత్యేకత

బి. వెంకటేశ్

**0. సంక్షిప్తి**

దాదాపు 120 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలంగాణ కథాసాహిత్యంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ తెలంగాణ కథాచరిత్రకు సమానమైన కథాచరిత్ర కలిగినది పాలమూరు జిల్లా కథా సాహిత్యం. తెలంగాణానుంచి వెలువడిన తొలి కథ, తెలంగాణ తొలి కథా సంకలనం, తెలంగాణ తొలి కథా సంపుటి, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత తెలంగాణ ప్రాంతంనుంచి వెలువడ్డ తొలి కథా సంకలనం మొదలైన ఎన్నో ప్రత్యేకతలను పాలమూరు జిల్లా కలిగి ఉన్నది. వాటన్నింటినీ చర్చించడమే ప్రస్తుత పరిశోధన పత్ర ముఖ్య ఉద్దేశం.

**1. నేపథ్యం**

పాలమూరు జిల్లా అంటే అందరికీ గుర్తొచ్చే విషయాలకన్నా, గుర్తించని ఎన్నో గొప్పనైన, ప్రత్యేకమైన విషయాలు ఉన్నాయి. అందులో ఒకటే పాలమూరు జిల్లా కథ. ఈ కథ సాహిత్యం ఎన్నో ప్రత్యేకతలను కలిగిఉంది. ఉధృతంగా ప్రవహిస్తున్న నదికి అడ్డు వచ్చినవన్నీ లొంగిపోయి, ఆ నదిలో కలిసి కొట్టుకుపోయినట్టు, ఇన్ని సంవత్సరాలుగా కోస్తాప్రాంత కథా సాహిత్య ధాటికి మిగతా ప్రాంతాల కాథా సాహిత్యమంతా మరుగున పడిపోయింది. ముఖ్యంగా తెలంగాణ కథా సాహిత్యం తన ఉనికినే పోగొట్టుకున్నది. దానికి భాష, యాస, ప్రాంత, అధికారం మొదలైన ఎన్నో కారణాలున్నాయి. అయితే ఉధృతమైన నదిని సైతం ఎదురీది ఒక చిన్న చేపపిల్ల తన ప్రాణాలను నిలుపుకున్నట్లుగా మన తెలంగాణ విమర్శకులు, పరిశోధకులు గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ కథా సాహిత్యంపై విస్తృతమైన పరిశోధనలు చేసి మన కథా అస్తిత్వాన్ని వెలుగులోనికి తెచ్చారు, తెస్తున్నారు. ఇలాంటి పరిశోధన ప్రతిరూపాలలో ఒకటే సంగిశెట్టి శ్రీనివాస్ పరిశోధించి కూర్చిన 'దస్త్రమ్' తొలితరం తెలంగాణ కథల సూచి (1910-1956). అయితే "1970ల కంటే ముందు తెలంగాణలో కథే లేదని ఎవరో అజ్ఞానపు మాటలు మాట్లాడితే కోపించిన సంగిశెట్టి శ్రీనివాస్ ఈ సూచిక పని చేపట్టాడు. అతడు మౌనంగా చేస్తూ వస్తున్న పరిశోధనలో తెలంగాణ కథల సేకరణ కూడా ఉన్నది "(దస్త్రమ్. పుట : ix). ఈ దస్త్రమ్ లో దాదాపు 800ల పైచిలుకు తెలంగాణా కథలను పేర్కొన్నాడు. దీనితో తెలంగాణ కథా సాహిత్యం కొంతవరకు పరిపుష్టిని సంతరించుకొని, భావి పరిశోధనలకు, పరిశోధకులకు మార్గదర్శి అయ్యింది. పది మంది నడిచే దారిలో కాకుండా ఇలా కొత్తగా పరిశోధన చేయాలనే ఆలోచనలోంచి పుట్టినదే ప్రస్తుత పరిశోధనా పత్రం.

**2. తెలంగాణ కథా సాహిత్యంలో పాలమూరు జిల్లా కథ – ప్రత్యేకత**

పాలమూరు జిల్లా కథల కాణాచి. పూర్వం నుండి జానపదకథలకు పెట్టింది పేరు. తర్వాతి కాలంలో చారిత్రక పురుషులు, వీరులు అయిన పండుగల సాయన్న, పానుగంటి మియాసాద్ కథ, బండ్లోల్ల కురుమయ్య, ఆవుల ఒద్దిరాజు, ఆరె దొరలు, మైలాపూర్ మల్లయ్య కథ, ఎన్నపట్ల పకీర్ కథలు పాలమూరు జిల్లాలో ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. ఆధునిక లిఖిత కథా సాహిత్యంకూడా జిల్లాలో ఎంతో ఉంది. ఈ లిఖిత కథా సాహిత్య ప్రత్యేకతల్ని ఇప్పుడు తెలుసుకుందాము.

**2.1 తెలంగాణ నుంచి వెలువడిన తొలి కథ – 'రాజయ సోమయాజులు' (1914)**

తెలంగాణ ప్రాంతం నుండి ముద్రణ రూపంలో వచ్చిన మొదటి కథ బదారు శ్రీనివాసరావు రాసిన 'రాజయ సోమయాజులు' కథ. ఈ కథ పాలమూరు జిల్లా నుండి వెలువడింది. "కోయిలకొండ జమీందారు బరారు శ్రీనివాసరావు (శర్మ) 1913 జూన్ 1వ తేదీన జిల్లా కేంద్రమైన మహబూబ్ నగరు నుండి తెలంగాణ తొలి సాహిత్య పత్రిక 'హితబోధిని' ని ప్రారంభించారు"(పాలమూరు ఆధునిక యుగ కవుల చరిత్ర. పుట:107). ఈ హిత బోధిని పత్రికను నిర్వహించే " బదారు

శ్రీనివాసరావు రాసిన కథ 'రాజయ సోమయాజులు' ఆ పత్రికలో 1914లో అచ్చయింది. తెలంగాణలో అచ్చయిన మొదటికథ అది"(తెలంగాణ తెలుగు కథ – పుట : 14) అని ముదిగంటి సుజాతా రెడ్డి తెలిపారు. అలాగే ఈ హితబోధిని పత్రికలో మధ్య విషాదము (సంభాషణాత్మక కథ), మృత్యువు దాని జ్ఞాపకము (మ్యూజింగ్స్ వంటిది), కువైద్యరాజు మొదలైన కథలు కూడా 1913–14 మధ్యలో వచ్చాయి. అయితే నిజాం పరిపాలన, ఉర్దూ అధికార భాష, రజాకార్లు, నిరక్షరాస్యత ఉన్న కాలంలో తెలంగాణా పరిస్థితుల దృష్ట్యా 1914లో ఇలాంటి కథలు అచ్చుకావడం అసాధారణ విషయం. అదికూడా కాస్తంత వెనక బాటుకు గురైన పాలమూరు జిల్లా నుండి రావడం పెద్ద సాహసమనే చెప్పాలి.

**'రాజయ సోమయాజులు' కథ ప్రత్యేకత :** ఈ కథ బాల్యవివాహాలను విమర్శిస్తూ రాసింది. ఇందులో 60 యేళ్ళ వృద్ధుడు, 8 ఏళ్ల బాలికను వివాహం చేసుకుంటాడు. ఆ చిన్నారి పెళ్లికూతురి జీవితం ఏ విధంగా సాగింది వివరించబడింది. ఇంకా కన్యాశుల్కం, మంత్ర తంత్రాలు, మూఢాచారాలు, దయ్యాలు, భూత వైద్యుడు మొదలైన అంశాలను ఈ కథలో ఎత్తిచూపాడు రచయిత. ఇలాంటి అంశాలన్నీ ఆ కాలంలో ఎంతలా ప్రజలలో చొచ్చుకుపోయాయో శ్రీనివాసరావు తెలిపాడు. ఇంకా ఈ కథలో నాటకీయత, చమత్కారమైన సన్నివేశాలు, వ్యంగ్య సంభాషణలు కూడా ఉన్నాయి. ఈ విధమైన కథల్ని ఆధునిక కథా ప్రారంభంలోనే అందించి ప్రత్యేకథ సంతరించుకున్నది పాలమూరు.

## 2.2 తెలంగాణ తొలి కథా సంకలనం "కమ్మ తెమ్మరలు" (1940)

పాలమూరు జిల్లాకు చెందినవాడు బూర్గుల రంగనాథ రావు. ఇతను " తెలంగాణ తొలి కథా సంకలనం కమ్మ తెమ్మరలు – 1940), తొలి కథా సంపుటి (వ్యాహ్యాళి – 1943)ని బూర్గుల రంగనాథ రావు వెలువరించాడు " (మహబూబ్ నగర్ జిల్లా వచన రచయితలు సమగ్ర పరిశీలన. పుట : 68). అయితే పాలమూరు జిల్లాకు చెందిన రంగనాధరావు వెలువరించిన కమ్మతెమ్మరలు గురించి

"తెలంగాణలో 1940లో అచ్చయిన మొదటి కథా సంకలనం 'కమ్మతెమ్మరలు' (తొలినాటి కతలు – తెలంగాణా తొలితరం కథలు – రెండో భాగం. పుట : 10) అని ముదిగంటి సుజాతారెడ్డి తెలిపారు. ఈ విధంగా తెలంగాణా తొలి కథా సంకలనం పై హక్కు కూడా పాలమూరుకే దక్కింది.

'కమ్మతెమ్మరలు' కథా సంకలనం ప్రత్యేకత

ఈ కమ్మతెమ్మరలు సంకలనంలోని కథలన్నీఆనాటి సమాజానికి ప్రతిబింబంగా కనబడతాయి. పూర్తిగా తెలంగాణ భాషలో రాసిన 'పల్లెబడి' కథను చరుకుపల్లి హరికృష్ణారావు రాసాడు. ఇందులో పల్లెల్లోని వీధిబడుల స్వరూపం , ఉపాధ్యాయులు, పిల్లలు మొదలైన అంశాలు తెలుస్తాయి. 'కోవిల్లో' కథను చరుకుపల్లి రఘోత్తమరావు రాశాడు. ఈ కథలో గ్రామాధికారుల స్వార్థం, దోపిడి, దౌర్జన్యం కనబడతాయి. గుండవరము హనుమంతరావు 'టాకీలో సమావేశము', కథలో వేశ్య జీవితం, సంఘసంస్కరణ మొదలైన అంశాలున్నాయి. ఆవురు పల్లి కృష్ణారావు 'మా బావ', అందుగుల లక్షణ రావు 'అంతే నా నోము' కథలలో యువకులు, సంస్కరణ అంశాలు ఉన్నాయి. అందుగుల తిరుమల రావు 'నిష్ఫలం' కథకూడా చెప్పుకోదగినదే.

## 2.3 తెలంగాణ తొలి కథా సంపుటి – "వ్యాహ్యాళి" (1943)

పాలమూరు జిల్లాకు చెందిన బూర్గుల రంగనాథరావు మొత్తం 13 కథలు రాశాడు. అయితే ఆరు కథలతో 'వ్యాహ్యాళి' కథా సంపుటి వచ్చింది. "సాధనా సమితి నిజాం రాష్ట్రం వారు 1943 సం?లో వ్యాహ్యాళి అనే కథా సంపుటిని వెలువరించారు. దీని రచయిత బూర్గుల రంగనాథ రావు, తెలంగాణ నుంచి వెలువడిన మొదటి కథా సంపుటి వ్యాహ్యాళి " (మహబూబ్ నగర్ జిల్లా వచన రచయితలు. పుట : 69). ఈ కథా సంపుటిలో ఆరు కథలున్నాయి. అవి 1. ప్రమాదం 2. ఎందుకు 3. వ్యాహ్యాళి 4. కథానిక 5. నమ్ము నమ్మకపో 6. ఆదర్శం. అడవిబాపిరాజు బూర్గుల రంగనాథరావును ఉత్తమ కథకుడుగా ప్రశంసించాడు. రంగనాథ రావు 'కథలెట్లా రాయాలి' అనే గ్రంథాన్ని కూడా వెలువరించాడు.

## 2.4 ఆంధ్ర ప్రదేశ్ అవతరణ తర్వాత తెలంగాణ నుండి వెలువడ్డ తొలి కథా సంకలనం – "గడ్డిపూలు" (1964)

"ప్రాంతీయ రచయితల రచనల్ని ప్రభవింప జేయాల్సిన బాధ్యతను" (గడ్డిపూలు. పుట : 3) తలపైకి ఎత్తుకొని తాంధ్ర

జనార్దనరెడ్డి సంపాదకులుగా కల్వకుర్తి తాలూకా యువజన సంఘం 'గడ్డిపూలు' కథా సంపుటిని ప్రచురించింది. గడ్డిపూలు అనేది ప్రతీక. దేనికి ప్రతీక అంటే "గడ్డిపూలు అనగానే సమాజంలో అట్టడుగున ఉంటూ పరిస్థితుల విష వలయంలో పడి జీవించే అణగార్తుల చిత్రణలను స్ఫురిస్తుంది" (గడ్డిపూలు, పుట : iv, V) అని తాపీ ధర్మారావు ఈ సంకలనంలోని కథల స్వరూపాన్ని వివరించాడు. ఈ గడ్డిపూలు కథా సంకలనంలో ఏడు కథలున్నాయి. అవి :

1. సంపత్ రావు – అతకని బ్రతుకులు
2. తిమినేనిపల్లి నారాయణ రెడ్డి – దిష్టి బొమ్మలు
3. సుధాకర్ రెడ్డి – తెలిమబ్బు
4. దామన్న – గడ్డిపూలు
5. చల్పత్ రావు – విమోచన
6. శ్రీనివాసాచార్య – అమాయకులు
7. లక్ష్మీ నాథ్ – ఊహకందని బంధాలు

ఈ కథలన్నీ దేనికవే ప్రత్యేకతను సంతరించుకున్నాయి. 1950, 60వ దశకాలలో సమాజంలో ఉన్న పరిస్థితులను ఈ కథలు మన కళ్ళ ముందుంచుతాయి. మధ్యతరగతి భేషజాలు, స్త్రీ మనస్తత్వాలు, అణగారిన స్త్రీ, పురుష జీవితాలు, కులవృత్తులు, కూలీలు పడే బాధలు , అక్రమ సంబంధాలు, అనాథలైన పిల్లలు మొదలైన ఎన్నో అంశాలు ఈ కథలలో మనకు కనిపిస్తాయి. అందుకే " పాతకొత్తల కలయికల సంధికాలంలో ఆధునిక చదువులు తెచ్చిన మార్పునూ, సమిష్టి జీవితం నుండి విడివడి వ్యక్తులుగా రూపు దిద్దుకుంటున్న క్రమంలో పురుషుని సంఘర్షణలను నవతరం పాలమూరు రచయితలు ఎలా చెప్పారో తెలుసుకునేందుకే ఈ గడ్డిపూలు " (గడ్డిపూలు. పుట : xi) అని సంపాదక వర్గం తెలియ చెప్పింది.

**ముగింపు**

పాలమూరు జిల్లా కథ – ప్రత్యేకత అనేకన్నా అస్తిత్వం అంటే బాగుంటుందేమో. ఎందుకంటే ఈ కథలన్నీ తమ అస్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. పాలమూరు అస్తిత్వాన్నేకాక తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని, ఇక్కడి పరిస్థితులను చూపిస్తున్నాయి. వంకరగా పెరిగిన చెట్లన్నింటిలో నిటారుగా ఉన్న దాని వైపే మన చూపు వెళ్లినట్టు, బానిస భావాలతో బతికే ప్రజలందరిలో ప్రశ్నించే ఒక వ్యక్తిని గుర్తించినట్లు, ప్రత్యేకత అనేది కూడా కొన్ని విలక్షణమైన లక్షణాలను సంతరించుకుంటుంది. అదే దాని గుర్తింపుగా నిలుస్తుంది. అదే దాని అస్తిత్వం. అదేవిధంగా పాలమూరు జిల్లా కథా సాహిత్యం కూడా అనేక విలక్షణతలను కలిగి ఉన్నది. అదే దాని ప్రత్యేకత, అస్తిత్వం. ఈ ప్రత్యేకతే తెలంగాణ కథా సాహిత్యంలో పాలమూరు జిల్లా కథ – ప్రత్యేకతగా మన ముందు నిలిచింది. ఆ ప్రత్యేకతలే తెలంగాణ నుంచి వెలువడిన తొలి కథ, తెలంగాణ తొలి కథా సంకలనం, తెలంగాణ తొలి కథా సంపుటి, ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత తెలంగాణ నుండి వెలువడిన తొలి కథ సంకలనం అనే ప్రత్యేకతలను పొందింది పాలమూరు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. గోపి, గుంటి. 2011. మహబూబ్ నగర్ జిల్లా వచన రచయితలు సమగ్ర పరిశీలన. హైదరాబాదు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం.

2. జనార్ధన రెడ్డి, తాంద్ర. 2006. గడ్డిపూలు. మహబూబ్ నగర్. పాలమూరు ఫౌండేషన్.

3. రామారావు, ఎస్వీ. 2012. పాలమూరు ఆధునిక యుగ కవుల చరిత్ర. హైదరాబాదు. పసిడి ప్రచురణలు.

4. వెంకటేశ్వర్లు, పంతంగి. (సంపా). 2011. తెలంగాణ తెలుగు కథ. వరంగల్లు. కాకతీయ విశ్వవిద్యాలయం.

5. శ్రీనివాస్ సంగిశెట్టి. 2004. దస్త్రమ్. హైదరాబాదు. తెలంగాణ రీసెర్చ్ అండ్ రిఫరల్ సెంటర్.

6. సుజాతా రెడ్డి ముదిగంటి, శ్రీనివాస్ సంగిశెట్టి (సంకలనం). 2005. తొలినాటి కథలు తెలంగాణా తొలితరం కథలు – రెండో భాగం. హైదరాబాదు. నవోదయ బుక్ హౌస్.

**గమనిక :**

1). పాలమూరు – ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా (పాలమూరు జిల్లా)

2). బడారు శ్రీనివాసరావు ఇంటిపేరు బడారు, బండారు, బరారు అని పరిశోధకులు వాడారు.

**రచయిత: పరిశోధక విద్యార్థి , హెచ్‌సియు**

# బంజారా కథా సంపుటి 'ఝోళి' కథలు-విశ్లేషణ

డా. ఆజ్మీరా సిల్మానాయక్

**ఉపోద్ఘాతం**

బంజారా భాషలో 'ఝోళి' అంటే 'ఊయల' అని అర్థం. ఈ కథాసంపుటిని ఆచార్య సూర్యాధనంజయ్ రచించారు. ఇందులో మొత్తం తండావాసులకు సంబంధించిన 12 కథలున్నాయి. కథను బంజారాలు సాకి అంటారు. ఇవన్ని బంజారా సమాజానికి సంబంధించిన కథలు కావడంవల్ల వాటికి 'గోర్ బంజారా సాకి' అని పేరు పెట్టడం జరిగింది.

ఆచార్య సూర్యా ధనంజయ్ నల్గొండ జిల్లా, మిర్యాలగూడెం, భల్లునాయక్ తండాలో జన్మించారు. వీరు 12 గ్రంథాలు, 10 సంకలనాలను వెలువరించారు. తెలంగాణ ప్రాంతంనుండి మొట్టమొదటి బంజారా స్త్రీ ఆచార్యులు. వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా, శాఖాధిపతిగా, పాఠ్య ప్రణాళిక సంఘం ఛైర్మన్‌గా వ్యవహరించారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయంలో వివిధ హెూదాలలో వివిధ పదవులను నిర్వహించారు, నిర్వహిస్తున్నారు. బంజారా సమాజంనుండి ఎదిగి వచ్చిన మొట్టమొదటి కవయిత్రి/ రచయిత్రి ఆచార్య సూర్యాధనంజయ్.

మనిషి జీవితం కథతో ప్రారంభమై కథతో ముగుస్తుంది. అందుకే కవులు "కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం; రెప్పపాటే జీవన ప్రయాణం" అన్నారు. అంటే మనిషి రెప్పపాటు జీవితంలో ఎన్నో కథలు జనించాయి. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల్లో నవల, నాటకం తర్వాత కథకు ప్రముఖస్థానం ఉన్నది. కథ అంటే, మన చుట్టూ జరిగే సంఘటనల సమాహారమని అర్థం.

**బంజారా కథలు**

ఈ ఝోళి అనే కథల సంపుటిలో ఆచార్య సూర్యా ధనుంజయ్ తాను పుట్టి పెరిగిన తండావాసుల జీవితాలను చూసి, కథల రూపంలో మలుచుకున్నారు. ఈ భూమిమీద తన రక్తాన్ని పంచుకుని పుట్టిన బిడ్డలను అంగట్లో వస్తువులను అమ్ముకున్నట్లు అమ్ముకునే దుస్థితి బంజారా సమాజానికి వచ్చింది. అందుకు ప్రభుత్వంవారు అమాయక పేదవారైన బంజారా తల్లిదండ్రులు ఆడపిల్లల్ని దిక్కులేకుండా వదిలివేయకుండా, అంగట్లో వస్తువు మాదిరిగా అమ్ముకోకుండా తమకు ఆ పిల్లల్ని అప్పగించవచ్చని 'ఊయల' (ఝోళి) అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. అట్లా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ద్వారా రక్షింపబడిన ఒక బంజారా ఆడపిల్ల కథ, ఆ పేద తల్లిదండ్రుల మానసిక బాధే ఈ 'ఝోళి'. ఈ కథల సంపుటికి 'ఝోళి' అని పేరు పెట్టడం సముచితంగా ఉన్నది.

బంజారాల జీవన విధానం, తండా కట్టుబాట్లు, నాయక్, అతని ఆధ్వర్యంలో ఉండే కారోబారి వ్యవస్థ చాలా పకడ్బందీగా ఉంటుంది. కారోబారి వ్యవస్థలో తండాకు జెండాలాంటివాడు నంగరీర్ నాయక్. అతనికి సలహాదారులుగా ఢాడి, భాట్, డావో ఇంకా ఇతర నాయకులు ఉంటారు. అంటే నేటి క్యాబినెట్‌లాగా. తండాలోని బంజారాల జీవన విధానం విలక్షణంగా ఉంటుంది. వారి ఆచారాలు, కట్టుబాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, గృహ నిర్మాణం, ఆహారపు అలవాట్లు, గోర్ పంచాయతి నసాబ్, భాష, సాంస్కృతిక విధానం, పండుగలు, జాతరలు, పూజలు, పుట్టుకనుండి మరణంవరకు మిగిలిన నాగరిక సమాజం కంటే భిన్నంగా ఉంటుంది.

కథా సాహిత్యంలో ఈ బంజారా కథలు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది. ఈ కథలన్నీ వేదనాభరితమైన బంజారాల జీవన స్థితిగతుల్ని, ముఖ్యంగా బంజారా స్త్రీల కష్టాలు, బంజారేతరులు చేసే రకరకాల మోసాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, అణచివేత, అమాయకత్వం, పేదరికం, ఆచారాలు, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు మొదలైన అంశాలను రచయిత్రి చక్కగా చిత్రీకరించారు. రచించిన ప్రతి కథ కూడా ఒక్కొక్క ఆణిముత్యం అని చెప్పవచ్చు. రచయిత్రి ఆ సమాజంనుండి ఎదిగివచ్చి, ఒక ఉన్నతమైన అధ్యాపకవృత్తిలో ఉండి కూడా తన తండావాసుల జీవితాలను కథ రూపంలో చక్కగా వివరించారు. ఇదివరకే వారు 'కేసులా' అనే కథా సంకలనాన్ని తీసుకొచ్చారు. అందులో బంజారా రచయితలు, బంజారేతర రచయితలు రాసిన 55 కథల్ని ఒక సంకలనంగా

తీసుకొచ్చారు. ఇప్పుడు ఈ 'ఝోళి' అనే కథా సంపుటిని తీసుకొచ్చారు. అందుకు వారికి అభినందనలు తెలుపుతున్నాను.

**ఝోళి కథల వర్గీకరణ-విశ్లేషణ**

ఈ మొత్తం 12 కథలను వివిధ రకాలుగా వర్గీకరించి అధ్యయనం చేయవచ్చు. కథా వస్తువు బట్టి వీటిని ఈ క్రింది విధంగా విభజించాలి.

(1) బంజారేతరుల మోసం / దగా

(2) సంస్కృతి-సంప్రదాయం-ఆచారాలు

(3) పేదరికం / దోపిడి

(4) కరోనా కథలు

(5) ఉద్యమం

**(1) బంజారేతరుల మోసం**

అమాయకులైన బంజారాలు అనాది నుండి మోసపోతూనే ఉన్నారు. నిరక్షరాస్యులైన బంజారాలు కష్టపడి పని చేయడమే తప్ప ఇతరులను మోసం చేయరు. కొంతమంది బంజారేతరులు స్వార్థంతో, ధనాపేక్షతో వీరిని నిత్యం ఏదో ఒక రకంగా దోపిడీ చేస్తూనే ఉంటారు. బంజారాలు ప్రకృతిసిద్ధమైన జీవనాన్ని గడుపుతారు. ఆడంబరాలంటే వారికి తెలియదు. దొరికినదానితో సంతృప్తిపడి జీవిస్తారు. వారికి భవిష్యత్తు గురించి భయం లేదు. కాని ఉన్నది ఒకే ఒక భయం, నాగరికులైన బంజారేతరులు తమ విలాసాలకోసం వీరిని పావులుగా వాడుకుని వదిలేస్తారు. తమ స్వలాభంకోసం వారికి మాయమాటలు చెప్పి, గొడ్డుచాకిరి చేయించుకుని వాడుకుంటారు. అలా తమ బంజారాలను బంజారేతరులు ఏవిధంగా మోసం చేస్తారనే విషయాలను రచయిత్రి 'ఝోళి' అనే కథా సంపుటిలో (1) హిమ్మత్ (2) పల్లీబుట్ట అనే రెండు కథల్లో చాలా చక్కగా దృశ్యమానం చేసారు.

**హిమ్మత్ :** ఈ కథ వరంగల్ జిల్లా, నెక్కొండ గ్రామపరిధిలో ఉన్న బంజారా తండాకు సంబంధించినది. ఈ కథలో ప్రధాన పాత్రలు రమణీబాయి, ఆమె కొడుకు వెంకట్రామ్ నాయక్, అతని కూతురు లక్ష్మి, వెంకటలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు. రమణీబాయి మనుమరాలైన లక్ష్మి స్నేహితురాలు మోతి, బ్యాంకు మేనేజరు నర్సింగ్‌రావు, పటేల్, పట్వారీ, జిల్లా కలెక్టరు, విప్లవనాయకుడు అడవిలో అన్న భూషణం.

ఈ కథలో తరతరాలుగా తండాకు ఒక నాయకుడు ఉంటాడు. ఆ నాయకుని వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నది రమణీబాయి. ఈమె పోరాటవనితే కాదు మంచి వాగ్ధాటి గల నాయకురాలు. తన సమస్యలను తానే స్వయంగా పరిష్కరించుకునే ప్రజానాయకురాలు. తమ తండావాసులే కాకుండా తనచుట్టు ఉన్న బంజారేతరుల గురించి ఆలోచించే నాయకురాలు. నిత్యం బంజారాల గురించి ఆలోచించే వ్యక్తి. తరతరాలుగా బంజారాలు అనుభవిస్తున్న పేదరికం, దరిద్రం తొలగిపోయే విధంగా ఆలోచించే నిస్వార్థపరురాలు. బంజారాల మంచితనాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బ్యాంకు లోన్‌ల పేరుతో బంజారాలకున్న కొద్దిపాటి భూమిని తాకట్టు పేరుతో కాజేయాలనే దుర్మార్గుల భరతం పట్టిన పోరాట యోధురాలు రమణీబాయి. తమ జాతివారు నిస్వార్థపరులు. ఉన్న కొద్ది భూమి కాగితాలను తాకట్టు పెట్టి లోన్లు తీసుకోవడం తప్పులేదని అందర్నీ జాగృతం చేసిన వీరవనిత రమణీబాయి. ఆ తర్వాత తమ అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకొని మోసం చేయాలనుకున్న బ్యాంకు మేనేజర్, పటేల్, పట్వారీలను నిలదీసింది. మొదటగా అందరూ ఆమెను అనుమానించి, అవమానం చేసి తీవ్రంగా దూషిస్తూ కొట్టినా, వాటన్నింటిని తట్టుకున్నది రమణీబాయి. కొద్దిరోజుల తర్వాత అసలు మోసం భూషణం ద్వారా బయట పడింది. భూషణం ఒక విప్లవకారుడు. అమాయక ప్రజల తరుపున నిలబడే వ్యక్తి. మొదట రమణీబాయిని అపార్థం చేసుకుని చివరన అసలు విషయం తెలుసుకుని బాధపడ్డాడు. ప్రజలు, భూషణం రమణీబాయిని క్షమించమని ప్రాధేయపడ్డారు. అప్పుడు రమణీబాయి ఎంతో ఉదాత్తంగా వారిని క్షమించింది. అక్షరజ్ఞానం లేకున్నా చివరగా జిల్లా కలెక్టర్‌తో తమ జాతివారి సమస్యలను చెప్పి, వ్యవసాయ భూమి పట్టాలు ఇప్పించుకున్నది. తాను ఎల్లప్పుడు తండా ప్రజల క్షేమం కోసం తన జీవితాన్ని ధారపోసిన ధీరవనిత రమణీబాయి.

**పల్లీబుట్ట :** ఈ కథలో ప్రధాన పాత్రలు - (1) సక్కుబాయి, ఫూల్‌సింగ్ భార్యాభర్తలు (2) రైల్వే టి.సి. (3) రైలులోని ప్యాసింజర్లు. సక్కుబాయిది నిరుపేద కుటుంబం. రెక్కాడితేకాని డొక్కాడని పరిస్థితి. ప్రతిరోజు ఉదయం ఐదు గంటలకు వేయించిన పల్లీలు, ఉడకబెట్టిన పల్లీలు ఒక బుట్టలో వేసుకొని మహబూబాబాద్ నుండి సికింద్రాబాద్ వరకు మూడు బుట్టల పల్లీలు అమ్ముకుని, వచ్చిన డబ్బులతో పిల్లల్ని

చదివించుకుంటూ జీవనం సాగిస్తున్న ఒక బంజారా యువతి కథ ఇది. భర్త ఫూల్‌సింగ్ ప్రతిరోజు భార్యను రైల్వేస్టేషన్‌కు పంపించి, తాను కూలి నాలి చేసుకునేవాడు. మళ్ళీ సాయంత్రం భార్య సక్కుబాయి కొరకు రైల్వేస్టేషన్‌కు వచ్చి ఇంటికి తీసుకుపోయేవాడు. ఇది ప్రతిరోజు జరిగే కార్యక్రమం.

టికెట్ లేకుండా ముందు డబ్బా నుండి చివరి డబ్బావరకు 'పల్లీలు.. పల్లీలు... ఉడకబెట్టినవి, ఏంచినవి' అంటూ అమ్ముకుని జీవించే సక్కుబాయిని ఏ టి.సి. కూడా వారిని ఏమీ అనేవారు కాదు. కానీ ఒకరోజు కొత్తగా వచ్చిన టి.సి మాత్రం ట్రైన్‌లో వ్యాపారం చేసుకోవడానికి లైసెన్స్ ఉందా? అని ప్రశ్నించాడు. అతడిని తప్పించుకోవడానికి సక్కు పెద్ద సాహసమే చేయవలసివచ్చింది. రైలు ప్రయాణంలో ప్యాసింజర్లు కాలక్షేపం కోసం పల్లీలను కొనుక్కునేవారు. ప్రయాణికుల్లో కొందరు ఒకేలాగా ఉండరు. కొందరు పోకిరీలు, దొంగలు కూడా ఉంటారు. కొంతమంది విద్యార్థులు సక్కుబాయి దగ్గరున్న డబ్బుకు ఆశపడి ఆమె నిద్రించిన సమయంలో పల్లీలు అమ్మగా వచ్చిన డబ్బుల్ని కాజేసారు. అటు టి.సి. పెట్టిన రకరకాల ఇబ్బందులకు సికింద్రాబాద్‌లోనే టి.సి.కి కనపడకుండా దిగి బయటికి వచ్చేసింది. మహబూబాబాద్‌కు వెళ్ళే రైలు తప్పడంతో బస్సుకు బయలుదేరింది. అటు డబ్బులు, ఇటు పల్లీబుట్టలు మాయమవ్వడంతో దిగులుగా ఇంటికి వెళ్ళింది సక్కుబాయి. భార్యను చూసి ఆశ్చర్యపోయాడు ఫూల్‌సింగ్. జరిగిన కథను తెలుసుకుని బాధపడ్డాడు. పేదరికంతో రైలులో పల్లీలు అమ్ముకుంటూ కుటుంబాన్ని నడుపుతున్న సక్కుకు ఒక్కసారి 'ఖాళీ పల్లీల బుట్టలు జీవితాన్ని ఎక్కిరిస్తున్నట్ట నిపిస్తుంది' అనే వాక్యంతో కథ ముగుస్తుంది. నిజంగా పేదవారి జీవితాలు దుర్భరంగా ఉంటాయి. రచయిత్రి రైలు ప్రయాణంలో చూసిన పల్లీలు అమ్మే ఒక బంజారా స్త్రీ జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. సమాజంలో అడుగడుగున మోసపోయిన బంజారా స్త్రీ జీవితాన్ని ఆవిష్కరించారు ఆచార్య డి.సూర్యాధనంజయ్‌గారు.

**(2) సంస్కృతి-సంప్రదాయం-ఆచారాలు**

గిరిజనులైన బంజారాలకు ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయం, ఆచారాలుంటాయి. వారి పుట్టుక నుండి మరణం వరకు ప్రత్యేకమైన ఆచారాలు, సంప్రదాయాలు కలవు. వారి సంస్కృతిలో భాగమైన రకరకాల సంఘటనలను కథా వస్తువుగా తీసుకొని రచయిత్రి 'ఘోళి' అనే కథా సంపుటిలో కొన్ని కథలను రాయడం జరిగింది. అవి - (1) అంబాలి (2) ధర్మిబాయి దొకాన్ (3) పారుబాయి (4) యాడికో ఉత్తరం. ఈ నాలుగు కథల్లో రచయిత్రి బంజారాల జీవిత విశేషాలను సభ్య సమాజానికి తెలియజేసారు.

**అంబాలి :** ఈ కథలో ప్రధాన పాత్రలు - (1) అంబాలి, బాలు నాయక్ (2) సేవ్యా-భూరి అంబాలీ తల్లిదండ్రులు (3) గోపాల్ నాయక్, అతని భార్య మారోణీబాయి; కొడుకులు బాలు, దస్రూ (4) రాంలాల్, చంపాలాల్ తండా నాయకులు (5) అరుణబాయి అధ్యాపకురాలు.

సేవ్యాభూరికి లేకలేక కలిగిన సంతానం అంబాలి. అంబాలి తల్లిదండ్రులు చాలా పేదవారు. కాయకష్టం చేసుకుంటూ దొర దగ్గర జీతానికి పనికి సేవ్యా, భూమి కూలి నాలి చేసుకుంటూ జీవిస్తున్నారు. అంబాలిని గోపాల్ నాయక్ పెద్దకొడుకు బాలుకిచ్చి బంజారా సాంప్రదాయం ప్రకారం పెళ్లి చేసారు. చాలా సంవత్సరాలకు అంబాలికి పిల్లలు కాలేదు. దానితో అత్త మారోణీబాయి తన కొడుకు బాలుకు మరో పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నది. అంబాలి యౌవనంలో ఉండగానే భర్త బాలు ప్రమాదవశాత్తు చనిపోయాడు. ఆమె చిన్న వయసులోనే భర్త చనిపోతే బంజారాల ఆచారం ప్రకారం భర్త తమ్ముడు దస్రూతో పెళ్లి చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. కాని అంబాలి ఆ పెళ్లిని వ్యతిరేకించింది. కులపెద్దలు, తండాలోని ఆడవాళ్లు అందరూ అంబాలిని ఒత్తిడి చేసారు. ఎప్పటి నుండో మన సంస్కృతిలో ఈ ఆచాఆరం ఉన్నది. మరిది చిన్నవాడైనా, పెద్దవాడైనా సరే ఈ సంప్రదాయాన్ని నీవు గౌరవించాలని ఒత్తిడి చేస్తారు. బలవంతంగా పెళ్లి చేయాలని ప్రయత్నిస్తారు. ఆ సమయంలో బంజారాల్లో బాగా చదువుకుని, హైదరాబాదులో అధ్యాపకురాలిగా ఉద్యోగం చేస్తున్న అరుణబాయికి తమ తండా ఆచారం తెలిసి భల్లు నాయక్ తండాకు వచ్చి ఆ పెళ్లిని ఆపుతుంది. ప్రతి సమాజంలో రకరకాల ఆచారాలుంటాయి. కాలం మారింది. పూర్వ పద్ధతి కాకుండా ఆధునికంగా ఆలోచించాలని తండా పెద్దలకు చెప్పింది. మరిదిని పెళ్లి చేసుకోవడమనేది మంచిది కాదు అని వాదిస్తుంది. మనమందరం అంబాలి వ్యక్తిత్వాన్ని గౌరవించాలంటుంది. ప్రపంచం అభివృద్ధిచెందుతున్న క్రమంలో మనం కూడా మన ఆచారాలను, సంప్రదాయాలను మార్చుకోవాలని సూచన చేస్తుంది. నాగరికంగా ప్రపంచం అభివృద్ధిచెందుతుంటే ఇంకా మనం అనాగరికంగా

ఆలోచిస్తున్నామని తీవ్రంగా హెచ్చరిస్తుంది. తమ తండా పూర్వులు కొన్ని ఆచారాలను మార్చుకోవాలని చెప్పి అంబాలిని పట్టణానికి తీసుకొచ్చింది. భర్త చనిపోతే వెంటనే ఆ స్త్రీకి మరిదితో పెళ్లి చేసి ఆ కుటుంబంలోనే ఉండిపోయే సంప్రదాయానికి స్వస్తి పలికించింది అరుణబాయి. చదువుకున్న స్త్రీలు బంజారా సమాజంలో అటువంటి ఆచారానికి ఇష్టపడరనే విషయాన్ని రచయిత్రి అరుణ పాత్ర ద్వారా నిరూపించింది.

**ధర్మిబాయి దోకాన్ :** ఈ కథలో ప్రధాన పాత్రలు – (1) ధర్మిబాయి (2) గోపాల్ నాయక్, అతని భార్య సరోజ (3) భరత్ – గోపాల్ సరోజల ముద్దుల కొడుకు (4) కావ్య బ్రాహ్మణ అమ్మాయి, భరత్ భార్య (5) కావ్య తల్లిదండ్రులు (6) రాంరెడ్డి దొర (7) రమణారావు వ్యాపారి.

ఉద్యోగరీత్యా తండాల నుండి కొంతమంది పట్నాలలో నివసించేవారి గురించి రచయిత్రి చక్కగా వివరించారు. ఈ కథలో ప్రధానంగా బంజారాల వివాహ పద్ధతులు, సంస్కృతి, సంప్రదాయాలు, వస్త్రాలు, ఆభరణాలు, ఆచార పద్ధతుల గురించి ఆచార్య డి.సూర్యాధనంజయ్ గారు చక్కగా వివరించారు. ఈ తరం బంజారాలు తమ పూర్వ సంప్రదాయ పద్ధతిలో కాకుండా హిందూ సంప్రదాయం ప్రకారం వివాహాలు చేసుకుంటున్నారు. అయితే తమ పూర్వ ఆచారం ప్రకారమే వివాహం జరగాలనే గోపాల్, సరోజల ప్రోద్బలంతో బంజారా సంప్రదాయం ప్రకారం పట్నం వదిలి తమ తండాలోనే భరత్, కావ్యల వివాహం జరుగుతుంది.

బంజారా యువకుడైన భరత్ తాము నివసిస్తున్న హైదరాబాద్ పట్నంలోని ఒక బ్రాహ్మణ యువతి అయిన కావ్యను ప్రేమిస్తాడు. వారి ప్రేమ సఫలం కావడానికి భరత్ తల్లి సరోజ పెట్టిన రెండు షరతులతో పెళ్లి జరగడం ఈ కథలో ప్రత్యేకత. ఆ రెండు షరతులు ఏమిటంటే – ఒకటి పెళ్లి బంజారా సంస్కృతి, వారి వస్త్రధారణలో జరగాలి. రెండు వారి పెళ్లి తమ మూలమైన తండాలోనే జరగాలి. ఈ రెండు నియమాల ప్రకారం పెళ్లి జరగాలనే తలంపుతో రచయిత్రి బంజారాల పూర్వచరిత్ర, వారి వలసల క్రమం, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, సాంస్కృతిక విషయాలు, బంజారాల వస్త్రవిశేషాలు, అలంకరణలు, వస్తుసామగ్రి, ఆభరణ విశేషాలు, వాటిని ధరించే పద్ధతులు, వాటిని తయారుచేసే విధానాల గురించి రచయిత్రి వివరంగా ఈ కథలో వివరించారు. బంజారా డ్రస్సుల్లో ఉన్నవారిని చూసిన కొందరు పిల్లలు భయపడతారనే విషయాన్ని కూడా వివరించారు.

ఈ కథలో తమ సంప్రదాయ వస్త్ర వ్యాపారాన్ని పట్నంలో నిర్వహిస్తున్న ధర్మిబాయిని రమణారావు అనే బడా వ్యాపారి ఆమెను రోడ్డుపై పడేసి పట్నంలో కూడలి ప్రదేశంలో అడుక్కునే మాదిరిగా చేసాడు. అది గమనించిన భరత్ న్యాయస్థానంలో ఆమె తరపున కోర్టులో కేసు వేసి ఆమెను కాపాడిన వైనాన్ని చక్కగా వివరించారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలనే సందేశంతో ఈ కథ ముగుస్తుంది.

**యాడికో ఉత్తరం :** ఈ కథలోని ప్రధాన పాత్ర పుత్లీబాయి. రచయిత్రి తన పేరును మార్చుకుని పుత్లీబాయి అనే మారుపేరుతో ఈ కథను రాసారు. పుత్లీబాయి అధ్యాపకురాలు. తాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో అధ్యాపకురాలు. తన స్వీయ అనుభవాలను, తాను పడిన కష్టనష్టాలను, తాను చూసిన వివిధ రకాల సంఘటనలకు ఆవేదన చెంది రాసిన కథ ఇది. రచయిత్రి కేవలం బంజారా స్త్రీల గురించే కాకుండా యావత్ స్త్రీల గురించి కలత చెంది రాసిన కథ ఇది. సమాజంలో అడుగడుగున మహిళలపైన జరిగే అత్యాచారాల గురించి, స్వర్గంలో ఉన్న తన తల్లికి రాసుకున్న ఉత్తర సందేశమిది. తమ బంజారా సంస్కృతీ సంప్రదాయాలను, నమ్మకాలను గౌరవిస్తూనే కాలదోషం పట్టిన మూఢాచారాలను రచయిత్రి ధిక్కరిస్తుంది. సమకాలీన సమాజంలో బంజారా ప్రజలు, ప్రధానంగా యువతీయువకులు ఎటువైపు అడుగులు వేయాలో మార్గ నిర్దేశనం చేస్తుంది ఈ కథ.

**(3) పేదరికం / మూఢ నమ్మకాలు**

బంజారాలు అధిక సంతానం కలిగి ఉండడం, శ్రమకు తగిన ఫలితం లేకపోవడం, నిరక్షరాస్యత, అమాయకత్వం, మూఢనమ్మకాలు మొదలైనవన్నీ వారిని పేదరికంలో నెట్టివేస్తున్నాయి. పేదరికం కారణంగా బంజారా కుటుంబాలు పలురకాల సమస్యలతో సతమతమౌతున్నారు. వాటన్నింటిని దృష్టిలో పెట్టకుని ఆచార్య డి.సూర్యాధనంజయ్‌గారు 'ఝోళి' అనే గోర్ బంజారా సాకి అనే కథా సంపుటిలో కొన్ని కథలను రచించారు. అవి (1) ఝోళి (2) ఉత్తరమొచ్చింది (3) మస్తానన్న డబ్బా (4) కేసులా.

**ఝోళి :** ఈ కథలో ప్రధాన పాత్రలు – (1) చంద్రునాయక్ భార్య లక్ష్మీ (2) చంద్రు తల్లిదండ్రులు భీమా,

కోటిబాయి (3) హన్మానాయక్ – తండా నాయకుడు (4) చంద్రు, లక్ష్మీలకు ముగ్గురు ఆడపిల్లలు.

ఈ సంఘటన దేవరకొండ ప్రాంతంలో ఉన్న సీత్లా తండాకు సంబంధించినది. ఈ భూమి మీద కన్నబిడ్డల్ని అమ్ముకునే పరిస్థితి నిరుపేదలైన బంజారా సమాజంలో జరిగింది.

బంజారా ప్రజలు నిరక్షరాస్యత, పేదరికం, అమాయకత్వం, మూఢ నమ్మకాలతో రకరకాలుగా సతమతమౌతుంటారు. చిన్నతనంలోనే పిల్లలకు వివాహాలు చేస్తారు. బాల్యవివాహాలు వారి జీవితాలను చాలా చిందరవందర చేస్తాయి. చిన్నప్పుడే అధిక సంతానం కలగడం, అందులో మగబిడ్డ పుట్టేంతవరకు ఆడపిల్లలను కంటూ ఉంటారు. ఆడపిల్లలు పుడితే పురిట్లోనే చంపుకోవడం, సంతలో వస్తువులుగా, పశువుల్లాగా అమ్ముకోవడమనే దారుణ పరిస్థితి బంజారుల జీవితాల్లో నెలకొన్నది. అలాంటి దుర్భరస్థితిని రూపుమాపడం కొరకు ప్రభుత్వం వారు 'సమగ్ర శిశు అభివృద్ధి పథకాన్ని' ప్రవేశపెట్టడం జరిగింది. ఈ నేపథ్యంతో ఆచార్య సూర్యాధనంజయ్ గారు 'ఝోళి' (ఊయల) అనే కథను రచించారు.

చంద్రూ, లక్ష్మీలకు ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. వారిలో చివరి అమ్మాయి ముక్కుపచ్చలారని చిట్టితల్లి కనిపించకుండా పోయిన సంగతి వార్తా పత్రికల్లోను, టి.వీ.లలో మారుమోగిపోయింది. ఇది దేవరకొండ ప్రాంతంలో జరగడం విషాదకరమైన సంఘటనను దృష్టిలో పెట్టుకొని రచయిత్రి ఈ కథను రాసారు. ఆడపిల్లల క్రయ విక్రయాల దందా గురించి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. అధిక సంతానం, పేదరికంతో అల్లాడుతున్న బంజారాలు తమ ఆర్థిక పరిస్థితుల మూలంగా ఇటువంటి సంఘటనలు అక్కడక్కడ జరుగుతున్నాయి. ఇట్లా ఆడపిల్లల్ని అంగడి సరుకుల్లాగా అమ్ముకోవడం అత్యంత విషాదకరమైన విషయం. ఆడపిల్లలను దొంగచాటుగా అమ్ముకోవడం చాలా విచారించదగ్గ విషయం. అందుకే ప్రభుత్వం వారు ఆడపిల్లలను పెంచలేనివారు, వద్దనుకునేవారి కోసం 'ఝోళి'(ఊయల)ను ఏర్పాటు చేసారు. అక్కడే ఈ శిశువును వదిలిపెడితే ప్రభుత్వమే వారి బాగోగులు చూసుకుంటుంది.

ఈ 'ఝోళి' కథలో చంద్రూ తల్లి అయిన కోటిబాయి తన మనవరాలిని అమ్మడానికి సంతకు తీసుకెళ్లి మనసొప్పక 'ఊయల'లో వదిలిపెడుతుంది. ఆ పసిపాప కోసం చంద్రూ, లక్ష్మీల ఆవేదన మనసును రంపం పెట్టి కోసినట్లుంటుంది. బంజారా సమాజంలో పుట్టిన ఆడపిల్లల్ని వదిలివేయడం, అమ్ముకోవడం జరుగుతున్నది. ఈ వార్త ప్రపంచమంతా తెలిసిపోయింది. మిగిలిన సమాజానికి అది వార్త కావచ్చు. కాని దాని వెనక బంజారాల్లో ఉన్న ఆర్థిక సమస్య, నిరుద్యోగం, నిరక్షరాస్యత, తాగుడు, పేదరికం వంటి అనేక కారణాలున్నాయి. గాఢమైన ఆలోచనలు, చింతనలు మన చుట్టు నిత్యం జరుగుతూనే ఉంటాయి. చివరగా ఆ తండా నాయకుడైన హన్మా నాయక్ కోటిబాయిని గట్టిగా మందలించి నిలదీస్తాడు. చివరగా ఆ శిశువు జాడ తెలియడంతో కథ సుఖాంతమైనది. కాని వాస్తవానికి ఆచూకి తెలియని శిశువుల రోదనలతోపాటు ఆయా తల్లిదండ్రుల కడుపుకోత మనల్ని కంటతడి పెట్టిస్తుంది. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను దిక్కు లేకుండా చేయడం, వదిలించుకోవడం, అమ్ముకోకుండా తమకు అప్పగించవచ్చని 'ఊయల'(ఝోళి) పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా రక్షింపబడిన ఒక ఆడపిల్ల కథ ఇది. తల్లిదండ్రుల మనోవ్యథే ఈ ఝోళి కథ.

**ఉత్తరమొచ్చింది :** ఈ కథలో ప్రధాన పాత్రలు – (1) నారయ్య అనే పోస్టుమెన్ (2) బాజుబాయి, మంత్రియా నాయక్ భార్యాభర్తలు (3) బాజు, మంత్రియ పెద్దకొడుకు ధంజీనాయక్, చిన్నోడు పార్థు.

ఈ కథ కుటుంబ సంబంధాల గురించి తెలుపుతుంది. తెలిసి, తెలియక గాలిలో ఊహల మేడలు కట్టుకుంటూ ఏదో అయిపోతాననే భ్రమలో పగటికలలతో ఇంటి నుండి వెళ్లిపోయిన ఒక అమాయకుని కథ ఇది. పార్థు అత్యాశకు లాలూచిపడి ఇంటి నుండి వెళ్లిపోయాడు. తల్లీ, తండ్రీ నానారకాలుగా మనోవేదనకు గురి అయినారు. ఎప్పటికైనా తమ కొడుకు తిరిగివస్తాడనే గంపెడు ఆశతో ఎదురు చూస్తున్న వారికి పద్దెనిమిది సంవత్సరాల తర్వాత చెన్నై నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరాన్ని పోస్టుమెన్ నారయ్య మంత్రియా, బాజులకు అందించాడు. ఆ ఉత్తరంలో ఏముందోనని హైదరాబాదులో ఉన్న మంత్రియా పెద్దకొడుకు ధంజీ దగ్గరికి వెళ్లాడు. ధంజీ ఉద్యోగరీత్యా పట్నంలో ఉంటున్నాడు. వారిద్దరు కలిసి మద్రాసుకు బయలుదేరారు. కాని ఆ తండ్రి మనసు రైలు ప్రయాణంలో రకరకాలుగా ఆలోచించింది. ఎప్పుడెప్పుడు

అంటూ తన చిన్నకొడుకు గురించి పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నాడు. రైలు పట్టాపైన ఎంత వేగంగా పరిగెడుతుందో దానికంటే రెట్టింపుగా తన మనసు, ఆలోచనలు పార్థు గురించి ఆలోచిస్తున్నది. చివరగా చెన్నైలో ఒక హొటల్‌లో తన కొడుకు పార్థు కనబడగానే పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది. ఆ కుటుంబానికి ఉత్తరం ఆధారంగా తండ్రీకొడుకులు కలిసిన కథే ఈ ఉత్తరమొచ్చింది. పేదరికం, అమాయకత్వం, నిరుద్యోగ సమస్యలు ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు.

**మస్తానన్న డబ్బా :** ఈ కథలోని పాత్రలు – (1) భద్రునాయక్, భార్య ధ్వాళీబాయి (2) భద్రు, ధ్వాళీ కూతురు సుజాత (3) మస్తాన్, అతని భార్య రజీత టైలర్ (4) హేమ్లానాయక్, తండావాసులైన కాళ్యా, సక్కు, సైదాలు.

ఈ కథ ప్రధానంగా బంజారాలు బయటివారిని అంత తొందరగా నమ్మరనే విషయం తెలియజేస్తుంది. బయటివారు వీరిని మోసగిస్తారనే అభిప్రాయంతో కథ ప్రారంభమౌతుంది. ఈ కథలో తన చిన్ననాటి స్కూల్‌డ్రస్సులు కుట్టించిన టైలర్ అయిన మస్తానన్నను మరువలేదు రచయిత్రి ఈ కథలో. రచయిత్రి తన జ్ఞాపకాలన్నింటిని కలిపి ఈ కథా సంపుటిని తీసుకొచ్చారు. ఒక పట్టణవాసి, ఒక తండా బాలికల మధ్య నెలకొన్న అన్నాచెల్లెల బంధం ఆదర్శంగా, ఆత్మీయంగా నడుస్తుంది. తండాకు చెందిన సుజాత, బయటివాడైన మస్తాన్‌ల మధ్య అన్నాచెల్లెళ్ళ బంధాన్ని చక్కగా చిత్రీకరించారు రచయిత్రి. కాలానుగుణంగా వారి తండా జనాల్లో వారిపై అనుమానం కలుగుతుంది. తండావాసులైన కాళ్యా, సక్కు, సైదాలు మస్తానన్నతో సుజాత చనువుగా ఉండడం వారికి నచ్చలేదు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఎలాగైనా ఈ మస్తాన్‌ను తండాకు రాకుండా కట్టడి చేయాలనుకున్నారు. తండా జనం, మైదానవాసులపై ఏర్పరచుకున్న అనుమానాలు, అపోహలు ఈ కథలో తేటతెల్లం అవుతాయి. కలుషితమైన నీరు త్రాగడం వల్ల వచ్చే విషజ్వరాలకు, అనారోగ్యాలకు మస్తానన్నే మంత్రాలు చేసాడనే అనుమానం కలిగింది తండా జనానికి.

ఒకరోజు మస్తానన్న జెండా వందనానికి తన ఊర్లో ఇచ్చిన పిప్పర్‌మెంట్ బిల్లలను తండాకు వచ్చి పిల్లలకు పంచాడు. మరునాటి నుండి తండా పిల్లలకు విషజ్వరాలు రావడంతో ఇదంతా మస్తానన్న పనేనని అతనిని పట్టుకుని చెట్టుకు కట్టేసి కొడతారు. సుజాత, ఆమె తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినిపించుకోకుండా మంత్రాల నెపంతో చితకబాదుతారు. తండాకు రాకుండా చేస్తారు. చివరగా తండా వాసులు తాగే నీటి కలుషితం ద్వారా విషజ్వరాలు వచ్చాయనే వాస్తవాన్ని గ్రహించి బాధపడ్డారు. తండా ప్రజలు ఎంత అమాయకులు, నిర్మలమైనవారో అంత కఠినంగా ఉంటారనే విషయం ఈ కథ ద్వారా తెలుస్తుంది. "అడవి బిడ్డలు కొత్తవారు వస్తే త్వరగా నమ్మలేరు. నమ్మితే ప్రేమిస్తే కడుపులో పెట్టుకుని చూసుకుంటారు. లేకుంటే నమ్మరనే" విషయం తెలుస్తుంది. ఈ కథలో మూఢనమ్మకమే కనబడుతుంది.

**కేసులా :** ఈ కథలోని పాత్రలు – (1) సోని, హరిసింగ్ భార్యాభర్తలు (2) లల్లి, బుజ్జీ, సోనీ, హరిసింగ్ పిల్లలు (3) రాంసింగ్, హరిసింగ్ తమ్ముడు.

'కేసులా' అంటే మోదుగుపూలు. ఈ కథలో హరిసింగ్, సోని భార్యాభర్తలు. హరిసింగ్ బి.ఏ. వరకు చదువుకున్నాడు. వివాహం అయినది. వారికి లల్లీ, బుజ్జీ ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. హరిసింగ్ నాటుసారా తాగుడుకు బానిస కావడంచేత తరచు భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. బంజారా సమాజంలో నాటుసారా కాయడం, తాగడం, బెల్లం, ఇప్పపూల బట్టీలు పెట్టి చిన్నా చితక చిరు వ్యాపారాలు చేస్తుంటారు. వారికి సారా బట్టీలే జీవనాధారం. అదే సారా సోనీ జీవితాన్ని అల్లకల్లోలం చేసింది.

హరిసింగ్ సారా తాగి భార్య సోనీని కొట్టడంతో ఆమె జీవితంపై విసుగు చెంది తన ఇద్దరు చంటిపిల్లల్ని వదిలేసి తల్లిగారింటి బాట బట్టింది. పెద్దలు సర్ది చెప్పి మళ్లీ హరిసింగ్ దగ్గరకు పంపిద్దామనుకుంటుండగానే హరిసింగ్ తమ్ముడు తన వదిన కొరకు తోలుకుపోదామని వచ్చాడు. ఈలోపు హరిసింగ్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ చేదు నిజాన్ని జీర్ణించుకోలేక సోని లోలోపల బాధపడింది. ఆమె జీవితానికి మోదుగుపూలు కనబడ్డాయి. మోదుగు చెట్టు మన జీవనానికి ప్రతీక. వేసవికాలంలో ఎర్రని ఎండకు మోదుగుపూలు కాంతివంతంగా ప్రకాశిస్తాయి అనే విషయాన్ని రచయిత్రి 'కేసులా' అనే కథను ప్రతీకగా తీసుకుని రచించారు.

**4) కరోనా కథ :** యావత్తు ప్రపంచాన్ని కంటికి కనబడని కరోనా పురుగు గడగడలాడించింది. ఆ సమయంలో భూగోళంపై మానవ జీవితం అల్లకల్లోలమైనది. ప్రజల జీవితం మసకబారినది. ఇంటి నుండి బయటికి రాని పరిస్థితి

ప్రపంచమంతా వ్యాపించింది. ఇలాంటి భయంకరమైన పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రచయితలు తమ తమ కలాలకు, గళాలకు పని చెప్పారు. ఆ క్రమంలో రచయిత్రి 'క్యాంపస్' అనే కథను రచించారు.

ఈ కథలోని పాత్రలు (1) కమ్లీబాయి (2) అనిత మేడం (3) ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్. క్యాంపస్‌లోకి కొత్తగా పల్లె నుండి పట్నానికి వచ్చిన కమ్లీబాయి కథ ఇది. కరోనా కష్టకాలంలో ప్రజలు, విద్యార్థులు, గుడులు, బడులు, రవాణా ఏ రకంగా బందు అయిందో మానవుల మనోవేదనలను దృష్టిలో పెట్టుకుని రాసిన కథ ఇది.

**పారుబాయి :** ఈ కథలో ప్రధాన పాత్రలు – (1) పార్వతీబాయి (పారుబాయి) (2) పారుబాయి తల్లి తారాబాయి, తండ్రి పాండు (3) దాది, ఆమె మనుమరాలు లల్లీ (4) తండా నాయకుడు మంత్రియా నాయక్, తండావాసులు. ఈ కథ మిర్యాల గూడెం పరిధిలో అడవి దేవులపల్లి దగ్గరున్న మంత్రియా నాయక్ తండాలో ఉన్న పారుబాయి గురించి రచయిత్రి చక్కగా వివరించారు. వాస్తవానికి కరోనా కష్టకాలంలో ప్రజలు పడిన నానా రకాల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాసిన కథ ఇది. ప్రపంచమంతా లాక్‌డౌన్ విధించడంతో మనిషికి మనిషి కలుసుకోలేని దుస్థితి వచ్చింది. ఆ నేపథ్యంలో ఆన్‌లైన్ పాఠాలు వినలేని నిరుపేదలైన బంజారా విద్యార్థిని లల్లీ కథ ఇది. సెల్‌ఫోన్‌లో పాఠాలు వినలేక, సెల్‌ఫోన్ లేక చివరగా ఆత్మహత్యకు తలపడిన ఒక నిరుపేద విద్యార్థిని కథ ఇది. ఈ కథలో స్త్రీలు కేంద్రీకృతంగా నడవడం చూస్తే రచయిత్రి వారికిస్తున్న ప్రాధాన్యత తెలుస్తుంది. పురుషాధిపత్యం, నియమాలు, సంస్కృతి సంప్రదాయాల పేరుతో వివక్షతకు గురవుతూ బాధపడుతున్న మహిళల గురించి ఈ తరానికి సాధికారిక జీవితాన్ని అందించాలనే తపనతో రచయిత్రి ఈ కథను రచించారు.

**(5) ఉద్యమం :** వ్యవస్థలో రకరకాల సంఘటనలు జరుగుతుంటాయి. రకరకాల వ్యత్యాసాలుంటాయి. అవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, న్యాయ, ప్రాంతీయ, కుల, వర్గ, లింగ మొదలైన భేదాలుంటాయి. ఇక్కడ ఏ రంగానికి లేదా వర్గానికి అన్యాయం జరిగినా నివురు కప్పిన నిప్పులాగా ఉద్యమం లెగుస్తుంది. ఆ పరంపరలో ఈ భూమి మీద అనేక ఉద్యమాలు జరిగాయి. ప్రధానంగా తెలంగాణోద్యమం చాలా కీలకమైనది. ఇది కేవలం ప్రాంతీయ ఉద్యమం. తెలంగాణా రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పడాలనే ఉద్దేశంతో తొలి, మలి దశ ఉద్యమాలు జరిగాయి. ఎందరో మహానుభావులు తమ ప్రాణత్యాగాలు చేసారు. వాటన్నింటిని దృష్టిలో పెట్టుకుని రచయిత్రి 'మనాది' అనే కథను రచించారు.

ఈ కథలోని పాత్రలు – (1) ప్రవీణ్ నాయక్ (2) మంగీలాల్ ప్రవీణ్ తండ్రి (3) రాజు – ప్రవీణ్‌నాయక్ కొడుకు, మంగీలాల్ మనుమడు (4) తండావాసి మారోణీబాయి.

ఇది తెలంగాణ మలిదశ ఉద్యమంలో జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని రాయడం జరిగింది. ఈ ఉద్యమంలో ఎంతోమంది తమ ప్రాణాలను బలి ఇచ్చారు. ఆ క్రమంలో ఒక బంజారా యువకుడైన ప్రవీణ్‌నాయక్ ఆత్మబలి దానానికి సంబంధించినది. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల పాత్ర, అందులో బంజారా యువకుడైన ప్రవీణ్ నాయక్ అమరుడైన విధానం మర్చిపోలేనిది. ప్రవీణ్‌నాయక్ కొడుకు రాజు తాత అయిన మంగీలాల్‌కు వేసిన ప్రశ్నలు మనస్సును తోడేస్తాయి. తెలంగాణా రాష్ట్ర సాధనలో బంజారాలు చేసిన త్యాగాలు, పోరాటాలు చాలా ఉన్నాయి. రచయిత్రి తన కథలో ఒక యువకుని ఆత్మతాగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ ఇది.

**ముగింపు**

ఈ కథా సంపుటిలో మొత్తం 12 కథలున్నాయి. వీటిలో వేటికవి ప్రత్యేకంగా నిలిచాయి. ఇవి ప్రధానంగా బంజారా సమాజంలో జరిగిన వివిధ రకాల సంఘటనలను దృష్టిలో పెట్టుకొని రచయిత్రి ఆచార్య సూర్యాధనంజయ్ గారు రచించారు. ఇందులో ప్రధానంగా ఆర్థిక అసమానతలు, పేదరికం, అమాయకత్వం, మూఢనమ్మకాలు, ఉద్యమం, సంస్కృతి, సంప్రదాయాలు మొదలైన విషయాలన్నింటిని సభ్యసమాజానికి తెలిపే ప్రయత్నంలో భాగంగా ఈ కథా సంపుటి రూపొందింది.

**ఆధార గ్రంథం**

ఝోళి (గోర్‌బంజారా సాకి), ఆచార్య సూర్యాధనంజయ్, శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2022.

★ రచయిత: ప్రధానాచార్యులు
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, హైదరాబాద్.

# మల్లేషం పెండ్లిసూపులు

రవి కుర్మకోరి

మల్లేషం! ఓయ్... మల్లేషం! మంచిగున్నరవోయ్...?
మంచిగున్నం మామా! మీరందరూ మంచిగుండ్రాయే...?
ఏం! మంచిగుండుడో...? ఏం పాడయిందో అల్లుడూ...
పాణాలకు రికంలేని పాడుమల్లె బతుకయ్యింది.
గడియ పురుసత్ లేదు, గవ్వంత అమ్దానం లేదు.
పోశమ్మకు పొతంజేస్తే, మైసమ్మ మాయం జేసిందన్నట్టు
అచ్చిన పైస అస్తనే ఉంది. పొయ్యే పైస పోతనే ఉంది.
కుడి సేతుతోనిచ్చి, ఎడమ సేతుతోని తీసుకున్నట్లైతుంది.
పేదోడి బతుకెపుడు అమాస సెంద్రుడే అల్లుడూ...!
రెక్క, బొక్కలను నమ్మి బతికెటోనికి అమాసైతేంది,
పిక్కల్ల సత్తువలేనోనికి పున్నమైతేంది మామా...!
మనిసి పుట్టుకనే గట్టుకుపుట్టే నీటి సెలిమెలాంటిది
పాత నీరు పోతనే...! కొత్త నీరు అస్తది మామా!
పాతనీరు పోవుడేందోగానీ... ఈడ పానాలేవోతున్నై.
బలిసినోడి బంగులలేమో మొగులుకు అంటవోతున్నై
బక్కోడి గుడిసె కాయిదాలు బ్యాంకుల్ల నీల్గుతున్నై
పెంట మీద పెంటవడ్డట్టు పెద్దోడి ధనం పెరిగితే,
తలె, ముంతల తాకట్టులో పేదోడు కరుగుతుండు.
ఇంతదానికి, అంతదానికి ఇండ్లల్లా కయ్యాలై
ఇళ్లు ఇజారం పొయి బుజారం అవుతున్నై సంసారాలు.
మామా! కాలంతో కాలు కదిపితే కండ్లు తెరిసి ఉన్నట్టు...
మ్యాలంతో మాట కలిపితే నోరు తెరిసి ఉన్నట్టు మామా!
అవ్‌గనీ... ఏమో నీ పెండ్లి సూపులని ఎర్కయింది.
నా సెవులల్లవడ్డ ముచ్చట సై మాటనే అంటవా పిలగా...!
మంగళారం అయినయ్ మామా! మర్శిన్నే పిల్సుడు.
పీర్తిగల్ల అల్లుడివి నువు పిల్సింటే రాకపోతుంటినవోయ్!
నిన్నేగాదు మామా అత్తన్గూడ పిల్సుకపోయేదుండే
అత్తదేందోయ్ నువు పిల్సింటే అందరమస్తుంటిమి.
ఏ అదరా బదరా పదరా మొగుడా అన్నట్లైనయ్ మామా
అవ్‌గని దూరం సుట్టాలా...? దగ్గరి సుట్టరికమా...?
అవ్వ తోడవుట్టిన ఐదో తమ్ముని ఆఖరు కూతురు.
అయినోళ్ల ఇంటికి అల్లుడవ్వాలంటే అదృష్టంగావాలె!
అంతా అయినోళ్లే కానీ మంచినీళ్లు పుట్టవన్నట్టు
అందరూ మనోళ్లే కానీ, అన్నానికి పిల్సెటోల్లుండరు మామా!
కుద్దు మ్యాన మామ కూతురనేనా కుషీగున్నవ్!
అడుక్కు తినేటోల్ల ఇంట్లకు అల్లుడయ్యే కన్నా...
భాగ్యవంతునికి బానిసలాగా బతికింది మేలు మామా!
అగో...! అదేందోయ్! అందరికీ శకునం చెప్పే బల్లీ,
తాను వొయ్యి బర్రె కుడితిలవడి సచ్చిందన్నట్టు...
అన్ని జెప్పుకుంటనే! ఆ ఇంట్లకు అల్లునివెళ్తైతున్నవ్
అందానికి దాసిన నగలు ఆపదల ఆదుకున్నట్టు
చెయ్యి కిందున్నప్పుడు చెట్టోలే ఆసర నిలవడ్డడట
మామకిచ్చిన మాటకొరకు మనువు జేసుకుంటున్న.
అవ్వ కండ్లల్ల నవ్వుకోసం తలంబ్రాలేసుకుంటున్న.
మాట కొరకో, మూట కొరకో మనువంటే ఎట్లనోయ్...?
ఈడు, జోడు బాగుంటెనే గదా ఇంత ఇజ్జతుంటది.
మిర్గంనాడు కనిపిచ్చే ఆరుద్ర పురుగోలుంటది మామా...!
బుద్దవర్క షాపోలో దొర్కనంత ఉశారుగుంటది.
నావోళ్లనుకుందంటే జెనిగిలెక్క నలెగొట్నా ఇడువదు.
కడవలున్న బువ్వతో కడుపు నిండినా, నిండకున్నా
కండ్లల్లున్న నవ్వుతో కడుపు నిండుతది మామా!
అత్తా మామల గుణందెలిసి ఆకిట్లగూడా అడుగువెట్టద్దు.
పిల్ల ఇగురం జూసి పిలవకున్న ఇంట్ల సొర్రాలే మామా!
మ్యాన పిల్లను లగ్గం జేసుకుంటున్నవ్ గనుకా...!
ఉండవాన్, గిండవాన్ మస్తుగనే ముట్ట జెప్తుండొచ్చు.
తాత ముత్తాతలాస్తి తరగనంతున్నోళ్లని దెల్సింది.
తాహతుకు దగ్గట్టుగనే తండ్లాడ్తమన్నరటగదా...!
ఇచ్చేవాన్ని జూస్తే చచ్చేవాడు లేసిండట ఎన్కటికి
అయినా! ఒగలు పెడితే నిండుతదా మామా...!
మన నశీబుల కలిగితే నిండుతది గానీ...
అదృష్టముంటే జారిపోయేది గూడా చేతికొస్తది మామా!


★ రచయిత: తెలుగు అధ్యాపకుడు డిగ్రీ & పి.జి. కళాశాల, కామారెడ్డి

# నల్లదీగ శ్రీనివాసాచార్యుల కట్టబ్రహ్మన చరిత్ర-కావ్యానుశీలన

డా. శోభన్‌బాబు

**పరిచయం:**

"నల్లదీగ శ్రీనివాసాచార్యుల కట్టబ్రహ్మన చరిత్ర-కావ్యానుశీలన" అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేశాను. దీన్ని ఆచార్య యస్. శరత్‌జ్యోత్స్నారాణి గారి పర్యవేక్షణలో తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 2019లో సమర్పించాను.



నల్లదీగ శ్రీనివాసాచార్యుల
కట్టబ్రహ్మన చరిత్ర – కావ్యానుశీలన
(పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన ప్రణాళిక)
Nalladīga Śrīnivāsācāryula
Kaṭṭabrahmana Caritra – Kāvyānuśīlana



పరిశోధన
శోభన్‌బాబు, బి
Regd. No.14HTPH10

పర్యవేక్షణ
ఆచార్య యస్. శరత్ జ్యోత్స్నారాణి

తెలుగు శాఖ
మానవీయ శాస్త్రాల విభాగం
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
గచ్చిబౌలి, హైదరాబాద్ – 500 046
తెలంగాణ
సెప్టెంబర్, 2019

**పరిశోధన లక్ష్యం:**

అవతార పురుషులకు, మహాత్ములకు, వీరాధివీరులకు, భారతావని పుట్టిల్లు. ఇటువంటి వారి చరిత్రను వర్ణిస్తూ ఎన్నో చారిత్రక కావ్యాలు వెలువడినాయి. వీటి మార్గంలోనే వెలువడింది నల్లదీగ శ్రీనివాసాచార్యుల 'అరిగజసింహ, వీరపాండ్య కట్టబ్రహ్మన చరిత్ర''. ఈ కావ్యంలోని విశేషాంశాలను తెలియచేయడమే ఈ పరిశోధన లక్ష్యం.

**పరిశోధన ఉద్దేశ్యం:**

నల్లదీగ శ్రీనివాసాచార్యులచే రచింపబడిన 'కట్టబ్రహ్మన చరిత్ర' పద్యకృతి 686 పుటలలో ఇంచుమించు నాలుగువేల గద్యపద్యాలలో ఆద్యంతమూ ఆసక్తిదాయకం. దేశభక్తి ప్రబోధాత్మకం. వీర రసప్రధానమైనది. భారతదేశ పురాగత వైభవం, ఆంధ్రప్రశస్తి, తెలుగు భాష మాధుర్యం, తెలుగువాడి ఔన్నత్యం, యోధాగ్రేసరుల పోరాట మహిమ మొదలైనవెన్నో ఈ కావ్యంలో దర్శనమిస్తాయి. ప్రాచీన లాక్షణికులు నిర్దేశించిన కావ్య లక్షణాలన్నీ దీనిలో ఉన్నాయి. అష్టాదశ వర్ణనలు, రసపోషణ మొదలైనవి ఔచిత్యవంతంగా నిర్వహింపబడినవి. వీటికి తోడు ఎన్నో సూక్తులు, సామెతలు, జాతీయాలు ఈ కావ్యానికి మరింత వన్నె తెచ్చాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ కావ్యంలో కవి ప్రతిభాపాండిత్యాలు పలువిధాలుగా దర్శనమిస్తాయి. వీటన్నింటిని పరిశీలించాలనే దృక్పథంతో నా పరిశోధనాంశంగా ఎంచుకున్నాను.

**పరిశోధన పరిధి:**

నల్లదీగ శ్రీనివాసాచార్యులు బహుగ్రంథకర్త. గోదా పారిజాత వైభవం, నందనందన మందార మాల, తాండవ మదనుడు, హయగ్రీవోపాఖ్యానము, సింగిపదాలు మొదలైనవెన్నో రచించారు. వీరి రచనలన్నింటిలోకి కట్టబ్రహ్మన చరిత్ర శిఖరప్రాయమని నా అభిప్రాయము. ఇది కవి కావ్యకళా సర్వస్వమనదగి ఉన్నది. అందుకే ఈ కావ్యాన్ని నా పరిశోధనా పరిధిగా నిర్ణయించుకున్నాను.

**పరిశోధన ఆవశ్యకత:**

నల్లదీగ శ్రీనివాసాచార్యులు బహుముఖ ప్రజ్ఞాశీలి. తన జీవితకాల పర్యంతమూ కళలకే అంకితమైన వ్యక్తి. చిత్రలేఖనంలోను, నాట్యశాస్త్రంలోను పరిణత ప్రజ్ఞ గలవారు. వీటికి తోడు తన రచనలతో తెలుగు భాషా సాహిత్యాలకు విశేష సేవలందించిన వారు. తెలుగు సాహిత్యంలో ఇప్పటివరకు వివిధ

కవులపై, వారి రచనలపై ఎన్నో పరిశోధనలు జరిగాయి. జరుగుతున్నాయి. కానీ ఎందుచేతనో పరిశోధకులెవరూ ఈ కవిపై దృష్టి సారించినట్లు కనిపించదు. ఆచార్యుల వారు, వారి రచనలు దివాకర్ల వేంకటావధాని, వానమామలై వరదాచార్యులు, ఉత్పల సత్యనారాయణాచార్య, జి.వి. సుబ్రహ్మణ్యం, సి.నా.రె., నటరాజ రామకృష్ణ వంటి ప్రముఖుల ప్రశంసల వరకే పరిమితమైనట్లు కనిపించును. బహుముఖ ప్రజ్ఞాశీలియైన ఈ కవిపై పరిశోధన చేయడం ఎంతైనా అవసరమనిపించింది. తత్ఫలితమే ఈ పరిశోధన. నా ఈ 'నల్లదీగ శ్రీనివాసాచార్యుల కట్టబ్రహ్మన చరిత్ర కావ్యానుశీలన' అనే పరిశోధన వల్ల ఆ దిశగా మరిన్ని పరిశోధనలు వచ్చే అవకాశం ఉంది. శ్రీనివాసాచార్యుల కృతులన్నింటిపైనా పరిశోధనలు వెలువడే అవకాశం గలదు.

**అధ్యాయ విభజన:**

1)కట్టబ్రహ్మన చరిత్ర – కవి జీవన రేఖలు 2)కట్టబ్రహ్మన – చారిత్రక నేపథ్యం 3)కట్టబ్రహ్మన ఇతివృత్త సంబంధిత రచనలు – విశ్లేషణ. 4)కట్టబ్రహ్మన చరిత్ర – వస్తు శిల్పము 5)కట్టబ్రహ్మన చరిత్ర – కావ్య కళావైభవం. 6)కట్టబ్రహ్మన చరిత్ర – దేశభక్తి చిత్రణ

మొదటి అధ్యాయంలో కవి జీవిత విశేషాలను, రచనలను, వ్యక్తిత్వాన్ని, 'కట్టబ్రహ్మన చరిత్ర' కావ్య నేపథ్యాన్ని, ప్రేరేపక పరిస్థితులను తెలియజేశాను. రెండవ అధ్యాయంలో కట్టబ్రహ్మన పూర్వీకులను గురించి, పాంచాల కురిచ్చి కోట నిర్మాణం గురించి తెలియచేశాను. మూడవ అధ్యాయంలో కట్టబ్రహ్మన ఇతివృత్తంతో వెలువడిన తమిళ రచనలను నామమాత్రంగా ప్రస్తావించి, తెలుగులో వెలువడిన రచనలను విశ్లేషించాను. రూపాబాయి మోతీలాల్ 'వీరపాండ్య కట్టబొమ్మనాయకుడు' (నవల), గిడుగు సీతాపతి 'కట్టబొమ్మ' (నాటకం), పులిచర్ల సుబ్బారావు 'జగవీరపాండ్య కట్టబ్రహ్మన' (నాటకం), గన్నిశెట్టి వెంకటేశ్వరరావు 'వీరపాండ్య కట్టబ్రహ్మన' (నాటిక) మొదలైన రచనలలోని ఇతివృత్తం తీరుతెన్నులలో పాటు 'వీరపాండ్య కట్టబ్రహ్మన' సినిమాలోని ఇతివృత్తాన్ని ఈ అధ్యాయంలో వివరించాను. నాలుగవ అధ్యాయంలో చరిత్రకు, కావ్యానికి గల భేద సాదృశ్యాలను తెలిపి, కట్టబ్రహ్మన చరిత్ర గ్రంథ నామౌచిత్యాన్ని తెలియచేశాను. 'కట్టబ్రహ్మన చరిత్ర' కావ్యరచనలో కవి చేసిన మార్పులు, చేర్పులను ఈ అధ్యాయంలో వివరించాను. ఐదవ అధ్యాయంలో పాత్ర చిత్రణ, రసపోషణ, వర్ణనలు, నాటకరీతులు, ఔచిత్యము, భాషా సంపద అనునవి చర్చింపబడిన అంశాలు.

ఆరవ అధ్యాయంలో మాతృదేశ సంకీర్తనం, క్షేత్ర ప్రశస్తి, నాయకస్తుతి, శత్రు దూషణ, దేశభక్తి ప్రబోధం, సర్వమత సమతా భావన, స్వపరిపాలన ప్రశస్తి, వర్తమాన దైన్యం, ఐకమత్య అవసరం, పన్ను నిరాకరణ, స్వాతంత్ర్యానురక్తి మొదలైన వాటిని చర్చించాను.

**పరిశోధనా ఫలితాలు:**

- నల్లదీగ శ్రీనివాసాచార్యుల 'కట్టబ్రహ్మన చరిత్ర' కావ్యానికి 'ధర్మకర్మనిష్ఠ' అనునది కథా సూత్రము.
- పాత్రచిత్రణలో, ఇతివృత్త నిర్వహణలో, వర్ణనలలో క్రమ వికాసముండుట ఈ కావ్యం ప్రత్యేకత.
- రూపాబాయి మోతీలాల్ నవల చారిత్రక దృక్పథంతో రాయబడింది. శ్రీనివాసాచార్యుల రచన కావ్య దృక్పథంతో మలచబడింది.
- వీర రసం అంగిరసంగా మిగిలిన కొన్ని రసములు అంగరసములుగా కనిపించును.
- ఈ కావ్యంలో నాటకీయ లక్షణాలు మెండుగా ఉన్నాయి.
- భావి కథార్థ సూచన ఈ కావ్య సహజ లక్షణం.
- తమిళంలోని యతి భేదాలలో ఒకటైన 'పొటిప్పు మోనై' పోకడలు ఈ కావ్యంలో కనిపించును.

**భావిపరిశోధకులకు సూచనలు :**

తెలుగులో కవులకు, కావ్యాలకు కొదవలేదు. ముఖ్యంగా ఆధునిక కావ్యాలను గూర్చి విస్తృతంగా పరిశోధన జరగవలసిన అవసరం ఎంతైనా వుంది. ఎంచుకున్న అంశానికి తగిన విషయ సేకరణ చాలా ముఖ్యం. ఆయా కావ్యాలను ఒకటికి పదిసార్లు చదివినపుడే అందులోని విశేషాంశాలు బోధపడతాయని నా అభిప్రాయం.

**పరిశోధకుని వివరాలు : డా. శోభన్‌బాబు.బి, పెద్దముప్పారం గ్రామం, దంతాలపల్లి మండలం, మహబూబాబాద్ జిల్లా, ఫోన్: 9701181271**, bsb271@gmail.com

★ **రచయిత: తెలుగు ఉపాధ్యాయుడు**


OSMANIA UNIVERSITY
NAAC A+
ARTS COLLEGE
GOVERNMENT OF TELANGANA
TELANGANA STATE
COUNCIL OF HIGHER EDUCATION
తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
TELUGU LITERARY CONGRESS (TLC) 2024
తెలుగు సాహిత్య మహాసభ 2024
15, 16, 17 ఫిబ్రవరి, 2024
రూం. నెం. 133, ఆర్ట్స్ కళాశాల,
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ
Abstracts

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376



Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007